మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 33 • పేజీలు:12+16 • వెల: రూ.5 బుధవారం • 3-1-2018 www.manamnews.com /manamnews

భారీగా ఐఏఎస్‌ల
బదిలీ
29 మందికి స్థాన చలనం
వికారాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి కలెక్టర్ల మార్పు
2లో..

మంద కృష్ణమాదిగ
అరెస్టు
ఉపవాస దీక్ష భగ్నం
శాంతియుత ఆందోళనకు పిలుపు
3లో..

ట్రంప్ వాతకు...
పాక్ పూత
అమెరికా రాయబారి డేవిడ్‌కు నిరసన
మంత్రిమండలి.. ఎన్నెస్సీతో ప్రధాని భేటీ
దేవుడు మేలుచేస్తే నిజాల వెల్లడి: ఖవాజా
7లో..
ఉగ్రవాదంపై పాక్ పోరాటం అద్భుతం: చైనా



హెచ్-1బి వీసా పొడిగింపునకు నో
కొత్త ప్రతిపాదనతో డీహెచ్‌ఎస్.. 'గ్రీన్‌కార్డ్' పెండింగ్‌లో ఉన్నా అంతే
గడువు పూర్తయితే విమానం ఎక్కాల్సిందే.. ప్రతిభావంతులకే ప్రాధాన్యం..
భాగస్వామికి పనిచేసే అవకాశం రద్దు.. భారతీయులపైనే ప్రభావం ఎక్కువ.. 75 వేలమంది భారతీయులు వెనక్కి?
7లో..

మునిసిపాలిటీలుగా 50 నగర పంచాయతీలు?
కార్పొరేషన్‌గా మారనున్న సిద్దిపేట.. మున్సిపల్ చట్ట సవరణకు సన్నాహాలు

హైదరాబాద్, జనవరి 2 (మనం న్యూస్):

రాష్ట్రంలోని 50 నగర పంచాయతీలు మునిసిపాలిటీలుగా మారనున్నాయి. మునిసిపాలిటీగా ఉన్న సిద్దిపేటను కార్పొరేషన్‌గా మార్చనున్నట్లు సమాచారం. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర శివార్లలో గల కొన్ని గ్రామాలను సమీప మునిసిపాలిటీల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ఈ మార్పుల కోసం, రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మునిసిపల్ చట్టంలో సవరణలను తీసుకురానున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ నగర శివార్లలోని గ్రామ పంచాయతీల పరిధిలోని భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. వీటిని ప్లాట్లుగా చేసి అమ్మడానికి హెచ్‌ఎండీఏ నుంచి అనుమతి తీసుకోవాలి. అయితే అందుకు భిన్నంగా రియల్టర్లు, బిల్డర్ల దగ్గర నుంచి ప్రభుత్వ సిబ్బంది, అధికారులు లక్షలాది **మిగతా 6లో..**





తెలంగాణ ఆణిముత్యం
24 గంటల విద్యుత్ కార్యసాధకుడు
సీఎండీ ప్రభాకరరావుకు అర్చకుల ఆశీర్వచనాలు

హైదరాబాద్, జనవరి 2: బంగారు తెలంగాణ ఆణిముత్యం జెన్‌కో-ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకరరావు అని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్, తెలంగాణ విద్వత్సభ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మంగళవారం జెన్‌కో కార్యాలయంలో ప్రభాకరరావును వేద పండితులు ఆశీర్వదించారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్తు సరఫరా **మిగతా 6లో..**

పుణె ఘర్షణల నేపథ్యంలో..
అట్టుడికిన ముంబై
ఆందోళనకారుల నిరసన హింసాత్మకం
రైళ్ల రాకపోకలకు ఆటంకం... రాస్తారోకో
పోలీసులతో ఘర్షణ.. ఐదుగురికి గాయాలు
మొన్నటి హింసకు 2 సంస్థలు కారణం
బి.ఆర్.అంబేద్కర్ మనవడు ప్రకాశ్ ఆరోపణ
ప్రభుత్వ వైఫల్యంపై నేడు బంద్‌కు పిలుపు
సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ: ఫడ్నవీస్
6లో..





తెలంగాణ ఆదర్శం
సాగుకు నిరంతర విద్యుత్‌పై 'రాజస్థాన్ పత్రిక'
సంపాదకీయంలో టీఆర్‌ఎస్ సర్కారుపై ప్రశంస
దేశంలోని రాష్ట్రాలన్నీ పాఠం నేర్వాలని సూచన
రైతు హక్కులకు ఆటంకాలు ఎందుకంటూ ప్రశ్న
ఈ అంశంపై పార్లమెంటులో చర్చకు ప్రతిపాదన



జైపూర్, జనవరి 2:

తెలంగాణ ప్రభుత్వం కొత్త ఏడాది ఆరంభ క్షణంనుంచీ వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా ప్రారంభించడంపై 'రాజస్థాన్ పత్రిక' ప్రశంసలు కురిపించింది. ఈ మేరకు మంగళవారం **మిగతా 6లో..**



అది కూడా ఓ రికార్డేగా అంటున్నారు సార్ పవన్...

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో బుధవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతలో మార్పులేదు.. రాత్రిపూట చలి తీవ్రత స్వల్పంగా పెరుగుతుంది. గంటకు 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.


గరిష్ఠ ఉష్ణోగ్రత: 30 డిగ్రీలు
కనిష్ఠ ఉష్ణోగ్రత: 14 డిగ్రీలు
గాలిలో తేమ: 50 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: విదియ రా.12.38 తదుపరి తదియ; నక్షత్రం: పునర్వసు ఉ.8.46, పుష్యమి ఉ.6.05; వర్జ్యం: మ.3.53-5.18; దుర్ముహూర్తం: ఉ.11.59-12.43; రాహుకాలం: మ.12.21-1.43; అమృతఘడియలు: ఉ.6.42-8.06;


సూర్యోదయం: 6.50
సూర్యాస్తమయం: 5.50

గజల్ శ్రీనివాస్..
గలీజు వేషాలు



'ఆలయ వాణి' ఆఫీసులో మసాజ్
బలవంతంగా కౌగిలింతలు..
ఆధారాలతో యువతి ఫిర్యాదు
పోలీసులకు ఫుటేజీల అందజేత
ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణ
అరెస్టు.. కోర్టులో విచారణ..
ఈ నెల 12 వరకు రిమాండ్
చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైదరాబాద్, జనవరి 2:



లైంగిక వేధింపుల కేసులో ప్రముఖ గజల్ కళాకారుడు కేసిరాజు శ్రీనివాస్ అలియాస్ 'గజల్' శ్రీనివాస్‌ను పోలీసులు మంగళవారం ఉదయం అరెస్ట్ చేశారు. గజల్ శ్రీనివాస్ తనను లైంగికంగా వేధించినట్లు ఓ మహిళ డిసెంబర్ 29న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనికి తగు ఆధారాలను పోలీసులకు అందజేసింది. దీంతో పోలీసులు ఆయనపై కేసు నమోదుచేసి మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. గజల్ శ్రీనివాస్ 'ఆలయవాణి' అనే వెబ్ రేడియోను నిర్వహిస్తున్నాడు.. ఈ రేడియోలో తాను జాకీగా పనిచేస్తున్నానని బాధితురాలు తెలిపారు. ఇటీవలి కాలం నుంచి గజల్ తనను వేధిస్తున్నాడని చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియో, ఆడియో ఆధారలనూ పోలీసులకు సమర్పించారు. ఈ ఆధారాలను పరీక్షించిన పోలీసులు ఆలయవాణి ఆఫీసు సిబ్బందిని విచారించి వేధింపులు నిజమేనని ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. ఆపై **మిగతా 6లో..**

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు..
చైర్మన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్
ఫైలుపై సీఎం కేసీఆర్ ఆమోద ముద్ర

హైదరాబాద్, జనవరి 2 :



రాష్ట్రానికి కొత్తగా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించిన ఫైలుపై మంగళవారం సీఎం కేసీఆర్ సంతకం **మిగతా 6లో..**

ఇంటర్‌లోనూ గ్రేడింగ్
మార్కుల విధానం తొలగించాలి
ఇంటర్ బోర్డును పటిష్ఠం చేయాలి
ప్రైవేట్ విద్యను నిర్వీర్యం చేయబోం
ఆ ఉద్దేశం ప్రభుత్వానికి లేదు: కడియం
3లో..





అనతి కాలంలోనే 'మనం'కు ప్రజాదరణ

- **పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**
- **'మనం' క్యాలెండర్‌ను ఆవిష్కరించిన చల్లా, మేయర్ నరేందర్**

వరంగల్ అర్బన్ జిల్లా , జనవరి 2 (మనం న్యూస్) : అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందిన మనం తెలుగు దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆకాంక్షించారు. నగర మేయర్ న రేందర్, ఎమ్మెర చల్లా ధర్మారెడ్డిని వారి నివాసాల్లో 'మనం' దినపత్రిక వరంగల్ అర్బన్ జిల్లా సిబ్బంది మంగళవారం ప్రత్యేకంగా కలిసి వారి చేతుల మీదుగా మనం తెలుగు దినపత్రిక 2018 క్యాలెండర్‌ను ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక అంశాలను మిళితం చేస్తూ ప్రభావిత వార్తలను 'మనం' అందిస్తోందని అభినందించారు. సోషల్ మీడియాలో పత్రిక మంచి గుర్తింపు పొందిందన్నారు. పత్రికా రంగంలో నేడు ఉన్న పోటీని తట్టుకొని, పత్రికకు గుర్తింపు తీసుకురావడంలో యాజమాన్యం, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మనం వరంగల్ జిల్లా బ్యూరో చీఫ్ ఎం.రజనీకాంత్, వరంగల్ ఏసీఎం మట్టెవాడ సురేందర్, అర్బన్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ దామెర రాజేందర్, రూరల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మునిగె ప్రభాకర్, జనగామ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జిలుకర రవికుమార్. ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దపల్లి 'జిల్లా'పై నీలినీడలు

- జిల్లాను కొనసాగించాలంటున్న ప్రజలు
- ఆందోళన చేస్తామంటున్న ప్రతిపక్షాలు
- ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్



పెద్దపల్లి , జనవరి 2 (మనం న్యూస్) : కొత్తగా ఏర్పడిన జిల్లాలను కుదించే యోచనలో ప్రభుత్వం ఉందంటూ వస్తున్న వార్తలతో పెద్దపల్లి జిల్లా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక జిల్లా పెద్దపల్లిని జిల్లాగా కొనసాగించకపోతే ఆందోళన చేస్తామంటూ ప్రజలతో పాటు ప్రతిపక్ష నాయకులు హెచ్చరిస్తున్నారు. పరిపాలనలో సౌలభ్యం కోసం అనేక మదింపుల అనంతరం రాష్ట్రంలోని పది జిల్లాలను 31 జిల్లాలుగా మార్పు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2016 దసరా నాటి నుంచి కొత్త జిల్లాల్లో పూర్తిగా అధికారిక పరిపాలన కొనసాగుతుంది. పెద్దపల్లి జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డి పదవి విరమణ పొందడంతో మంచిర్యాల కలెక్టర్‌కు జిల్లా అదనపు బాధ్యతలు అప్పజెప్పడంతో పెద్దపల్లి వాసుల్లో చర్చ మొదలయ్యింది. వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల వీలినంపై పత్రికల్లో వార్తలు వస్తుండడంతో జిల్లాల కుదింపు వ్యవహారంపై తీవ్ర చర్చ జరుగుతుంది. దీనికి తోడు చివరి దశలో ప్రభుత్వ నిర్ణయంతో ఏర్పడిన కొత్త జిల్లాలు జనగాం, నిర్మల్, మేడ్చల్, పెద్దపల్లి తదతర జిల్లాలను కొనసాగించాలా వద్దా అంటూ కేసిఆర్ యోచిస్తున్నట్లు పలు దిన పత్రికల్లో వస్తున్న కథనాలు ప్రజల్లో ఆందోళనను పెంచుతున్నాయి. సింగరేణితో, పారిశ్రామిక ప్రాంతంగా ఎదుగుతున్న పెద్దపల్లిని పదకొండు పాత మండలాలు, మూడు కొత్త మండలాలతో కలుపుకుని పెద్దపల్లిని జిల్లాగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించగానే స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అలాంటిది ఏడాది తిరగకుండానే ప్రజల ఆనందం ఆవిరయ్యే పరిస్థితి ఏర్పడింది. పెద్దపల్లి పార్లమెంట్, రామగుండం, మంథని, పెద్దపల్లి మూడ నియోజకవర్గాలతో ఏర్పాటైన పెద్దపల్లి జిల్లాను కొనసాగించాలని లేకుంటే వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ తప్పదని ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి. ఒక వైపు రామగుండం కమిషనరేట్ పరిధిలోని ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. మరోపక్క ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు పెద్దపల్లి జిల్లా మూలస్తంభంగా ఉంది. అన్ని మండలాలకు పెద్దపల్లి జిల్లా కేంద్రం అందుబాటులో ఉండడంతో సుపరిపాలన సాధ్యమవుతుంది. రైల్వే జంక్షన్, ప్రభుత్వ కార్యాలయాలు, డివిజన్ కార్యాలయాలు, రాజీవ్ రహదారికి తోడు లోక్‌సభ స్థానం పెద్దపల్లి జిల్లాకు ప్రాధాన్యం తెచ్చింది. ప్రభుత్వం వెంటనే స్పందించి పెద్దపల్లి జిల్లా విషయంలో స్పష్టమైన ప్రకటన చేయాలని స్థానిక నేతలు, ప్రజలు కోరుతున్నారు.

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, జనవరి 2 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 29 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు.

వివరాలు ఇలా ఉన్నాయి.

- రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శిగా సురేష్ చందా
- రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శిగా రాజేశ్వర్ తివారీ
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యదర్శిగా బీఆర్ మీనా
- వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శిగా శాంతికుమారికి అదనపు బాధ్యతలు
- కళాశాల, సాంకేతిక విద్య కమిషనర్‌గా నవీన్ మిట్టల్
- విపత్తు నిర్వహణ కమిషనర్‌గా ఆర్‌వీ చంద్రవదన్
- పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శిగా అరవింద్‌కుమార్
- బీసీ సంక్షేమశాఖ కార్యదర్శిగా బుర్రా వెంకటేశంకు అదనపు బాధ్యత
- పశు సంవర్ధక శాఖ కార్యదర్శిగా సందీప్‌కుమార్ సుల్తానీయ
- బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా అనితా రాజేంద్ర

మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా దాన కిషోర్‌కు అదనపు బాధ్యతలు

- గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌గా క్రిస్టినా
- ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా జ్యోతి బుద్ధ ప్రకాశ్
- భూపరిపాలన సంచాలకులుగా వాకాటి కరుణ
- రాష్ట్ర సమాచార కమిషన్ కార్యదర్శిగా ఇలంబర్తి
- సైనిక సంక్షేమ సంయుక్త కార్యదర్శిగా చంపాలాల్
- ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంచాలకులుగా ప్రీతీ మీనా
- వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఒమర్ జలీల్
- నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఎంఆర్‌ఎం.రావు
- పెద్దపల్లి కలెక్టర్‌గా దేవసేన
- జనగాం కలెక్టర్‌గా అనితా రామచంద్రన్‌కు అదనపు బాధ్యతలు
- మెదక్‌గా మాణిక్ రాజుకు అదనపు బాధ్యతలు
- మహబూబాబాద్ కలెక్టర్‌గా లోకేష్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు
- ప్రణాళిక బోర్డు కార్యదర్శిగా శివకుమార్ నాయుడు
- ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా అశోక్‌కుమార్
- ఢిల్లీలో తెలంగాణ భవన్ ఓఎస్‌డీగా కాళీచరణ్
- జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా భారతి హోళీకేరి
- జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా సిక్త్బాపట్నాయక్
- జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా ముషారఫ్ అలీ
- బోధన్ సంయుక్త కలెక్టర్‌గా అనురాగ్ జయంతి
- మెట్‌పల్లి సంయుక్త కలెక్టర్‌గా గౌతమ్
- భద్రాచలం సంయుక్త కలెక్టర్‌గా పమేలా సత్పతి
- బెల్లంపల్లి సంయుక్త కలెక్టర్‌గా రాహుల్ రాజ్

32 నెలల జీతం చెల్లించాలి

- **సంక్రాంతికి 1నెల జీతం ఇవ్వండి**
- **రేయాన్స్ ప్రతినిధులపై మంత్రుల ఆగ్రహం**

హైదరాబాద్, జనవరి 2(మనం ప్రతినిధి): భూపాలపల్లి జిల్లా కమలాపూర్ రేయాన్స్ ఫ్యాక్టరీ(బిల్ట్-బల్లాపూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్) కంపెనీ యాజమాన్యం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష ధోరణిపై ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, హోం, కార్మికమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి, గిరిజన, పర్యాటక శాఖ మంత్రి చందూలాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫ్యాక్టరీ మూతపడడంతో రోడ్డున పడిన దాదాపు 750 మంది కార్మికులకు సంక్రాంతి పండగ కోసం ఈ నెల 9లోపు కనీసం ఒక నెల జీతం చెల్లించాలని కంపెనీ ప్రతినిధికి డెడ్ లైన్ విధించారు. నెల జీతం కార్మికులకు ఇచ్చి, ఈ నెల 10న కంపెనీ సీఈవో సచివాలయంలో జరిగే సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. ఫ్యాక్టరీ మూతపడి రెండేళ్లు గడుస్తున్నా కార్మికుల సమస్యలను తీర్చడం లేదని రేయాన్స్ ఫ్యాక్టరీ యూనియన్ల జేఏసీ మంత్రులను ఆశ్రయించారు. వీరి ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయంలో యూనియన్ల నాయకులు, కంపెనీ ప్రతినిధులతో సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఫ్యాక్టరీ యాజమాన్య ధోరణిని మంత్రులకు యూనియన్ ప్రతినిధులు వివరించారు. 32 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, వేతనాలు ఇవ్వమని అడిగితే డెడ్ లైన్లు పెడుతున్నారు తప్ప ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్ఎంసీ బిల్లుపై మెడికోల ఆగ్రహం

- **రాష్ట్రవ్యాప్తంగా జూడాల నిరసన**

హైదరాబాద్, జనవరి 2(మనం న్యూస్): దేశవ్యాప్తంగా మంగళవారం ఉదయం జూనియర్ డాక్టర్లు, డాక్టర్లు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సారథ్యంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బిల్లును వ్యతిరేకించారు. బిల్లుకు నిరసనగా తెలంగాణలోని బోధనా ఆసుపత్రుల(ఉస్మానియా, గాంధీ, వరంగల్ కాళోజీ హెల్త్ యూనివర్సిటీల)కు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రైవేటు మెడికల్ కాలేజ్‌లలో మెడికోలు విధులను బహిష్కరించారు. అత్యవసర వైద్య సేవలు తప్ప ఓపీకి హాజరుకాలేదు. దీంతో ఎన్ఎంసీ బిల్లును వెనక్కు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జూనియర్ డాక్టర్ల డిమాండ్లలో ప్రధానంగా ఉన్న అంశాలను వైద్యులు తెలిపారు.

ఎన్ఎంసీ బిల్లులో ముఖ్యాంశాలు

ప్రస్తుతం అమల్లో ఉన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)ను ఏర్పాటు చేస్తారు. ఇకపై వైద్య విద్యకు సంబంధించి అన్ని వ్యవహారాలు ఎన్ఎంసీనే చూసుకుంటుంది. అలాగే హోమియోపతి, ఆయుర్వేదంవంటి ఆయుష్ వైద్యులకోసం ఒక బ్రిడ్జ్ కోర్సును తీసుకువచ్చింది. ఇది పూర్తిచేసిన ఆయుష్ వైద్యులు అల్లోపతిని ప్రాక్టీస్ చేయొచ్చు. ఐఎంసీ యాక్ట్ లోని క్లాజ్ 15 ప్రకారం ఎంబీబీఎస్ డాక్టర్లు మాత్రమే ఔషధాలను సిఫార్సు చేయాలి. కొత్తగా తీసుకొస్తున్న బిల్లులో ఈ క్లాజ్‌ను తీసివేయాలన్నారు. కాగా, హోమియోపతి, ఆయుర్వేదం వంటి వాటిని ప్రాక్టీస్ చేసే వైద్యులకోసం ప్రభుత్వం బ్రిడ్జ్ కోర్సు ఏర్పాటు చేస్తుంది. దీన్ని పూర్తిచేసిన వారిని ఎంబీబీఎస్ డాక్టర్లుగా గుర్తిస్తారు. వీరు ఇకపై ఎంబీబీఎస్ డాక్టర్లలాగే అల్లోపతి వైద్యాన్ని ప్రాక్టీస్ చేయొచ్చు. ఇది ఎంతో ప్రమాదకరమని ఐఎంఏ అంటోంది. ఆయుష్ వైద్యులకు అల్లోపతి అవకాశం ఇవ్వడమంటే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమనని హెచ్చరిస్తోంది.

ఓయూలో సైన్స్ కాంగ్రెస్‌కు ఆదేశాలివ్వలేం

హైదరాబాద్, జనవరి 2 (మనం లీగల్ ప్రతినిధి) : ఉస్మానియా యూనివర్సిటీలోనే ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. సమావేశాలు నిర్వహించేది ప్రభుత్వ సంస్థో కాదో చెప్పాలని పిటిషనర్లను బెంచ్ ఆదేశించింది. సమావేశాల నిర్వహణపై తెలంగాణ సర్కార్ తప్పుడు రిపోర్టు ఇచ్చిందని పిటిషనర్లు చేసిన ఆరోపణలపై వివరణ మాత్రమే కోరతామని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాం ప్రసాద్‌తో కూడిన డివిజన్ బెంచ్ చెప్పింది. ఓయూలో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించేలా ఆదేశించాలని కోరుతూ విద్యార్థులు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని మంగళవారం బెంచ్ విచారించింది.

గిరిజన సమస్యలపై గవర్నర్‌కు వినతి

హైదరాబాద్, జనవరి 2 (మనం ప్రతినిధి) : గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గవర్నర్ నరసింహన్‌కు వినతిపత్రం ఇచ్చామని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి రవీంద్రనాయక్ తెలిపారు. రాజ్యాంగం ప్రకారం గుర్తించిన లంబాడీ, గొండు, కోయ, కోలాం, తదితర 11 కులాలను తెలంగాణలోఆదివాసులుగా, గిరిజనులుగా పరిగణిస్తున్నారని, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ కల్పించడంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరామని ఆయన తెలిపారు.

13, 14 తేదీల్లో విరసం మహా సభలు


- **విజయవంతం చేయండి : హరగోపాల్**



మహబూబ్‌నగర్, జనవరి 2 (మనం ప్రతినిధి): ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే విప్లవ రచయితల సంఘం 26వ మహాసభను జయప్రదం చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్‌లోని టీఎన్‌జీవోస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని వ్యతిరేకిద్దాం, నూతన సమాజాన్ని నిర్మించుకుందామనే అంశంతో మహబూబ్‌నగర్‌లో మహాసభలు నిర్వహిస్తున్నామని హరగోపాల్ తెలిపారు. సాహిత్యం, కళలు, ప్రజాజీవితాన్ని బాగు చేసే సాధనాలు కావాలని నలభై ఏళ్లుగా విరసం కృషి చేస్తోందన్నారు. శ్రీశ్రీ, కుటుంబరావు, చెరబండరాజు, అబ్రహం వంటి ఎందరో విప్లవ రచయితలు భూస్వామ్య బ్రాహ్మణీయ సంస్కృతిని, మనుధర్మ భావజాలాన్ని , సామ్రాజ్యవాద సంస్కృతి, రాజకీయాలను వ్యతిరేకిస్తూ దేశ ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు రచనలు చేశారన్నారు. విరసం 26వ మహాసభను పాలమూరు జిల్లాలో తలపెట్టామని, మహబూబ్‌నగర్ అంటేనే నైజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఎగరేసిన దిక్కార పతాకాల రెపరెపలు కనిపిస్తాయన్నారు. దేశంలోని మతత్వ వ్యవస్థ భిన్నాభిప్రాయాలు ప్రకటించేవాళ్లను నిర్మూలిస్తుందని, పాత్రికేయురాలు, రచయిత గౌరీలంకేష్ హత్య ఇందుకు నిదర్శనమన్నారు. భారత రాజ్యాంగంలోని లౌకిక విలువలను కూడా ఫాసిజం దెబ్బతీస్తుందన్నారు. జనవరి 13 నుంచి జరిగే సభల్లో విరసం బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని విశ్లేషిస్తుందన్నారు. ఈ సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, టీజేఏసీ జిల్లా చైర్మన్ రాజేందర్‌రెడ్డి, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం. ఖలీల్, ప్రొఫెసర్ చక్రధర్‌రావు, యాదగిరి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చూచిరాతతో విద్యా ప్రమాణాలకు దెబ్బ

పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వ్యాజ్యంపై విచారణ




హైదరాబాద్, జనవరి 2 (మనం లీగల్ ప్రతినిధి) : పరీక్షల్లో చూచిరాతకు పాల్పడే వారితో పాటు, ఆ పనిని ప్రోత్సహిస్తున్న వారి వల్ల విద్యా ప్రమాణాలు దిగుజారుతున్నాయని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. మాస్ కాపీయింగ్‌ను నివారించేందుకు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఏలూరుకు చెందిన ప్రొఫెసర్ గుంటుపల్లి శ్రీనివాస్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం మరోసారి విచారణ జరిపింది. గత ఏడాది జరిగిన పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌పై తెలంగాణలో నాలుగు, ఏపీలో ఒకే ఒక్క కేసు నమోదు అయ్యిందంటూ అధికారులు ఇచ్చిన నివేదికలను చూస్తే ఏం చెప్పాలో అర్థం కావడం లేదని హైకోర్టు బెంచ్ విస్తుపోయింది. పరీక్షల చట్టం 1997లో కేసు నమోదుతోపాటు ప్రాసిక్యూషన్‌కు వీలుగా చట్టాన్ని మారిస్తే మాస్‌కాపీయింగ్ రోగం కుదుటపడుతుందని బెంచ్ వ్యాఖ్యానించింది. ఒత్తిడి వల్ల విద్యార్థులు పరీక్షల్లో తప్పుడు దారి ఎన్నుకుంటున్నారని, విద్యార్థి దశలో అనైతిక ప్రమాణాలకు ప్రేరిపితం అవుతున్నారని బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. చాలా పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, మిగిలిన చోట్ల కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని తెలంగాణ ప్రభుత్వ లాయర్ చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటు ప్రభుత్వ విధాన నిర్ణయం కాబట్టి ప్రభుత్వ వైఖరి స్పష్టం చేసేందుకు సమయం కావాలని ఏపీ ప్రభుత్వ లాయర్ కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటు ఆర్థిక భారం కాబట్టి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చెప్పాలని పిటిషనర్‌ను బెంచ్ కోరింది. విచారణ ఈ నెల 23కి వాయిదా పడింది.

వృద్ధ దంపతుల దారుణ హత్య

- కాజీపేటలో గుర్తు తెలియని వ్యక్తుల అరాచకం
- కుటుంబసభ్యులపై అనుమానం



వరంగల్ క్రైమ్, జనవరి 2 (మనం న్యూస్) : గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో ఓ వృద్ధ జంట హత్యకు గురయ్యింది. హత్య వెనుక కుటుంబసభ్యుల హస్తంపై అనుమానులు వ్యక్తం అవుతున్నాయి. కాజీపేట సోమిటి రోడ్డులో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. సౌత్ సెంట్రల్ రైల్వే విశ్రాంత ఉద్యోగి చుంచు ఎల్లయ్య (72), అతడి భార్య పూలమ్మ (50)తో కలిసి స్థానికంగా సోమిడిలో నివసిస్తున్నారు. ఎల్లయ్య మొదటి భార్య ఎల్లమ్మ పదేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకొని మరణించింది. ఆమెకు ముగ్గురు కుమారులున్నారు. భార్య చనిపోవడంతో ఎల్లయ్య రెండో పెళ్లి చేసుకోగా అది నచ్చని మొదటి భార్య కుమారులు వేరుగా ఉంటున్నారు. పొలం అమ్మిన డబ్బు విషయంలో కొద్ది రోజుల క్రితం తండ్రీ కోడుకుల మధ్య ఘర్షణ జరిగింది. అయితే సోమవారం అర్ధరాత్రి పూలమ్మ బాత్‌రూమ్ వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను హతమార్చారు. తర్వాత ఇంట్లోకి ప్రవేశించి నిద్రిస్తున్న ఎలయ్యను కత్తితో మెడ కోసి చంపారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ సత్యనారాయణ, సిఐ అజయ్‌కుమార్ పరిశీలించారు. కుటుంబసభ్యులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు.



తాగుబోతు కొడుకును కొట్టిచంపిన తల్లి

మంథని, జనవరి 2(మనం న్యూస్): తాగుబోతు కొడుకు రోకలిబండతో కొట్టి చంపిన ఘటన పెద్దపల్లి జిల్లాలో చోటు చేసుకుంది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎరుకల గూడెం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘటన వివరాలు పోలీసులు మీడియాకు తెలిపారు. ఎరుకల గూడెం గ్రామానికి చెందిన ఈర్నాల రేణుకకు ఇద్దరు కొడుకులు. చిన్న కొడుకు దినేష్ గత కొద్దికాలంగా మద్యానికి బానిసై డబ్బుల కోసం నిత్యం వేధిస్తున్నాడు. తల్లిపట్ల కూడా ఆసభ్యంగా ప్రవర్తించేవాడు.

సోమవారం రాత్రి తన తల్లితో గొడవ పడ్డాడు. భరించలేని తల్లి పక్కనే ఉన్న రోకలి బండతో కొట్టడంతో దినేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంథని సిఐ నటేష్, ఎస్.ఐ ఉపేందర్‌రావులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చెసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ అభివృద్ధిలో అటవీశాఖ పాత్ర కీలకం

- **అటవీ ప్రధాన సంరక్షణ అధికారి పీకే ఝా**
- **అరణ్యభవన్‌లో నూతన సంవత్సర వేడుకలు**



హైదరాబాద్, జనవరి 2 (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో అటవీ శాఖ కీలకపాత్ర పోషిస్తోందని అటవీ ప్రధాన సంరక్షణ అధికారి పీకే ఝా పేర్కొన్నారు. అటవీశాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవన్‌లో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా పీకే ఝా మాట్లాడుతూ అటవీ శాఖ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తోంది, కొత్త ఏడాదిలో సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఉన్నతాధికారులు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారిని మర్యాదపూర్వకంగా కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్ఎస్ అవార్డు గ్రహీతలకు సీఎం కేసీఆర్ అభినందనలు

హైదరాబాద్, జనవరి 2:జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్.) విభాగంలో కేంద్రం అందించిన అత్యున్నత అవార్డులు అందుకున్న తెలంగాణ వలంటీర్లను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మంగళవారం అభినందించారు. 2016-17 సంవత్సరానికి కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ అందించిన ఎన్.ఎస్.ఎస్. అవార్డుల్లో తెలంగాణ రాష్ట్రం నాలుగు దక్కించుకుంది. ఉత్తమ యూనిట్ అవార్డు మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్‌కు చెందిన అనురాగ్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌కు, ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు అనురాగ్ గ్రూప్ ప్రోగ్రాం ఆఫీసర్ సి.మల్లేశ్, ఉత్తమ వలంటీర్లుగా ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీకి చెందిన తగరపు నవీన్, జె.ఎన్.టి.యు(హెచ్)కు చెందిన పటుకూరి లలిత్ ఆదిత్య గత నెలలో అందుకున్నారు. వీరిని సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. రాష్ట్ర మాజీ లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎంఎస్ఎన్ రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రగతిభవన్‌లో శుభాకాంక్షల సందడి


- సీఎంను కలిసిన నల్లగొండ జిల్లా నేతలు

హైదరాబాద్, జనవరి 2(మనం ప్రతినిధి): నూతన సంవత్సరం సందర్భంగా నల్లగొండ జిల్లాకు చెందిన పార్టీ ప్రముఖులు మంగళవారం నాడు సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలంగాణ శాసన మండలి డిప్యూటి స్పీకర్ విద్యాసాగర్ రావు, జిల్లా మంత్రి జగదీష్‌రెడ్డి, తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంత చారీ తల్లి శంకరమ్మతో పాటు పలువురు ఎమ్మెల్సీలు, తాజా, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు ఇతరులు ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

సచివాలయంలో..

నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం సచివాలయంలో సందడి నెలకొంది. వివిధ స్థాయిల అధికారులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఉన్నతాధికారుల రాకతో సచివాలయంలో కొత్త కళ సంతరించుకుంది. మంత్రుల పేషీలు శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చిన కార్యకర్తలు, ఉద్యోగులతో రద్దీగా మారాయి. ఈ సందర్భంగా సచివాలయం ఏ బ్లాకులో సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్ రావు ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

నిజం తెలుసుకొని మాట్లాడు



కేసీఆర్ మాటల మాయలో పడొద్దు

- అవినీతి, రైతు ఆత్మహత్యల రాష్ట్రమిది
- పవన్ కల్యాణ్‌కు రేవంత్ రెడ్డి సూచన
- విద్యుత్‌పై చర్చకు సిద్ధమని ప్రకటన

హైదరాబాద్, జనవరి 2(మనం ప్రతినిధి): 24 గంటల ఉచిత విద్యుత్‌పై రాష్ట్ర ప్రభుత్వం చెప్పే మాయ మాటలు నమ్మకుండా.. తెలంగాణలో ఏం జరుగుతోందో తెలుసుకుని మాట్లాడాలంటూ కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి పవన్ కల్యాణ్‌కు సూచించారు. మిగులు విద్యుత్, 24 గంటల ఉచిత కరెంటు సరఫరాపై సీఎం కేసీఆర్ మాటల మాయలో పవన్ పడ్డారని విమర్శించారు. ఈ మేరకు మంగళవారం నాడు గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ అంటూ కేసీఆర్ పాలనకు పవన్ కితాబివ్వటాన్ని ఖండించారు. విభజన సమయంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి జనాభా ప్రకారంగా విభజన జరిగితే తెలంగాణ చీకటి రాష్ట్రంగా మారుతుందని సోనియాకు చెప్పారన్నారు. దీంతో విద్యుత్ వినియోగం ఆధారంగా విభజించాలంటూ సోనియాగాంధీ ప్రధానికి సూచించారు. ఈ నేపథ్యంలో విద్యుత్ కేటాయింపులను 54శాతం తెలంగాణకు, 46శాతం ఏపీకి పంచారని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ కష్టాలు లేకపోవడానికి కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు కొంత కారణం కాగా, సోనియా దయ, కేంద్రం చేపట్టిన ఉదయ్ పథకాలు కారణమని రేవంత్ వివరించారు. ఈ విషయంలో నిజానిజాలు తెలుసుకోవడానికి విద్యుత్ జేఏసీ నేత రఘు రాసిన పుస్తకాన్ని పంపిస్తాను.. చదవాలని పవన్ కల్యాణ్‌ను రేవంత్ కోరారు. మూడున్నరేండ్లలో కేవలం నాలుగుసార్లు మాత్రమే కేసీఆర్ సచివాలయానికి వచ్చిన విషయాన్ని పవన్ గుర్తించాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3,400 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన లెక్కలను ఒక్కసారి పరిశీలిస్తే 55.54 లక్షల మంది రైతుల్లో 48 లక్షల మంది రైతులు సన్న, చిన్నకారేనని తెలిపారు. వీరికి పగలు నిరంతరాయంగా తొమ్మిది గంటలు విద్యుత్ ఇస్తే సరిపోతుందన్నారు. అయితే, టీఆర్ఎస్ సర్కారు కమీషన్ల కక్కుర్తితో ప్రైవేటు విద్యుత్ సంస్థలతో కుమ్మక్కై 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అంటూ ఆర్భాటపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అధనంగా ఒక్క మెగా వాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో ఇసుక మాఫియాకు రాష్ట్రంలో అడ్డులేకుండా పోయిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. 1500 మందికి పైగా తెలంగాణ ఉద్యమంలో అమరులైతే కేవలం 500కి పైగా మాత్రమే ప్రభుత్వం గుర్తించిందన్నారు. మిగిలిన వారికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేసీఆర్ విస్మరించారన్నారు. నక్సల్స్ ఎజెండా అంటూనే బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారన్నారు. గిట్టుబాటు ధర అడిగిన రైతులకు బేడీలు వేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని పవన్ కల్యాణ్ పొగడడం విచారకరమన్నారు. విద్యుత్‌పై గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వంతో బహిరంగ చర్చకు తాను సిద్ధమని రేవంత్ సవాల్ విసిరారు.

శత్రువులు.. మిత్రులయ్యారు!

- పాత పెన్షన్ విధానమే కావాలి
- సీఎస్‌ను కలిసిన ప్రొ.కోదండరాం



హైదరాబాద్, జనవరి 2(మనం న్యూస్): ప్రభుత్వానికి ఇప్పుడు ఆప్తులు శత్రువులయ్యారు.. శత్రువులు ఆప్తులయ్యారని జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, సీఎం కేసీఆర్ భేటీపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచనతో అపాయింట్‌మెంట్ అడిగితే ఇవ్వకుండా, పవన్ కల్యాణ్‌కు అవకాశం ఇవ్వడాన్ని తప్పుబట్టారు. మొన్న తిట్టుకున్న వాళ్లు.. నిన్న పొగుడుకుంటున్నారని అన్నారు. ఈమేరకు మంగళవారం నాడు సీఎస్ ఎస్పీ సింగ్‌ను కలిశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం కోదండరాం మీడియాతో మాట్లాడుతూ టెట్ రాసిన ప్రతి అభ్యర్థికీ టీఆర్‌టీ రాసే అవకాశం ఇవ్వాలని కోరారు. టీచర్ పోస్టుల భర్తీలో టెట్‌కు లేని నిబంధనలు టీఆర్టీకీ ఎందుకని ప్రశ్నించారు. ఏపీలో పనిచేస్తున్న 4వ తరగతి ఉద్యోగులను తెలంగాణకు తీసుకురావాలని ఈ సందర్భంగా కోదండ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను స్వాగతిస్తున్నామని చెబుతూనే.. దానివల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు.

రాష్ట్రానికి వెలుగునిచ్చే ఏడాది 2018

- 24 గంటల కరెంటు వెనక..

సీఎం కేసీఆర్ కృషి, ఇంజనీర్ల ప్రతిభ: పల్లా

హైదరాబాద్, జనవరి 2(మనం ప్రతినిధి): తెలంగాణకు వెలుగునిచ్చేదిగా 2018 సంవత్సరం.. అద్భుతంగా ప్రారంభమైందని శాసన మండలి విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. టీఆర్ఎస్ఎల్పీలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో 24 నిరంతరం విద్యుత్‌పై కూలంకశంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతాన్ని తిప్పికొట్టారు. కొత్త సంవత్సరం ఆరంభంలోనే వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు సరఫరాను ప్రారంభించి సీఎం కెసీఆర్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని స్పష్టంచేశారు. గతంలో తెలంగాణ రైతులు ఎదుర్కొన్న కరెంటు కష్టాలు అంత సులభంగా మరిచిపోరని ఆయన గుర్తుచేశారు. ఏపీ చిట్ట చివరి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణలో కరెంటు సమస్యపై హెచ్చరించిన విషయం కాంగ్రెస్ నేతలకు తెలియదా? అని ప్రశ్నించారు. సీఎం కెసిఆర్ సమర్థత వల్లే తెలంగాణ కరెంటు కష్టాలు తొలిగిపోయాయన్నారు. గతంలో 24 గంటలు కరెంటిస్తే టీఆర్ఎస్‌కు ప్రచారం చేస్తానని విపక్ష నేత జానారెడ్డి అసెంబ్లీలోనే చెప్పారని గుర్తుచేశారు. 24 గంటల కరెంటు చారిత్రాత్మకమని.. కర్ణాటక మంత్రీ రేవణ్ణ గుర్తుచేసింది వాస్తవం కాదా? నీలదీశారు. తమ రాష్ట్రం కర్నాటకలో చేయని పనిని తెలంగాణలో కేసీఆర్ సాధించి చూపారని ఆయన ప్రశంసించారని పల్లా గుర్తుచేశారు.

ఆ పొగడ్త వెనక పవన్ ఆంతర్యమేంటి?: వీహెచ్

హైదరాబాద్, జనవరి 2(మనం న్యూస్): తెలంగాణ సీఎం కేసీఆర్‌ను ప్రశంసించడం వెనక పవన్ కల్యాణ్ ఆంతర్యమేంటని కాంగ్రెస్ నేత వీహెచ్ ప్రశ్నించారు. పవన్ కల్యాణ్.. సీఎం కేసీఆర్‌ను మెచ్చుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల గవర్నర్ ఇచ్చిన విందులో కేసీఆర్, పవన్ సమావేశమైనప్పుడే తాను సందేహించానని చెప్పారు. 24 గంటల విద్యుత్ పంపిణీ పూర్తి స్థాయిలో ప్రారంభం కాకముందే పవన్ మెచ్చుకోవడమేంటని నిలదీశారు. రైతుల స్పందన తెలుసుకొని ఆపై మాట్లాడితే బాగుంటుందని వీహెచ్ హితవు పలికారు. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఎందుకు స్పందించడంలేదని పవన్‌ను నిలదీశారు. టాలీవుడ్ డ్రగ్స్ మాఫియాను కాపాడేందుకే పవన్ కేసీఆర్‌ను పొగిడారని వీహెచ్ ఆరోపించారు. జగన్ అవినీతిని ప్రశ్నించిన జనసేనానికి కేసీఆర్ అవినీతి కనిపించడం లేదా అని నిలదీశారు. సీఎం కేసీఆర్‌ను పొగడడంతో ఆయన చిత్తశుద్ధి బయటపడిందని వీహెచ్ ఎద్దేవాచేశారు.

గల్ఫ్ బాధితులను ఆదుకోండి

- గవర్నర్‌కు బీజేపీ నేతల విజ్ఞప్తి
- రాష్ట్రప్రభుత్వం విఫలమైందని ఆరోపణ



హైదరాబాద్, జనవరి 2(మనం న్యూస్): గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమని, వారి కష్టాలు తీర్చడంలో సర్కారు పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. లక్ష్మణ్‌తో పాటు, తెలంగాణ బీజేపీ నేతలు గవర్నర్ నరసింహన్‌ను మంగళవారం కలిసి 'గల్ఫ్ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలపై' వినతి పత్రం అందజేశారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్ఆర్ఐ పాలసీ తీసుకొస్తామని టీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టిందని, ఇంతవరకు ఆ పాలసీ తీసుకురాలేదని గవర్నర్‌కు చెప్పామన్నారు. తెలంగాణ నుంచి దాదాపు 10 లక్షల మంది గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నారని, ఇక్కడ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక చాలామంది తెలుగు వాళ్లు వలస బాట పడుతున్నారన్నారు. గల్ఫ్ బాధితుల కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని, గల్ఫ్‌లో మరణించిన వారి కుటుంబాలను రూ.6 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు. ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారికి డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు. అదేవిధంగా భూమి లేని కార్మికులకు భూమిని కేటాయించాలని కోరినట్లు లక్ష్మణ్ పేర్కొన్నారు. గల్ఫ్ బాధితులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపచేయాలని, రేషన్ కార్డుల నుంచి వారి పేర్లను తొలగించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెక్రటేరియట్లో ఎన్ఆర్ఐ సెల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ టామ్‌కామ్ ద్వారానే గల్ఫ్ ఉద్యోగాలకు వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ప్రచారం చేపట్టాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ బాధితులకు న్యాయం జరిగేంతవరకు బీజేపీ పోరాడుతుందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాష్, బీజేపీ రాష్ట్ర మీడియా కమిటీ కన్వీనర్ సుధాకర్ శర్మ, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ నాయుడు, గల్ఫ్ బాధితుల కుటుంబ సభ్యులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నెలాఖరులో రాష్ట్రానికి రాహుల్

- వరంగల్‌లో దళిత, బీసీ ఆత్మగౌరవ సభ: ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 2(మనం ప్రతినిధి): ఈ నెలాఖరులో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రంలో పర్యటించనున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో మంగళవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు, సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ కుంతియా ఆధ్వర్యంలో అంతర్గత సమావేశాలను నిర్వహించారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్తు యూపీఏ ప్రభుత్వ చలవేనని పేర్కొన్నారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో 26 రాష్ట్రాలు విద్యుత్‌లో సర్‌ప్లస్ ఉన్నాయన్నారు. ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన సర్వేల్లో కాంగ్రెస్‌కు అనుకూల సంకేతాలు వస్తున్నాయని తెలిపారు. వరంగల్‌లో దళిత, గిరిజన, బీసీ ఆత్మగౌరవ సభను నిర్వహిస్తామని ఉత్తమ్ పేర్కొన్నారు. కార్యకర్తలంతా సమష్టిగా కృషిచేస్తే 2019లో అధికారం కాంగ్రెస్‌దేనన్నారు. ప్రధానంగా బూత్ లెవల్‌లో ఓటర్ల విషయంలో పరిశీలన జరగాలన్నారు.


పార్టీలోకి చేరికలు..

ఎంఐఎం పార్టీ నుంచి పలువురు నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. ఎంఐఎం నుంచి బిలాల్‌తో పాటు పలువురు ముఖ్యులు చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వీ. హనుమంతరావు పాల్గొన్నారు.



ఇంటర్‌లోనూ గ్రేడింగ్

- మార్కుల విధానం తొలగించాలి
- ఇంటర్ బోర్డును పటిష్ఠం చేయాలి
- ప్రైవేట్ విద్యను నిర్వీర్యం చేయబోం
- ప్రగతిపథంలో ఇంటర్ విద్య: కడియం



హైదరాబాద్, జనవరి 2 (మనం ప్రతినిధి): ఇంటర్ బోర్డును దేశంలో మొదటి స్థానంలో నిలపాలని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. ఇంటర్‌లో మార్కుల విధానాన్ని తొలగించి గ్రేడింగ్ విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'ప్రగతి పథంలో ఇంటర్ విద్య' పేరుతో నిర్వహించిన సదస్సులో కడియం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యా వ్యాపారాన్ని తగ్గించాలని, విద్యాప్రమాణాలు పెంచే విధంగా కృషి చేయాలన్నారు. ప్రైవేట్ విద్యను నిర్వీర్యం చేయాలన్న ఆలోచనగానీ, కక్షగానీ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టంచేశారు. ప్రభుత్వ విద్యను పటిష్టం చేయడమే ప్రభుత్వం ముందున్న లక్ష్యం అన్నారు. తెలంగాణలో చదివిన విద్యార్థి ప్రపంచంలో ఎవరితోనైనా పోటీ పడేలాఉండాలన్నారు. వేసవి సెలవుల్లో ప్రభుత్వ ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా జేఈఈ నీట్ పరీక్షల కోచింగ్ ఇస్తామన్నారు. కార్పొరేట్ ర్యాంకులకు పోటీగా ప్రభుత్వ కాలేజీలకు ర్యాంకులు రావాలన్నారు. గత మూడేళ్లలో ఇంటర్ కాలేజీల్లో మౌలిక వసతులపై రూ.350 కోట్లు ఖర్చు చేశామని కడియం తెలిపారు. మరో రూ.350 కోట్లు ఖర్చుచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇంటర్‌లో విద్యార్థుల నమోదు పెరగడానికి లెక్చరర్ల కృషే కారణమని ప్రశంసించారు. లెక్చరర్లు బోధనను ఉద్యోగ బాధ్యతతో పాటు సామాజిక బాధ్యతగా నిర్వహించాలని అన్నారు. గతంలో తాను జూనియర్ లెక్చరర్‌గా పని చేశానని, ఆ వ్యవస్థ వర్ధిల్లాలని ఎప్పుడూ కోరుకుంటానని మంత్రి తెలిపారు.

198 కోట్లతో కేజీబీవీలు..

రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో రూ.198 కోట్లతో 61 అకడమిక్ బ్లాక్‌లు, 34 కేజీబీవీల నూతన భవనాలకు ఈ నెల 15వ తేదీలోపు శంకుస్థాపనలు చేసి.. ఈ ఏడాది అక్టోబరు నాటికి భవనాలు పూర్తి చేయాలని మంత్రి కడియం శ్రీహరి అధికారులకు గడువు విధించారు. తెలంగాణ రాష్ట్ర కసూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు దేశంలో అత్యుత్తమంగా ఉన్నాయని, వీటిని మరింత పటిష్టంగా మార్చాలని చెప్పారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ), మోడల్ స్కూల్స్, విద్యాశాఖ గురుకుల విద్యాలయాల్లోని విద్యార్థుల వసతులు, హెల్త్ కిట్ల పంపిణీ, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఇతర అధికారులతో సచివాలయంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి సమీక్షించారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, విద్యాశాఖ గురుకుల విద్యాలయాల్లో మొత్తంగా 1, 03,000 మంది విద్యార్థులున్నారని, వీరందరికీ ఈ నెల 9వ తేదీలోపు హెల్త్ కిట్లను పంపిణీ చేయాలని సూచించారు. హెల్త్ కిట్లను నాలుగు దఫాలుగా 12 నెలలకు సరిపడే విధంగా మూడు నెలలకొకసారి పంపిణీ చేయాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకుని జిల్లాల వారిగా కలెక్టర్ల నేత త్వంలో జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి కడియం శ్రీహరి సూచించారు.



మందకృష్ణ మళ్లీ అరెస్టు

- ఉపవాస దీక్షను భగ్నం చేసిన పోలీసులు
- కంచన్‌బాగ్ పోలీసు స్టేషన్‌కు తరలింపు
- శాంతియుత ఆందోళనకు పిలుపు

హైదరాబాద్, జనవరి 2 (మనం ప్రతినిధి): ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను పోలీసులు మంగళవారం మరోసారి అరెస్టు చేశారు. ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో పార్శీగుట్టలోని తన కార్యాలయంలో మందకృష్ణ 48 గంటల ఉపవాస దీక్షను ప్రారంభించారు. అనుమతి లేకుండా దీక్షకు దిగడంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. పార్శీగుట్టలోని కార్యాలయం నుంచి ఆయనను కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తొలుత పాత బస్తీకి తరలించిన పోలీసులు అక్కడి నుంచి కంచన్‌బాగ్‌కు తీసుకెళ్లారు. 20 మందికి పైగా మందకృష్ణ అనుచరులను ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు బుధవారం తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల ఎదుట శాంతియుత ఆందోళనలు చేయాలని, గురువారం రహదారులపై ఆందోళనలు చేయాలని మందకృష్ణ పిలుపునిచ్చారు. అయితే దీక్షకు అనుమతి కోరితే సీపీ నిరాకరించారని, ఉపవాస దీక్ష ఆపనని ఈ సందర్భంగా మందకృష్ణ తెలిపారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

బుధవారం, జనవరి 3


మాయ డబ్బు

డబ్బులేని ప్రపంచం కలలో మాత్రమే సంభవమని కమ్యూనిస్టు సమాజం గురించి ఎగతాళి చేసినవారు ఇటీవల కాలంలో ప్రభంజనంలా దూసుకు వస్తున్న క్రిప్టో కరెన్సీలను చూసి ముక్కున వేలేసుకోవాల్సి వస్తోంది. ప్రపంచమంతా వివిధ రంగాల్లో మాదిరిగా ద్రవ్య రంగంలోనూ కాగితపు డబ్బులేని డిజిటల్ విప్లవం సాధించే వైపుగా ప్రయాణిస్తోంది. అందులో భాగంగా మోదీ ప్రభుత్వం డబ్బులేని డిజిటల్ లావాదేవీలకు పెద్దపీట వేసింది. అయితే డబ్బులేని సమాజాన్ని సృష్టించడంలో భాగంగా మొదట 'తక్కువ డబ్బు' చలామణి కోసం కృషి చేస్తానని మోదీ గంభీరంగా ప్రకటించడమే కాకుండా, పెద్ద నోట్ల రద్దు చేశారు. కొత్త నోట్లు చలామణిలోకి వచ్చేంత దాకా అనేక ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఆన్‌లైన్ డిజిటల్ లావాదేవీలపై ప్రజలను ఆధారపడేట్లు చేశారు. అలాంటిది నోట్లు అవసరంలేని క్రిప్టో కరెన్సీ (మాయా ధనం, అభూత ద్రవ్యం)పై దేశ ప్రజల్లో పెరుగుతున్న వ్యామోహం చూసి మోదీ ప్రభుత్వం ఉలిక్కిపడుతోంది. గత ఏడాది జనవరి 3 నాటికి 1,030 డాలర్లుగా ఉన్న బిట్ కాయిన్ ధర (విలువ కాదు) ఈ జనవరి 2 నాటికి 13,268 డాలర్లకు పెరిగింది. రాజ్యసభ ప్రశ్నా సమయంలో క్రిప్టో కరెన్సీ ప్రపంచ వాణిజ్యంలో 11 శాతం వాటాను కలిగిన భారత్‌లో బిట్ కాయిన్, ఈథేరియం, నేమ్‌కాయిన్, లైట్ కాయిన్, పీర్ కాయిన్ వంటి మాయా ధన లావాదేవీలను ప్రభుత్వం క్రమబద్ధం చేయనుందా? అని డిఎంకె సభ్యురాలు కణిమొళి ప్రశ్నకు సమాధానంగా బిట్ కాయిన్ వంటి వాటికి చట్టబద్ధత లేదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. వాటిపై నిర్ణయం తీసుకునే ముందు క్రిప్టో కరెన్సీలపై నిపుణుల నివేదిక కోసం ఎదురుచూస్తున్నట్లు మంగళవారం పార్లమెంట్‌లో ఆయన తెలియజేశారు. బిట్ కాయిన్స్ వంటి అభూత ద్రవ్య లావాదేవీలు పాంజీ స్కీం (మనీ లేదా సరుకుల అమ్మకం రూపంలోని చైన్ వ్యాపారం) వంటి అక్రమ వ్యాపారమని ప్రభుత్వం ప్రకటించింది. పాంజీ స్కీం వంటి బిట్ కాయిన్స్‌లో డబ్బు మదుపు చేసి మోసపోవద్దని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రజలను అప్రమత్తం చేసింది. బిట్ కాయిన్ వంటి క్రిప్టో కరెన్సీల రూపంలో పెడుతున్న వెంచర్ క్యాపిటల్ డిజిటల్/ఎలక్ట్రానిక్ ఫార్మాట్‌లో ఉండడంతో, అవి సులభంగా హేకర్స్ బారినపడే అవకాశం ఉందని, అంతేకాక పాస్‌వర్డ్ మరచిపోవడం, మాల్‌వేర్ దాడి వంటి అనూహ్య పరిణామాల కారణంగా మదుపరులు డబ్బు నష్టపోయే అవకాశముందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రజల్ని హెచ్చరించింది. వేలంవెర్రిగా కొనసాగుతున్న ఈ ఆకర్షణీయమైన లావాదేవీల రంగంలో మదుపు చేస్తున్నవారిని ఆర్థిక మంత్రిత్వ శాఖ హెచ్చరించిందేగానీ, ఏదైనా ఆర్థిక ఉత్పాతం జరిగి లక్షల కోట్లలో డబ్బు పోగొట్టుకొని భోరుభోరున మదుపరులు ఏడుపులూ, ఆత్మహత్యలకు పాల్పడేదాకా దాన్ని నియంత్రించకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు.


లావాదేవీల భద్రతకు, అదనపు యూనిట్స్‌ను (దొంగనోట్లు వలె) సృష్టించకుండా ఉండేందుకు, ఆస్తుల బదలాయింపు సరిచూసుకునే వీలుగా ఒకానొక నిగూఢ లిపి ద్వారా భద్రపరచుకునే అవకాశంగల మారకపు మాధ్యమంగా రూపొందిన డిజిటల్ ఆస్తిని క్రిప్టో కరెన్సీ అని పిలుస్తారు. ఈ క్రిప్టో కరెన్సీలను డిజిటల్ కరెన్సీలు, ప్రత్యామ్నాయ కరెన్సీలు, అభూత కరెన్సీలలో భాగంగా పరిగణిస్తారు. వికేంద్రీకృత క్రిప్టోకరెన్సీగా బిట్ కాయిన్ వ్యవస్థ 2009లో రూపొందింది. సంప్రదాయకంగా వస్తున్న కేంద్రీకృత ఎలక్ట్రానిక్ డబ్బు/కేంద్ర బ్యాంకింగ్ వ్యవస్థల నియంత్రణలో కాక 'బిట్ కాయిన్ బ్లాక్ చెయిన్' అనే స్వయంచలిత ఆన్‌లైన్ డేటాబేస్ లావాదేవీల ద్వారా బిట్ కాయిన్స్ చలామణిలోకి వస్తాయి. కేవలం స్పెక్యులేషన్ (సట్టా వ్యాపారం)ను పోలిన ఈ క్రిప్టో కరెన్సీల బ్లాక్ చెయిన్ (రికార్డుల జాబితా) వ్యవస్థలో బిట్ కాయిన్స్ ధర స్థిరంగా ఉండకుండా తీవ్ర ఊగిసలాటలకు గురవుతుంది. దాంతో మన మదుపులు గాలిలో దీపంలా తయారవుతాయి. త్వరత్వరగా, ఈజీ మనీ కోసం వెంపర్లాడుతున్న మదుపరుల కారణంగా ఈ నిగూఢ ద్రవ్యానికి నిశ్చలత కొరవడుతుంది. ఈ కారణంగా 2013 నుంచి మూడుసార్లు భారత రిజర్వ్ బ్యాంకు మదుపురులను హెచ్చరించినా మదుపరుల వ్యామోహం ఉపశమించలేదు.

క్రిప్టో కరెన్సీల ధరలు (మారక మాధ్యమంగాను, విలువ నిల్వ సాధనంగానూ) ఇప్పటికీ ప్రామాణికతను సంతరించుకోలేదు. సురక్షిత, పారదర్శక విదేశీ లావాదేవీలు సులభంగా, వేగంగా జరిగేందుకు ఐబీఎం వంటి కార్పొరేట్ ఐటీ దిగ్గజాలు తమదైన సొంత క్రిప్టో కరెన్సీ ప్లాట్‌ఫారమ్స్‌ను ఏర్పాటు చేసుకుంటున్నాయి. అదే సమయంలో దక్షిణ కొరియా, అమెరికా తదితర క్రిప్టో కరెన్సీ మోజులో ఓలలాడుతున్న దేశాలు ఈ నిగూఢ ద్రవ్య మార్కెట్‌ను నియంత్రించేందుకు మరింత కఠినమైన నిబంధనలు రూపొందిస్తున్నాయి. అయితే డిజిటల్ విప్లవంలో భాగంగా 2020 నాటికి మొట్టమొదటి బ్లాక్ చెయిన్ స్వయంచలిత ప్రభుత్వంగా మారబోతున్నామని దుబాయ్ ఇటీవల సంచలనాత్మక ప్రకటన చేసింది. అందుకోసం సొంత క్రిప్టో కరెన్సీ ప్లాట్‌ఫారం ఏర్పాటు చేయడం ద్వారా వీసా అప్లికేషన్లు, బిల్ చెల్లింపులు, లైసెన్స్ రెన్యువల్స్ వంటి ఆర్థిక లావాదేవీలను నడిపేందుకు దుబాయ్ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. బ్లాక్ చెయిన్ సాంకేతికత ద్వారా ఏడాదికి రెండు కోట్ల 51 లక్షల పనిగంటలు లేదా 1500 డాలర్లు ఆదా అవుతాయని స్మార్ట్ దుబాయ్ సంస్థ ప్రకటించింది. బ్లాక్ చెయిన్ ఆధారిత డిజిటలైజేషన్ పద్ధతిలో భూ సంబంధిత రికార్డులన్నిటినీ తెలంగాణ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా నమోదు చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో నరేంద్ర మోదీ కలలు గన్న 'డిజిటల్ ఇండియా' సాకారమయ్యేందుకు బ్లాక్ చెయిన్ ఆధారిత వ్యవస్థల ద్వారా సాధారణ పాలన, ఆర్థిక లావాదేవీలను అమలులోకి తీసుకరావలసి ఉంటుంది. ఆర్థిక బ్లాక్ చెయిన్ వ్యవస్థలు డిజిటల్ లెడ్జర్లుగా ప్రపంచవ్యాప్తంగా ఉపకరిస్తున్నాయి. అలాంటి బ్లాక్ చెయిన్ వ్యవస్థ వల్ల లావాదేవీలను భద్రంగా ఉంచుకోవడమే కాక, తక్షణమే తాజాపరచుకునే అవకాశం ఉంటుంది. ఆర్థిక లావాదేవీలను మరింత పారదర్శకంగా, మరింత సులభతరం చేసే బ్లాక్ చెయిన్ వ్యవస్థల వినియోగానికి, ఆ వ్యవస్థలను వినియోగించుకొంటూ స్వైర విహారం చేస్తున్న అపరిచిత, నిగూఢ ద్రవ్యాల మాయా జూద విన్యాసాలకు మధ్య తేడాను ప్రభుత్వం గుర్తించాలి. బ్లాక్ చెయిన్ వ్యవస్థల వినియోగాన్ని ఒక వైపు ప్రోత్సహిస్తూనే, మరొక వైపు బిట్ కాయిన్స్ వంటి నిగూఢ ద్రవ్యాల వినియోగాన్ని కేంద్రం కట్టడి చేయాలి. నల్ల ధనానికి కొత్త చిరునామాలుగా మారనున్న క్రిప్టో కరెన్సీ వ్యవస్థలను సర్కారు నియంత్రించకుండా ప్రోత్సహిస్తే ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలోకి కూరుకుపోయే అవకాశం ఉంటుంది.

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com
చిరునామా : Manam Telugu Daily, D.No. 6-3- 864/4/B, SBN Acrade 4th & 5th floor, Green lands, opp. Green park Hotel, Hyderabad, 500016, Telangana.



మంచిమాట



'ఎప్పుడూ ఆనందంగా ఉండేవాళ్ళే విజేతలుగా నిలుస్తారు.'

- రమణ మహర్షి

చట్టసభల్లో దళితులకు రిజర్వేషన్ లోపిస్తే?!

చరిత్రను చరిత్రగా చదువుకుంటే ఏమో కానీ, వర్తమానంలోంచి చరిత్రలోకి తొంగి చూడడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. చట్టసభల్లో ముస్లిం ప్రతినిధుల సంఖ్య తగ్గిపోతుండడం కొంతకాలంగా చర్చలో ఉన్నప్పటికీ, ఏకంగా ముస్లిం వోటే సోదిలోకి రాకపోవడం 2017 గుజరాత్ ఎన్నికలలో ప్రముఖంగా చర్చలోకి వచ్చింది. ఒకసారి 1916కు వెడితే, అల్పసంఖ్యాక మతస్థులకు కూడా చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించి సత్వర స్వయంపాలనకు కలసి కృషి చేయాలని కాంగ్రెస్-ముస్లిం లీగ్‌ల మధ్య ఆ ఏడాదే లక్నోలో ఒప్పందం కుదిరింది. అంటే, ముస్లింలు సహా అల్పసంఖ్యాక మతస్థులకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించే ఆలోచన అంతరించి, చివరికి ముస్లిం వోటు కూడా చెల్లని నోటుగా మారిపోయే పరిస్థితి 2017 నాటికి వచ్చిందన్నమాట. రాజ్యాంగరక్షణ ఉంది కనుక ముస్లింల వోటుహక్కుకు ఢోకా లేదనుకున్నా, ఆ హక్కును తమ సామూహిక ప్రయోజనాల కోసం వ్యూహాత్మకంగా వాడుకునే అవకాశం, తద్వారా తమ రాజకీయ అస్తిత్వాన్ని చాటుకునే అవకాశం వారికి లోపిస్తున్నాయన్నమాట. ఆ విధంగా వారు ప్రాబల్యవర్గాల ఆశ్రితజనంగా, రెండో తరగతి పౌరులుగా మారుతున్నారన్నమాట. ఈ సందర్భంలో తలెత్తే ఇంకొక ఆసక్తికరప్రశ్న ఏమిటంటే, భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో సీట్లు రిజర్వ్ చేసి ఉండకపోతే వారి పరిస్థితి కూడా ఇలాగే ఉండేది కాదా అని!

చట్టసభల్లో రిజర్వేషన్ డిమాండ్ మొదట తలెత్తినది ముస్లింల నుంచే. 1906లో ఢాకాలో ఏర్పడిన ముస్లిం లీగ్ ప్రధాన డిమాండ్లలో ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఒకటి. ఆ మేరకు 1916లో కుదిరిన లక్నో ఒప్పందానికి రూపకర్తలు తిలక్, జిన్నా, అనిబిసెంట్‌లు కాగా; సమర్థకుడు గాంధీ. అయితే, ఉభయపక్షాలకూ కొన్ని అభ్యంతరాలు ఉండడంతో 1931 నాటికి కూడా అది సాకారం కాలేదు. అదే ఏడాది, లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమ్మేళనంలో గాంధీకి సవాలుగా మారింది, ఈ డిమాండ్ కాదు; దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలన్న అంబేడ్కర్ డిమాండ్. అంబేడ్కర్ సారథ్యంలో అప్పుడు జరిగిన అల్పసంఖ్యాకుల ఒప్పందం, భారత్‌లోని ముస్లింలకు, దళితులకే కాక, క్రైస్తవులకు, ఆంగ్లో-ఇండియన్లకు, భారత్‌లో స్థిరపడిన యూరోపియన్లకు కూడా ప్రత్యేక నియోజకవర్గాలను కోరింది. దళితులకు అసలు సిసలు ప్రతినిధిని తనేనన్న గాంధీ, అస్పృశ్యతకు వ్యతిరేకంగా సవర్ణ హిందువులలో సంస్కరణ తేవడానికి తను చేస్తున్న ప్రయత్నాలను ప్రత్యేక నియోజకవర్గాలు నీరుగారుస్తాయనీ, హిందువులను సాయుధ శిబిరాలుగా చీల్చి వేస్తాయనీ, తమపై ఆధారపడి జీవించే దళితులపై అగ్రవర్ణాలు ప్రతీకారానికి దిగి అణచివేస్తాయనీ, ఆ నేరంలో తను దోషిని కాలేననీ వాదించారు. అంబేడ్కర్ వైపే మొగ్గు చూపిన బ్రిటిష్ ప్రభుత్వం దళితులకు, అల్పసంఖ్యాక మతస్థులకు ప్రత్యేక నియోజక వర్గాలను ఆమోదిస్తూ 1932లో 'కమ్యూనల్ అవార్డ్'ను ప్రకటించింది. పుణెలోని ఎరవాడ జైలులో ఉన్న గాంధీ దానిపై తీవ్రంగా స్పందిస్తూ ఆమరణ నిరశనకు దిగారు. ఉమ్మడి నియోజక వర్గాలకైనా అంగీకరిస్తాను కానీ, దళితులకు దళితులు మాత్రమే వోటువేసే ప్రత్యేక నియోజకవర్గాలను అంగీకరించననీ, అందుకు ప్రతిగా దళితులకు బ్రిటిష్ ప్రభుత్వం ఇవ్వజూపిన సీట్ల కన్నా ఎక్కువ సీట్లు ఇవ్వడానికి సమ్మతిస్తాననీ స్పష్టం చేశారు. గాంధీ నిరశనతో దేశవ్యాప్తంగా వచ్చిన ఒత్తిడికి తలవొగ్గిన అంబేడ్కర్, ప్రత్యేక నియోజకవర్గాలకు బదులు ఉమ్మడి నియోజకవర్గాలను ఆమోదించవలసి వచ్చింది. 'పుణె ఒప్పందం'గా అది ప్రసిద్ధమైంది.

అంటే, ఏం జరిగిందన్నమాట! దేశం స్వతంత్రమై, నూతన రాజ్యాంగంలోకి అడుగుపెట్టేసరికి ముస్లిం నియోజకవర్గాల (ప్రత్యేకంగానా, ఉమ్మడిగానా అన్నది అలా ఉంచితే) ప్రతిపాదన అదృశ్యమై, మొదట్లో గాంధీ సుతరామూ ఇష్టపడని చట్టసభలలో దళితుల రిజర్వేషన్ నిజమైంది. స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిం సాయం కోసం వారికి ప్రత్యేక నియోజకవర్గాల ఆలోచన చేయడం అప్పటికి అర్థవంతమనిపించి, దేశవిభజన జరిగాక ఆ అవసరం కనిపించి ఉండకపోవచ్చు, లేదా దేశవిభజన కలిగించిన భావోద్వేగాల మధ్య ముస్లింలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించే సాహసం లోపించి ఉండవచ్చు. కారణం ఏమైనా, మతప్రాతిపదికపై రిజర్వేషన్లను రాజ్యాంగం వ్యతిరేకించింది. రాజకీయపక్షాలు ఐచ్ఛికంగా తమకు ఎన్నికలలో టికెట్ ఇవ్వగల అవకాశం ఒక్కటే ముస్లింలకు మిగిలింది. ఆయా రాష్ట్రాలలోని కొన్ని ముస్లిం ప్రాంతాలలో ప్రభావం చూపగల ముస్లిం పార్టీలను అలా ఉంచితే, కేంద్రంలో, అనేక రాష్ట్రాలలో చాలాకాలంపాటు కాంగ్రెస్ అధికారమే కొనసాగింది కనుక, ముస్లింలతో ఆ పార్టీకి ముందు నుంచీ ఉన్న బంధమూ, సెక్యులర్ భావన, లేదా వోట్ల అవసరాల కారణంగానే కావచ్చు; ముస్లింలకు యథాశక్తి టికెట్లు ఇచ్చి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తూ వచ్చింది. ఇతర సెక్యులర్ పార్టీలు కూడా ఆ ఒరవడిని అనుసరించాయి. కానీ బీజేపీ అధికార విస్తరణతో మతప్రాతిపదికపై జనంలో చీలిక పదునెక్కి మెజారిటీ మతస్థులను ఒకే వోటుబ్యాంకుగా సమీకరించే అవకాశం ఉన్న ప్రతి చోటా, కాంగ్రెస్ తదితర పక్షాలు కూడా మెజారిటీ మతస్థుల వోటు వేటలో పడి, ఆ మేరకు ముస్లింలను 'దూరం'గా ఉంచే పరిస్థితి ఏర్పడింది. ముస్లిం అభ్యర్థుల సంఖ్య తగ్గడం, వారి వోటు ఆరోవేలుగా మారిపోవడం దాని క్రమపరిణామాలే. గుజరాత్ ఎన్నికలలో కనిపించింది అదే. మత ప్రాతిపదికపై మెజారిటీ ప్రజలు ఒక అతి పెద్ద వోటు బ్యాంకుగా మారిపోగల అవకాశాన్నీ; ఫలితంగా, దేశ జనాభాలో (2011 లెక్కలప్రకారం) 14 శాతానికి పైగా ఉన్న ఒకవర్గం చట్టసభల్లో ప్రాతినిధ్యాన్నే కాక, తమ వోటు ప్రభావాన్నీ, తద్వారా ప్రజాస్వామిక రాజకీయ అస్తిత్వాన్నీ కూడా కోల్పోగల పరిస్థితినీ రాజ్యాంగకర్తలు ఊహించకపోవడం ఆశ్చర్యకరమే.

దళిత నియోజకవర్గాలను వ్యతిరేకించడానికి గాంధీ చెప్పిన కారణాలూ విచిత్రంగానే కనిపిస్తాయి. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక పాలనను తెచ్చుకుంటున్న స్వతంత్రభారతదేశంలో అందరి హక్కులకూ రక్షణ లభిస్తుందని, లభించాలనీ, అది ప్రభుత్వాల బాధ్యత అనీ ఆయనకు తెలియదని భావించలేం. అయినాసరే, దళితులకు (ప్రత్యేకంగానే కానీ, ఉమ్మడిగా కానీ) నియోజకవర్గాలు కేటాయిస్తే, హిందువులు సాయుధ శిబిరాలుగా చీలి, అగ్రవర్ణాల ఆధిపత్యం కింద దళితుల బతుకు ఇంకా దుర్భరమవుతుందని ఆయన అనడం బెదిరింపుగా ధ్వనిస్తుంది తప్ప, హేతుబద్ధంగా కనిపించదు. అంతవరకూ యావద్భారతీయులకూ తనే ఏకైక ప్రతినిధిననుకున్న గాంధీ ఎట్టకేలకు జిన్నా ప్రభావాన్ని గుర్తించి ముస్లిం నాయకత్వాన్ని ఆయనకు విడిచిపెట్టినా, దళిత నాయకత్వ విషయంలో మాత్రం అంబేడ్కర్‌తో హోరాహోరీకి దిగారు. చివరికది తన అహాన్ని గాయపరిచే ఘర్షణగా పరిణమించడం వల్లనే ఆయన ఇలా హేతుబద్ధం కాని బెదిరింపులకు దిగారని భావించే అవకాశమూ ఉంది. ఇంకోవైపు, సవర్ణ హిందువుల సంస్కరణకు తను చేస్తున్న కృషి ఫలించి; వారికీ, దళితులకూ మధ్య సరికొత్త స్నేహవారధి ఏర్పడుతుందని -ఒక ఆదర్శవాదిగా ఆయన నిజంగానే నమ్మి ఉండవచ్చు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లలో అది ఏర్పడిన దాఖలాలు లేవు.

కనుక, ముస్లింల ఇప్పటి అనుభవం నుంచి చూసినప్పుడు, దళితుల విషయంలో గాంధీ కన్నా అంబేడ్కర్ ఎక్కువ ముందుచూపుతో, ఆచరణ దృష్టితో వ్యవహరించారని రుజువవుతోంది. గాంధీ ఆదర్శవాదమే నెగ్గి, ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించి ఉండకపోతే, వారు కూడా రెండవ తరగతి పౌరులుగా మిగిలిపోయి ఉండేవారేమో! ఇప్పుడు బీజేపీ సహా హిందుత్వవర్గాలు ముస్లింల విషయంలో సరిగ్గా గాంధీ తరహా ఆదర్శవాదాన్నే బాహాటంగా నొక్కి చెబుతున్నాయి. వారి రాజకీయ అస్తిత్వానికి, హక్కులకు ప్రతిగా 'అభివృద్ధి'ని ఎర వేస్తున్నాయి. రెండు దశాబ్దాల బీజేపీ పాలనలో గుజరాత్ ముస్లింలలోని ఒకవర్గం ఈ వైఖరితో సమాధానపడి, తమకు రాజకీయ ప్రాతినిధ్యం కన్నా అభివృద్ధే ముఖ్యమని అంతే బాహాటంగా చెబుతోంది. మెజారిటీ మతస్థులు ఒకే వోటు బ్యాంకుగా మారే క్రమం దేశమంతటా విస్తరించి నప్పుడు ముస్లింలు ఇలా సమాధాన పడడం దేశవ్యాప్తమవుతుంది. అప్పుడు, 'హిందూస్థాన్‌లోని విదేశీ జాతులు హిందూజాతిలో కలసి పోవాలనీ, లేదా పౌరహక్కులు సహా అన్ని హక్కులకూ దూరం కావాలనీ' అన్న ఆర్.ఎస్.ఎస్ నేత గోల్వాల్కర్ ('వుయ్ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్' అనే రచనలో) ఆకాంక్ష నిజమవుతుంది. రిజర్వేషన్ లోపించి, దళితుల విషయంలో కూడా అదే జరిగినప్పుడు దేశ దృశ్యం ఎలా ఉంటుందన్నదే ఈ సందర్భంలో ఆసక్తిని రేపే ప్రశ్న.





> ముస్లింల ఇప్పటి అనుభవం నుంచి చూసినప్పుడు, దళితుల విషయంలో గాంధీ కన్నా అంబేడ్కర్ ఎక్కువ ముందుచూపుతో, ఆచరణ దృష్టితో వ్యవహరించారని రుజువవుతోంది. గాంధీ ఆదర్శవాదమే నెగ్గి, ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో రిజ ర్వేషన్ కల్పించి ఉండకపోతే, వారు కూడా రెండవ తరగతి పౌరులుగా మిగిలిపోయి ఉండేవారేమో! ఇప్పుడు బీజేపీ సహా హిందుత్వవర్గాలు ముస్లింల విషయంలో సరిగ్గా గాంధీ తరహా ఆదర్శవాదాన్నే బాహాటంగా నొక్కి చెబుతున్నాయి.

◆ కల్లూరి భాస్కరం
9703445985

భాషా వికాసం కొరవడిన మన 'సి'త్రాలు

అతిథులను ఆప్యాయంగా పలకరించి, ఆహ్వానించే ముగ్గు ఒకప్పుడు తెలుగింటి వాకిట అందంగా విరిసేది. తెలుగు సినిమా అంటే ఇంటిల్లిపాదికీ ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, వినోదాన్ని పంచి మైమరిపించేది, తెలుగింట ముగ్గు కనుమరుగు వున్నట్టే తెలుగు సినిమాలో తెలుగుదనం కూడా తెరమరుగవుతోంది. కథలో, పాత్రల్లో, కథనంలో, పాటల్లో ఎక్కడా తెలుగుదనం కనిపించకూడదన్నట్టుగా నేటి తెలుగు చిత్రాలు తయారవుతున్నాయి. ఇక తెలుగు చిత్రాలకు ఆకర్షణగా నిలిచే చిత్రాల శీర్షికల నుంచి సంభాషణల వరకు అంతటా పరభాషా పదాలు వీర విహారం చేస్తున్నాయి. ఇది దశాబ్దకాలం నుంచి మరింతగా పెరిగింది. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలు, భాషా గొప్పదనం రాష్ట్ర ఎల్లలు దాటి ప్రపంచదేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. తెలుగు ఇప్పటికే 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా కీర్తించబడింది.

తెలుగు చిత్రసీమలో ప్రతి ఏటా సుమారు 115 తెలుగు చిత్రాలు విడుదలవుతుంటే వాటిలో 60 శాతం శీర్షికల పేర్లు తెలుగేతరమైనవే. కాని మన పొరుగు రాష్ట్రమైన తమిళనాడు చిత్రసీమను పరిశీలిస్తే పేర్లన్నీ తమిళంలోనే ఉంటుండగా, మన రాష్ట్రంలో పాతిక శాతమే తెలుగు, తక్కినవి పరాయి భాషల్లో దర్శనమిస్తున్నాయి. అంటే తెలుగువారి సంస్కృతిని మారుతున్న కాలానికి, ప్రజల అభిరుచులను తెలిపే వారధిగా వున్న ఈ చిత్రాల ధోరణికి అద్దం పట్టడం కంటే తెలుగును క్షీణింపజేసే అవకాశమే మెండు అని తెలుగు భాషాభిమానులు, భాషా పండితులు కలవరపడుతున్నారు.

పూర్వ సంప్రదాయాల్ని, యువత జీవన శైలిని, ఆధునిక నాగరికతను జనంలోకి తీసుకెళ్ళాలన్నా, వాటికి సామాజిక ఆమోదం రావాలన్నా సినిమాలే సాధనాలు. కాని తెలుగును పరభాషాభిమానంతో చిన్నచూపు చూడటం ఒక టైతే, రోజూ ఉచ్చరించే పదాలు, తెలుగు మాటలు కొన్ని చిత్రాల శీర్షికలుగా మారటం పరిపాటిగా మారింది. అవే సహజత్వాన్ని మించిన కొత్త అర్థాల్ని, ప్రాచుర్యాన్ని పొందుతున్నాయి. భాషా పరిణామ క్రమంలో ఈ తరహా 'ఆదాన ప్రదానాలు' సహజమే ఐనప్పటికీ తెలుగు కుదించబడటం ఆందోళన కరం! అది తెలుగు చిత్రసీమలోనే తెనుగేతర శీర్షికలు దర్శనం కావడం అత్యంత దారుణమైంది.

తెలుగు సినిమా పేర్లను మొదట ప్రభావితం చేసినది సంస్కృతమనే చెప్పాలి. 1970 వరకు పౌరాణిక, సంస్కృతిక, చారిత్రక, సామాజిక, కుటుంబ కథా చిత్రాలన్నీ ఎక్కువగా సంస్కృత భాషా పేర్లతో వచ్చాయి. 1990 తరువాత మంచి తెలుగు శీర్షికలతో కుటుంబ కథా చిత్రాలు తెలుగు పేర్లతో వచ్చి విజయం సాధించాయి. అయినా గతంలో కొన్ని సంస్కృతం, ఉర్దూ, హిందీ, పార్సీ, తదితర భారతీయ భాషా పదాలు తెనుగీకరణ జరిగి ఒద్దికగా ఒదిగిపోయే ఒరవడిలో సాగుతున్నది కాదు. యథాతథంగా జరుగుతున్న 'దిగుమతి'. తెలుగు పేర్లలో ఉర్దూ, పార్సీ భాషల మిశ్రమ పదాలతో జైత్రయాత్ర కొనసాగింది. 1991 తర్వాత మొదలైన ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ఫలితంగా యువతకు ఆంగ్లంవాడకం దినచర్యలో భాగంకావడంతో నిర్మాతలు యువతను ఆకర్షించడానికి సినిమా పేర్లలోనూ ఆంగ్లం అనివార్యమైంది. 2000 నుంచి విడుదలవుతున్న తెలుగు పేర్లలో 30-35 పూర్తిగా ఆంగ్లంలోనే ఉంటున్నాయి. ఇలా ఆంగ్ల వ్యామోహం పేర్లకే పరిమితం కావడం లేదు. కథ, సంభాషణల లోకి కూడా ప్రవేశిస్తోంది. నేడు యువతరం ప్రేమకథా చిత్రాల పోటీ పెరగడంతో ఆంగ్లం సరసన హిందీ కూడా చేరింది. 82 ఏళ్ల సినీ చరిత్రలో తెలుగువారి జీవన సంస్కృతికి అద్దంపట్టే సామెతలు, సూక్తులను కూడా శీర్షికలుగా పెట్టిన సందర్భాలున్నాయి. తెలుగు నుడికారం ఉట్టిపడే పేర్లు క్రమంగా అంతరిస్తున్నాయి. యువతరాన్ని ఆకట్టుకునే 'రిమేక్ చిత్రాలు', పాటల్లో 'రీమిక్స్' పెరగడంతో సినిమా అంటే ఒక మంచి సందేశం కాకుండా కేవలం వినోదం కోసమే అన్నట్టు అర్థవంతమైన సినిమాలు అదృశ్యమయ్యే ప్రమాదం ఉంది. ఇలా కొన్ని తెలుగు చిత్రాల్లో తెలుగుదనమే కాదు. తెలుగు జీవితమే కనిపించకుండా పోతోంది. శక్తిమంతమైన ప్రసారమాధ్యమంగా చలన చిత్రరంగం ప్రేక్షకులపై చూపే ప్రభావం ఎవరూ కాదనలేనిది. దురదృష్టవశాత్తు నేటి తెలుగు చిత్రాలు మాతృభాషను మరిచి పోవడానికి సోపానాలుగా మారుతున్నాయి. తెలుగు వారి సంక్రాంతి పండుగ ముగ్గుతోనే ఆరంభమైనట్లు మన తెలుగు సినిమాలు అచ్చ తెలుగు శీర్షికలతో వచ్చినప్పుడే తెలుగు వారికి నిజమైన 'సంక్రాంతి'. సినిమా హాళ్ళలో ఆటకు ముందు భారతీయుల సాంస్కృతిక , సామాజికపరమైన వర్తమానాంశాలపై డ్యాక్యుమెంటరీలను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలి. తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఎప్పటిలాగా సామాజిక స్పృహను, సామాజిక బాధ్యతను సాధించే లక్ష్యంగా తెలుగు చిత్రాలకు పదహారణాల తెలుగుదనం ఉట్టిపడే తెలుగు శీర్షికోపశీర్షికలతో 'తెర'ంగేట్రం జరగాలని ఆశిద్దాం.

> దురదృష్టవశాత్తు నేటి తెలుగు చిత్రాలు మాతృభాషను మరిచి పోవడానికి సోపానాలుగా మారుతున్నాయి. తెలుగు వారి సంక్రాంతి పండుగ ముగ్గుతోనే ఆరంభమైనట్లు మన తెలుగు సినిమాలు అచ్చ తెలుగు శీర్షికలతో వచ్చినప్పుడే తెలుగు వారికి నిజమైన 'సంక్రాంతి'. సినిమా హాళ్ళలో ఆటకు ముందు భారతీయుల సాంస్కృతిక , సామాజికపరమైన వర్తమానాంశాలపై డ్యాక్యుమెంటరీలను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలి.

◆ గుమ్మడి లక్ష్మీనారాయణ
9491318409



తల్లీ! సావిత్రీ పూలే!!

కవిత

అవ్వా! నువ్వులేకపోతే
మా బతుకులెట్ల తెల్లారేవో?
ఎడ్డోళ్లమైన మాకు - నోరెట్ల వచ్చేదో?
ఎన్నడూ వెలుగుమొకం జూడని మా చీకటి జీవితాల మీద
ఎన్నీల వెలుగుల్ని కుమ్మరించినదానివి
పసురాల కంటే హీనమైన బతుకుల మీద
ఆత్మవిశ్వాసపు జెండాలెగిరేసిన దానివి
శూద్రుల తొలుసూరు తల్లివి
మా నిజమైన భరతమాతవు!
అక్షరాలు వింటే చెవులు తెగిపడే రోజుల్లో
అక్షరాలు చదివితే మా నాలుకలు నలబై ముక్కలయ్యే కాలంల
మా నెత్తిమీద అక్షరాలు చల్లిన అమృతమూర్తివి
'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని మొరిగే కుక్కల మధ్య
ఆడదాన్ని అంగడిసరుకు చేసిన అన్యాయాల నడుమ
ఆకాశంలో సగభాగం మీద అక్షరదీపాలెత్తిన దానివి
మా జాతికి అసలైన సరస్వతివి
మానెత్తిమీద రుద్దిన కర్మసిద్ధాంతాన్ని
మమల్ని బానిసల్ని జేసిన పవిత్ర గ్రంథాలను
నాతండ్రి సర్జరీ చేసి కుట్రలు బయటపెడుతున్నప్పుడు
నువ్వుమనిషివే కాదు పొమ్మన్న అగ్రవర్ణ దురహంకారానికి
హక్కులే లేవన్న ఆ ఆధిపత్యవాదులకు
గుండెల్లో రాళ్లు గుమ్మరిస్తున్న జ్యోతిబా సహచరివై
దారిలో దివిటీ పట్టిన దానివి
మనసునిండా నమ్మకాన్ని నింపినదానివి
తల్లీ! సావిత్రీ పూలే!!
పుస్తకాన్ని ముట్టినప్పుడల్లా
నీ పాదాన్ని తాకినంత పులకరింత
అక్షరాన్ని పలికినప్పుడల్లా
మీ ఆదిదంపతుల మీద పాట గట్టినంత సంబురం

- తోకల రాజేశం
9676761415

(నేడు సావితి పూలే జయంతి)

'లౌకిక'ంటకం?



'రాజ్యాంగం మారుతుంది, మనం రాజ్యాంగానికి ఎన్నో సవరణలు చేశాం, సవరణలు ఇకపై కూడా జరుగుతాయి. మనం రాజ్యాంగాన్ని మార్చాలి'.

'అభ్యుదయవాదులకు చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు తెలియవు. లౌకికవాదులమని చెప్పుకుంటున్న వారికి తమ తల్లిదండ్రుల గురించి, తమ రక్తం గురించి తెలియదు'

– బిజెపి మంత్రి అనంత్ కుమార్ హెగ్డే

వీక్షణం

'నా మటుకు నాకు మతానికి ఇంతటి విస్తృత ప్రాధాన్యం ఎందుకు ఇవ్వాలో అర్థం కావడం లేదు. ఎందుకోసం ఈ మతస్వేచ్ఛ? మన ప్రాథమిక హక్కులతో విభేదిస్తున్న అసమానత్వం, వివక్ష, ఇంకా ఇలాంటి అనేకానేక రుగ్మతలతో బాధపడుతున్న మన సామాజిక వ్యవస్థను సంస్కరించడానికి ఈ స్వేచ్ఛ అవసరమా?'

- డాక్టర్ అంబేద్కర్


మతాలకు అతీతంగా ఒక ఉమ్మడిపౌరస్మృతి దిశగా అంబేద్కర్ చేసిన ప్రయత్నం కేవలం ఆదేశిక సూత్రాల్లో చిన్నచోటును సంపాదించుకోగలిగింది. ఆదేశిక సూత్రాల్లోని ఒక అధికరణం ఈ విధంగా పేర్కొంటోంది: 'దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి కోసం ప్రభుత్వం ప్రయత్నించాలి.' రాజ్యాంగ రచనాకాలంలో ముస్లిం పర్సనల్ లాను కదిలించడానికి అటు ముస్లిం నేతలు, హిందూ వివాహ, వారసత్వ చట్టాల్ని ముట్టుకోవడానికి ఇటు హిందూ నేతలు తీవ్రంగా వ్యతిరేకించడంతో అంబేద్కర్ ప్రస్తావించిన ఉమ్మడి పౌరస్మృతి కేవలం కాగితాలకే పరిమితమైంది. హిందువుల వ్యక్తిగత జీవితాల్లోకి పౌరచట్టాలు తొంగిచూడడమన్నది ఆకాలంలో బాబూ రాజేంద్ర ప్రసాద్ వంటి మహామహులకు కూడా రుచించలేదు. 'హిందూ చట్టాలకు సంబంధించినంత వరకు కొత్త ఆలోచనలు పూర్తిగా పరాయివి. ఇవి హిందూ కుటుంబాల్ని విచ్ఛిన్నం చేసేందుకు జరుగుతున్న కుట్రగా అనుమానించాల్సి వస్తోంది' అని రాజేంద్ర ప్రసాద్ ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. నెహ్రూ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న అంబేద్కర్ చివరికి రాజీనామా చేసి బయటికి వచ్చేసేందుకు కారణం ఈ హిందూ కోడ్ బిల్. నాటి నుంచి నేటి వరకు మతం, రాజ్యం అన్నవి భారతదేశ భవితవ్యాన్ని నిత్యం ప్రశ్నార్థకం చేస్తూనే ఉన్నాయి.

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో తొలినాళ్ళలో మతానికి అతీతంగా ఉమ్మడి పౌరస్మృతిని తేవడానికి చేసిన ప్రయత్నాలు గట్టి వ్యతిరేకత ఎదురవడంతో మూలన పడ్డాయి. కానీ ఈ రోజు రాజ్యాంగాన్ని మార్చాలన్న వాదన ఎలాంటి జంకూగొంకూ లేకుండా వినిపిస్తోంది. రాజ్యాంగాన్ని ఎందుకు మార్చాలి? ఏ విధంగా మార్చాలి. సామ్యవాద, ప్రజాస్వామిక, లౌకిక వాద పునాదులపై ఉద్భవించిన భారత రాజ్యాంగాన్ని మార్చవలసిన అవసరం ఇప్పటికిప్పుడు ఎలా ముందుకొచ్చింది? అది తక్షణావసరం లేదా అనివార్య పరిణామం అని నిర్ధారించేసేలా ఈ దేశంలో ఏం జరిగింది, ఏం జరుగుతోంది? రాజ్యాంగాన్ని మార్చడమంటే దాని ప్రజాస్వామిక స్ఫూర్తిని తుడిచిపెట్టేసి, మతవాద రంగును పులమడమేనా?

మనదేశంలో లెక్కకు మిక్కిలిగా మతాలు, కులాలు, తెగలు ఉన్నాయి. ఒకే మతంలో భిన్న ఆచారాలు కూడా ఆచరణలో ఉన్నాయి. దక్షిణభారతదేశంలో మేనమామ, కోడల్ని పెళ్ళి చేసుకునే సంప్రదాయం ఉంది, కానీ ఉత్తర భారతదేశంలో ఇది పూర్తిగా నిషేధం. ఒకచోట హిందూ వారసత్వ చట్టాల్లో మితాక్షర పద్ధతి అమల్లో ఉంటే, మరో చోట దాయభాగ పద్ధతి అమల్లో ఉంటుంది. నాగాలాండ్, మిజోరం, ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో ప్రజలు తమ మతాచారాల్లో న్యాయవ్యవస్థ జోక్యాన్ని సహించరు. గోవాలో మాత్రమే ఉమ్మడి పౌరస్మృతి అమల్లో ఉంది. గోవా పౌరులందరికీ మతం, కులంతో నిమిత్తం లేకుండా ఒకే చట్టాలు వర్తిస్తాయి. కానీ దేశంలో మిగతా చోట్ల వేర్వేరు మతాలకు వేర్వేరు పర్సనల్ లా ఉంటుంది. ఇక్కడ ఏ మతస్తుడూ ప్రభుత్వం లేదా న్యాయవ్యవస్థ తన మతపరమైన పర్సనల్ లా జోలికి రావడాన్ని సహించడు. కానీ మన దేశం పరమత సహనానికి పెట్టిన కోట అన్న ప్రచారానికి లోటేమీ ఉండదు. ప్రజాస్వామిక లౌకికవాదం, సామ్యవాదం వంటి పదాలు ఇక్కడ నెమ్మదిగా అర్థాల్ని మార్చుకుంటున్నాయి లేదా పూర్తిగా ఉనికిని కోల్పోతున్నాయి. ఒక బాధ్యతాయుతమైన కేంద్రమంత్రి లౌకికవాదాన్ని, లౌకికవాదుల్ని ఎద్దేవా చేస్తూ, అన్ని మర్యాదల్ని అతిక్రమించి మాట్లాడినా ఇక్కడ ఒక్క క్షమాపణతో అంతా సద్దుమణిగిపోతుంది. మతరహిత రాజ్యమే పునాదిగా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ప్రభవించిన లౌకికవాదమనే ఉన్నత ప్రమాణానికి ఇవాళ అణువణువూ తూట్లు పొడుస్తున్నారు. కులం పేరిట, మతం పేరిట మనిషి ఇక్కడ తన ఉనికిని చెప్పుకోవడాన్ని గర్వంగా భావిస్తున్నాడు. ఇది మన దైనందిన జీవితంలో ఒక అలవాటుగా మారింది. 'మీరు ఏ కులస్తులు?.... ఏ మతస్తులు?' అంటూ నిర్లజ్జగా అడిగేస్తున్నాం, ఆ ప్రశ్నలకు మనం కొంచెం కూడా సిగ్గు పడకుండా 'నేను ఫలానా...' అని బోరవిరుచుకుని మరీ జవాబు చెబుతున్నాం. నిజమే మంత్రి అనంత్ కుమార్ హెగ్డే అన్నట్టు అన్నీ 'మారిపోతున్నాయి'..., రేపో మాపో రాజ్యాంగం కూడా మారిపోతుంది, అసలు రాజ్యాంగమే అటకెక్కేస్తుంది..., అయినా మనకు చీమ కుట్టినట్టు కూడా ఉండదు.'వాడు మన వాడా, పరాయి వాడా?' అన్న ప్రశ్నతోనే మనం తోటిమనిషిని పరిచయం చేసుకుంటాం. ఘనత వహించిన భారతీయులారా, ఇప్పటికిప్పుడు మన కాళ్ళ కింద నేల మనకు తెలియకుండా కదిలి పోతోంది. ఆ నేల పేరే పరమత సహనం, లౌకికవాదం!

- కల్కి





దేశంలో లౌకికవాద స్ఫూర్తికి ఎంతటి పెనుముప్పు పొంచి ఉందో చెప్పడానికి అనంత్ కుమార్ హెగ్డే మాటలే నిదర్శనం. ఈ నేపథ్యంలో ఇవాళ్టి 'ముద్ర' భారతీయ లౌకికవాదం గురించి కొందరు ప్రజాస్వామికవాదుల అభిప్రాయాల్ని మీ ముందుకు తెస్తోంది.

తూణీరం

ఇంటర్వ్యూలు: పసుపులేటి గీత




ఇదంతా రహస్య అజెండానే!

- నారాయణ
(సిపిఐ రాష్ట్ర కార్యదర్శి)

ముద్ర: పాకిస్తాన్, బంగ్లాదేశ్ లలో మైనారిటీలైన హిందువులు, ఇతరుల పట్ల దారుణమైన వివక్ష నెలకొన్నదని, శ్రీలంకలో సింహళీయులకు అనుకూలమైన ప్రభుత్వ విధానాల వల్ల ఆ దేశంలో తమిళులు అణచివేతకు గురయ్యారని కొందరు అభిప్రాయపడుతుంటారు, ఇస్లామిక్ రాజ్యాలలో అంటే అఫ్ఘానిస్తాన్, సౌదీ అరేబియాల్లో మైనారిటీల పట్ల అమానుష ప్రవర్తన ఉంటుందని, ఈ నేపథ్యంలో లౌకికవాద స్ఫూర్తికి భారతదేశమే గొప్ప ఉదాహరణ అని చెప్పడంలో నిజమెంత? భిన్న మతాలు, కులాలు, భాషలతో ఇంతటి విస్తృత వైవిధ్యం కలిగిన భారతదేశానికి ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఉందా, లేదా?

నారాయణ: భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత లౌకికవాదం వంటి పదాలకు అర్థాలు, తాత్పర్యాలే మారిపోయాయి. మైనారిటీల్ని హింసించడం, హిందూత్వ వాదాన్ని బలోపేతం చేయడం వారి రహస్య అజెండా. వారి మౌలిక విధానాల్లోనే ఇది అంతర్గత భాగం. ఇవాళ అనంత్ కుమార్ హెగ్డే అనే వ్యక్తి ఒక్కడే నేరం చేసినట్టు పైకి కనిపించినా, ఇది బిజెపి లక్ష్యాలలో ఒక భాగం. నిజానికి అనంత్‌కుమార్ హెగ్డే ఒక్కడే నేరం చేశాడని భావించినట్టయితే, ఈపాటికి ఆయనను పార్టీ నుంచి తొలగించి ఉండే వారు కదా! అది జరగలేదు, అంటే ఇదంతా వారికి బాగా తెలిసిన విషయమే, అధినాయకుల మనసులోని మాటను అనంత్‌కుమార్ హెగ్డే లాంటి వాళ్ళు బయటికి చెబుతుంటారంతే! లౌకికవాద స్ఫూర్తికి సాధనంగా చెబుతున్న ఉమ్మడి పౌరస్మృతి అనేది మన దేశంలో మైనారిటీలకు వ్యతిరేకంగా పనిచేయడానికే సహాయపడుతుంది.



ఇది విచ్ఛిన్నవాదం

- ఖాదర్ మొహియుద్దీన్
(కవి, విమర్శకుడు, సీనియర్ జర్నలిస్టు)

ముద్ర: రాజ్యాంగాన్ని మార్చాలంటున్న వాదనకు మూలం ఏమిటి? సామ్యవాద, ప్రజాస్వామిక, లౌకికవాద పునాదుల నుంచి ఉద్భవించిన భారత రాజ్యాంగాన్ని మార్చాలన్న వ్యాఖ్యల వెనుక ఉద్దేశమేమిటి?

ఖాదర్ మొహియుద్దీన్: ప్రస్తుతం మన భారత సమాజం ముందున్న అతి గంభీరమైన సమస్య అధికసంఖ్యాకవాదం. తన ఈ అధికసంఖ్యాక భావజాలాన్ని అతి నిరంకుశంగా దేశం మీద రుద్దుతూ రాజ్యాంగాన్ని లోపలి నుంచి వేరుపురుగుల్లా తొలిచి వేసేందుకు సంఘ్‌పరివార్ పథకం ప్రకారం చేస్తున్న ప్రయత్నాలే ఈ తరహా ప్రకటనలు. మనుస్మృతిని భారత జాతి తొలి రాజ్యాంగంగాను, భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ స్మృతిగాను అభివర్ణించాడు అనంత్‌కుమార్ హెగ్డే. ఏ రాజ్యాంగం మీదనైతే, దానికి కట్టుబడి, దాని పవిత్రతను కాపాడతామని ప్రమాణం చేసి అధికారాన్ని చేపట్టారో, ఆ రాజ్యాంగాన్నే నామరూపాలు లేకుండా చేస్తామనడం కన్నా ఉగ్రవాదం, విచ్ఛిన్నవాదం వేరే ఏమైనా ఉంటుందా? అధిక సంఖ్యాక వాదంతోనే భారత దేశానికి నిజమైన ముప్పు ఉంటుందని అన్నారు గాంధీజీ. కమ్యూనలిజం (మతతత్త్వం), మెజారిటీ కమ్యూనలిజం భారత దేశం ముందున్న సమస్య అన్నారు నెహ్రూ. హిందూ రాజ్యం ఏర్పడడం అనేది కనుక నిజమైతే, ఈ దేశం పాలిట అదొక పెనువిపత్తు కాగలదనడంలో ఏ మాత్రం సందేహం లేదు అన్నారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. అధిక గ్లోబల్ ప్రపంచంలో ఇక ఏకమత సమాజాలకు తావనేది ఉండదు.



రాజ్యం, మతం వేర్వేరు

-అల్లం నారాయణ
(తెలంగాణ ప్రెస్ అకాడమీ అధ్యక్షుడు)

ముద్ర: మఠాధిపతిగా ఉన్న యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు, 'గోరక్షణ్' వంటి మతం కార్యకలాపాల్ని పాలనావ్యవహారంగా మార్చేశారు. మరోవైపు ట్రిపుల్ తలాక్ మీద ప్రభుత్వం, ముస్లిం మహిళా సంఘాలు కోర్టుకు వెళ్ళాయి. ట్రిపుల్ తలాక్ బిల్లును మోదీ ప్రభుత్వం దిగ్విజయంగా ముందుకు తెచ్చింది. అంటే ఒకవైపు మతం అధికారంలోకి వచ్చింది, మరోవైపు అధికారం మతంలో జోక్యం కల్పించుకుంటోంది.., భారతీయ లౌకికవాదాన్ని కుహనాలౌకిక వాదంగా చెప్పడానికి ఇది ఉదాహరణ అవుతుందా?

అల్లం నారాయణ: లౌకికవాదమన్నదే ఇప్పుడు ప్రధానమైన సమస్యగా మారింది. లౌకికవాదంపై మొట్టమొదటిసారిగా గాంధీ, నెహ్రూల మధ్య చర్చ జరిగింది. మత అభిప్రాయాలు, ప్రభుత్వ అభిప్రాయాలు పరస్పరం వేరు వేరుగా ఉండాలా, వద్దా అన్నదే ఆ చర్చ సారాంశం. వేర్వేరుగా ఉంటేనే బావుంటుందనే అభిప్రాయానికి వచ్చారు. అయినప్పటికీ, ప్రస్తుతం అవి ఒకదాని పరిధిలోకి మరొకటి చొచ్చుకుని వచ్చేస్తున్నాయి. ఈ జోక్యం ఎంతవరకు వెళుతోందంటే రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను సైతం ప్రశ్నించే స్థాయికి వెళ్ళిపోయింది. ఈ పరిస్థితుల్లో లౌకిక వాదం ఆవశ్యకత మరింత పెరిగి పోయింది. కులతత్త్వం, మత తత్త్వాలలో ఉద్వేగాలకు సంబంధించిన ఒక వెసులుబాటు ఉంటుంది. ఆ వెసులుబాటు ముసుగులోనే అనంత్‌కుమార్ హెగ్డే వంటి ఒక రాజ్యాంగ ప్రతినిధి అపసవ్యంగా మాట్లాడగలిగాడు. లేకపోతే అలా మాట్లాడడమన్నది కుదరదు.



మనుధర్మమే రాజ్యాంగమా?

- వరవరరావు
(విప్లవ కవి)

ముద్ర: అరుణాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్, త్రిపురవంటి రాష్ట్రాల్లో మతమార్పిడి నిషేధ చట్టాలు అమల్లోకి వచ్చాయి. ఇవి హిందూమతం నుంచి ఇతర మతాలకు మారడంపై ఆంక్షలు విధించాయి. కానీ ఇతర మతాల నుంచి హిందూమతంలోకి మారడానికి ఎలాంటి ఆంక్షలు లేవు. మతమార్పిడులను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఒక జాతీయవిపత్తుగా భావించారు. ఇదంతా లౌకికవాద రాజ్యం అనుసరించాల్సిన మార్గమేనా?

వరవరరావు: అసలు లౌకికవాదానికి సంబంధించి రాజ్యాంగం ఇస్తున్న నిర్వచనాల్లోనే చాలా వైవిధ్యం ఉంది. సామ్య వాదానికి, లౌకిక ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా 'గోవధ నిషేధం' పేరిట అరెస్టులు చేశారు. ముఖ్యంగా ఇటీవల కేంద్రమంత్రి అనంత్ కుమార్ వ్యాఖ్యల్నే తీసకుందాం. ఆయన నాగపూర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి చెందిన వ్యక్తి. నాగపూర్ ఆర్‌ఎస్‌ఎస్ వాదులు రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేయాలంటున్నారు. నాగపూర్ ఆర్‌ఎస్‌ఎస్ వాదులు సామ్యవాద రాజ్యాంగం స్థానంలో మనుధర్మశాస్త్రాన్ని భారత రాజ్యాంగంగా తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఒక పార్లమెంటేరియన్ రాజ్యాంగ విరుద్ధంగా మాట్లాడినపుడు అతనికి ఆ పదవిలో ఉండే అర్హతే లేదు. కానీ గాయపరచినందుకు క్షమాపణ చెప్పేశాం, అంతా సద్దుమణిగిపోయిందంటున్నారు. పార్లమెంటు జరుగుతున్న సమయంలో ఒక మంత్రి ఇలా మాట్లాడితే అతని మీద చర్య తీసుకోరా? హిందూమతంలో భాగం కాదలుచుకోని వారిని నిర్మూలించడంలో భాగమే. ఇదంతా పెట్టుబడిదారీ రాజకీయమే.

చెర్మన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. కమిషన్ చైర్మన్‌గా సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం గణపూర్ కు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. సభ్యులుగా బోయిళ్ల విద్యాసాగర్ (సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎడవల్లి), ఎం.రాంబాల్ నాయక్ (రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం పోడగుట్ట తండా), కుర్సం నీలాదేవి (ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రాయగూడ), సుంకపాక దేవయ్య (హైదరాబాద్ నగరంలోని రాంనగర్), చిలకమర్రి నర్సింహ (రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల) నియామకమయ్యారు. రాష్ట్రం ఏర్పడి మూడున్నరేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను నియమించలేదు. ఈ విషయంపై గతంలో అసెంబ్లీలోనూ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్లను వేర్వేరుగా నియమించాలనే డిమాండ్లు పెరిగినందున ఆ దిశగా ఆలోచిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. అయినప్పటికీ రెండింటికీ కలిపి ఒకే కమిషన్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని తెలిపింది. అయితే.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ అంశం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని, కేంద్రం సహకారం అందించగానే కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు వెలువరించింది.

మంత్రి హరీశ్‌కు ఆప్తుడు

మెదక్ జిల్లాకు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉమ్మడి మెదక్ జిల్లా వాసి. మంత్రి హరీష్‌రావుకు అత్యంత ఆప్తుడు. హరీశ్ రావు మాటే శాసనం అన్నంతగా ఆయన పార్టీలో పనిచేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారు. పార్టీ అధికారంలోకి వచ్చినా ఆయనకు ఎలాంటి పదవులు రాకపోవడంలో అప్పట్లో చర్చనీయాంశమైంది. గతంలో రాజ్యసభకు ఆయన పేరును పరిశీలిస్తున్నట్లుగా కూడా వార్తలు వచ్చాయి. చివరకు ఆయనకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

తెలంగాణ ఆణిముత్యం

(మొదటి పేజీ తరువాయి)

కార్యసాధకుడని ఈ సందర్భంగా వారు ప్రశంసించారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన క్రియాశీలి అని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ విద్వత్సభ పక్షాన బ్రహ్మశ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి, భాగ్యనగర అర్చక పురోహిత సంఘం పక్షాన గట్టు శ్రీనివాసాచార్యులు, కులకర్ణి, మంగేశ్ కుమార్, మదనానంద యువప్రవర సమాఖ్య పక్షాన మరుమాముల నాటరాజశర్మ, అర్చక సమాఖ్య పక్షాన రాయప్రోలు మల్లికార్జున శర్మ, తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలుగా 50 నగరపంచాయతీలు?

(మొదటి పేజీ తరువాయి)

రూపాయిలు లంచం తీసుకుంటూ అక్రమంగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ స్థాయిలో గండి పడుతోంది. ఈ నేపథ్యంలో నగర శివారు గ్రామపంచాయతీలను సమీపంలోని మునిసిపాలిటీలలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి విడతలో రాష్ట్రంలోని దాదాపు 50 నగరపంచాయతీలను మునిసిపాలిటీలుగా మార్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి ఒకటి రెండు నెలల్లో మునిసిపల్ చట్ట సవరణ తేనున్నట్లు వారు తెలిపారు. ఇటీవలే జిల్లా కేంద్రంగా మారిన సిద్దిపేట మునిసిపాలిటీని కార్పొ రేషన్‌గా మార్చనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ పలు సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టునున్నట్టు తెలిసింది.


తెలంగాణ ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

నాటి సంచికలో ఏకంగా సంపాదకీయం ప్రచురించింది. రైతు పక్షం వహించడంలో దేశానికే దారిచూపిన టీఆర్ఎస్ సర్కారును ఇతర రాష్ట్రాలన్నీ ఆదర్శంగా తీసుకోవాలని అందులో సూచించింది. ''ప్రతి రాజకీయ పార్టీ, ప్రభుత్వం రైతులను ఉద్ధరిస్తామంటూ పదాడంబరంతో హామీలు గుప్పిస్తాయి. కానీ, వాస్తవంగా అవేవీ ఆచరణలోకి రావన్నది మనకు స్పష్టంగానే కనిపిస్తుంది'' అని వ్యాఖ్యానించింది. ఇంకా ఏమన్నదంటే... ''రైతు పక్షం వహించిన తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు. కొత్త ఏడాది తొలిరోజే వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టి, దేశంలోనే ఈ ఘనత సాధించిన తొలి రాష్ట్రంగా ఆవిర్భవించి ఆదర్శప్రాయంగా నిలిచిందని కొనియాడింది. దేశంలోని రైతులు ఎన్నో ఏళ్లుగా వివిధ కారణాలతో కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నారు. అయితే అతివృష్టి లేదంటే అనావృష్టితో వారి అగచాట్లకు అంతులేకుండా ఉంటోంది. అష్టకష్టాలూ పడి పంటలు సాగుచేసినా, అప్పుల ఊబిలో కూరుకుపోయి చివరకు ఏ దారీ కానరాక ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రైతు సంక్షేమంపై ఎన్నో పార్టీలు గొప్పగొప్ప వాగ్దానాలు చేశాయి. కానీ, వాటిలో ఒక్కటి కూడా అమలులోకి వచ్చిన జాడ లేదు. ఇదంతా కేవలం ఓట్ల రాజకీయంతోనే ముడిపడి ఉంది. నిజానికి రాజకీయ నాయకులకు రైతులు గుర్తొచ్చేది ఎన్నికల సమయంలో మాత్రమే. ఇలాంటి నిరాశానిస్పృహలు రాజ్యమేలుతున్న వేళ తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం గొప్ప ముందడుగు వేసింది. పంటల సాగుకు నిరంతర విద్యుత్తును ఉచితంగా అందించాలన్న బృహత్ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతించాల్సిందే. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణను చూసి పాఠం నేర్చుకోవాలి. రైతు సంక్షేమం గురించి నిజంగా ఆలోచించాలి'' అని హితవు చెప్పింది.

చేస్తాం-చూస్తాం కాదు.. చేసి చూపించాలి

''ఎన్నికలు రాగానే అన్ని రాజకీయ పార్టీలూ తాము అధికారంలోకి రాగానే రైతులకు ఏదేదో ఒరగబెడతామని తమ ప్రణాళికలలో జోరుగా వాగ్దానాలైతే ఇచ్చేస్తాయి. ముఖ్యంగా రుణమాఫీ, ఉచిత-సరిపడా విద్యుత్ సరఫరాపై భారీ హామీలను ప్రణాళిక పుస్తకాల తొలి ఐదులైన్లలోనే ప్రకటిస్తాయి. కానీ, ఎన్నికల్లో గెలుపు సాధించి అధికారంలోకి రాగానే ఏం జరుగుతుందో అందరికీ తెలిసిందే. చివరకు అన్నదాతలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో ఆందోళన చేస్తున్న రైతులపై కాల్పులు జరుగుతున్న ఉదంతాలు కూడా ఇటీవల సర్వసాధారణమయ్యాయి. రైతుల సంక్షేమం గురించి పట్టించుకోవాల్సిన పాలకులు ఇలా వ్యవహరించడం తగదు. దేశానికి అన్నం పెట్టేవాడుగా భావించే రైతుకు న్యాయమైన హక్కులు ఎందుకు దక్కవు? రైతు సంక్షేమం సాధ్యంకానిదే దేశాభివృద్ధి అసాధ్యమన్న వాస్తవాన్ని గుర్తెరగాలి. పార్లమెంటు సమావేశాల సమయంలో రైతుల సమస్యలపై కూలంకష చర్చకు వీలుండాలి. వాటి పరిష్కారంపై ఆలోచించాలి. ఇది ఎంతో ముందుగానే జరగాల్సి ఉన్నా జరగలేదు. కానీ, ఆలస్యమైనా మించిపోయింది లేదు. ఏం చేయాలో తెలంగాణ ప్రభుత్వం చేసి చూపింది. ఇక ఇప్పుడు మిగతా రాష్ట్రాల వంతు వచ్చింది'' అని పేర్కొంది.





పుణె ఘర్షణల నేపథ్యంలో

అట్టుడికిన ముంబై

ఆందోళనకారుల నిరసన హింసాత్మకం

రైళ్ల రాకపోకలకు ఆటంకం... రాస్తారోకో

పోలీసులతో ఘర్షణ.. ఐదుగురికి గాయాలు

మొన్నటి హింసకు రెండు సంస్థలు కారణం

బి.ఆర్.అంబేద్కర్ మనవడు ప్రకాశ్ ఆరోపణ

ప్రభుత్వ వైఫల్యంపై నేడు బంద్‌కు పిలుపు

సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ: ఫడ్నవీస్

మృతుడి కుటుంబానికి 10 లక్షల పరిహారం

ముంబై, జనవరి 2:


పుణెలో సోమవారం చోటుచేసుకున్న కుల ఘర్షణలకు బాధ్యులపై చర్యలకు డిమాండ్ చేస్తూ దళిత వర్గాలు మంగళవారం చేపట్టిన ముంబై బంద్ హింసాత్మకంగా మారింది. భీమా కొరేగావ్ పోరాటానికి 200 ఏళ్లు నిండిన సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు సోమవారం లక్షలాది దళితులు హాజరయ్యారు. అయితే, మరాఠా వర్గాలు దీన్ని వ్యతిరేకించడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. ఫలితంగా అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి మరణించగా పలువురు గాయపడ్డారు. మొత్తం 40 వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఉదంతాన్ని నిరసిస్తూ ముంబైలో దళితులు మంగళవారం భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. చెంబూర్, విఖ్రోలీ, మన్‌ఖుర్ద్, గోవాండీ, ములుంద్, భాండుప్, రమాబాయ్ అంబేద్కర్ నగర్, కుర్లాలోని నెహ్రూ నగర్‌లో వందలాదిగా గుమికూడిన ఆందోళనకారులు రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు. పలుచోట్ల రాస్తారోకో చేపట్టి వాహనాలను నిలిపివేసేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత వారందరూ చెంబూర్‌లోని అంబేద్కర్ గార్డెన్‌కు చేరుకోగా అక్కడా పోలీసులు నిరోధించడంతో రోడ్లపైనే నిరసనకు దిగారు. దీంతో వివిధ మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మరోవైపు మరాఠా వర్గాలవారు కూడా పుణెలో నిరసనకు దిగి, బస్సులను ధ్వంసం చేశారు. దీంతో అహ్మద్‌నగర్, ఔరంగాబాద్ బస్సు సర్వీసులను నిలిపివేశారు. కాగా, ఈ ఘర్షణల్లో మరణించిన వ్యక్తి కుటుంబానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. దీంతోపాటు ఘర్షణలకు దారితీసిన పరిస్థితులపై సీఐడీ దర్యాప్తుతోపాటు హైకోర్టు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణకు ఆదేశించారు. ఘర్షణలకు కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తూ, ప్రజలు శాంతియుతంగా మెలగాలని పిలుపునిచ్చారు. సంస్మరణోత్సవాలకు దాదాపు 3 లక్షల మంది హాజరయ్యారని, ఈ సందర్భంగా కొందరు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడేందుకు ప్రయత్నించగా పోలీసులు సమర్థంగా నిలువరించారని ఆయన విలేకరులతో చెప్పారు.

ఏమిటీ సంస్మరణ... ఎందుకీ ఘర్షణ?

పరాయి పాలన సమయాన 1818లో ఈస్టిండియా కంపెనీ సేనలు భీమా కొరేగావ్ యుద్ధంలో మరాఠా అధినేత పీష్వా సైన్యంపై విజయం సాధించడానికి గుర్తుగా దళితవర్గాలు ఈ సంస్మరణ సభను ఏటా నిర్వహిస్తుంటాయి. ఈ పోరాటంలో స్వదేశీ సైన్యం ఓడినప్పటికీ నాటి సమాజంలో అస్పృశ్యులుగా ముద్రపడిన మహర్ దళితులతో కూడిన ఈస్టిండియా సైన్యం విజయాన్ని వారి గెలుపుగా పరిగణించి 'విజయ్ దివస్'గా నిర్వహించాయి. దీనిపై కొన్ని అతివాద సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.

ఘర్షణల్లో ఐదుగురికి గాయాలు

ముంబై బంద్ సందర్భంగా ఆందోళనకారులు అనేక ప్రాంతాల్లో శివారు, స్థానిక రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు. దుకాణాలను మూసి



వేయించారు. ఈ సందర్భంగా ఓ టీవీ చానెల్ విలేకరిపైనా దాడిచేశారు. తాజాగా హార్బర్ మార్గంలో కుర్లా-వాషీ మధ్య శివారు రైళ్లను నిలిపివేసినట్లు మధ్య రైల్వే తెలిపింది. అయితే, సీఎస్ఎంటీ-కుర్లా, వాషీ-పాన్వెల్ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. కాగా, ఆందో ళనకారులను పోలీసులు నియంత్రించేందుకు యత్నిం చగా జరిగిన ఘర్షణలో నలుగురు పోలీసులుసహా ఐదుగురు గాయపడినట్టు ఉన్నతాధికారులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించామని, ఎటువంటి వదంతులనూ నమ్మవద్దని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్-వే మీద వాహన రాకపోకలను పునరుద్ధరించామని తెలిపారు. సామాజిక మాధ్యమాలలో ఏదైనా పోస్ట్ చేసేముందు తమను సంప్రదించాల్సిందిగా ముంబై పోలీసు అధికారులు ఓ ట్వీట్‌లో విజ్ఞప్తి చేశారు.

దళితులపై హింసాత్మక దాడులకు, వీటిని అరికట్టడంలో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా బుధవారం రాష్ట్ర బంద్ నిర్వహించాలని బి.ఆర్.అంబేద్కర్ మనవడు, భారిపా బహుజన్ మహాసంఘ్ (బీబీఎం) నాయకుడు ప్రకాశ్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. తమ బంద్ పిలుపునకు మహారాష్ట్ర డెమొక్రటిక్ ఫ్రంట్, మహారాష్ట్ర లెఫ్ట్‌ఫ్రంట్‌సహా 250 సంస్థలు మద్దతిస్తున్నాయని చెప్పారు. బంద్‌ను ప్రశాంతంగా నిర్వహించాల్సిందిగా ప్రజలకు ఆయన సూచించారు. మరోవైపు ముంబైలోని అన్ని పోలీసు స్టేషన్ల ఎదుట ధర్నా చేస్తామని ఆర్పీఐ ప్రకటించింది. కాగా, సోమవారం నాటి హింసాత్మక సంఘటనలకు 'హిందూ ఏక్తా అఘాదీ' (హెచ్ఈఏ)దే బాధ్యతని ప్రకాశ్ అంబేద్కర్ ఆరోపించారు. ఘర్షణ సంఘటనలను మరాఠా-దళిత వైరుధ్యంగా అభివర్ణించడం తగదన్నారు. సంస్మరణ కార్యక్రమం నిర్వహించిన 'శంభాజీ బ్రిగేడ్' మరాఠా సంస్థేనని గుర్తుచేశారు. అయితే, మిలింద్ ఎగ్బోటే నేతృత్వంలోని హెచ్ఈఏతోపాటు శంభాజీ భిడే నాయకత్వంలోని శివరాజ్ ప్రతిష్ఠాన్‌లే ఈ గొడవలకు మూల కారణమన్నారు. అఖిల భారత హిందూ సభ, పీష్వా వారసులు కూడా సంస్మరణను వ్యతిరేకించినా వారితో తమ చర్చల తర్వాత వ్యతిరేకించే ఆలోచనను వారు విరమించుకున్నారని తెలిపారు.



రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుబట్టిన శరద్‌పవార్

పుణెలో ఘర్షణలపై ఎన్‌సీపీ నేత శరద్ పవార్ స్పందించారు. పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనడంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. దళిత వర్గాలు తలపెట్టిన కార్యక్రమానికి పెద్దఎత్తున జనం తరలివస్తారని ముందుగా అంచనా వేయలేకపోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

గజల్ శ్రీనివాస్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)



మంగళవారం నాడు గజల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆధ్యాత్మికత, దేశభక్తి, మహిళల భద్రత తదితర అంశాలపై ఎన్నో కళారూపాలు చేసిన గజల్ శ్రీనివాస్ లైంగిక వేధింపుల కేసులో అరెస్టు కావడం తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది.

పక్కా ఆధారాలతోనే అరెస్టు.. ఏసీపీ

లైంగిక వేధింపుల కేసులో పక్కా ఆధారాలతోనే గజల్ శ్రీనివాస్‌ను అరెస్టుచేసినట్లు పంజాగుట్ట ఏసీపీ విజయ్‌కుమార్ స్పష్టంచేశారు. ఆలయవాణి వెబ్ రేడియోలో పనిచేస్తున్న కుమారి అనే యువతి .. గజల్ శ్రీనివాస్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని ఆధారాలతో సహా తమకు ఫిర్యాదు చేసిందన్నారు. వేధింపులకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్స్ తమ వద్ద ఉన్నాయని చెప్పారు. రేడియో ఆఫీసులోనే కుమారిపై శ్రీనివాస్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. యువతిని తన గదిలోకి పిలిపించుకొని.. లొంగదీసుకునే ప్రయత్నంచేసినట్లు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నా రు. ఆమెతో మసాజ్ చేయించుకోవడం.. ఒంటి మీద బట్టలు తీసేయాలని చెప్పడం.. బలవంతంగా హగ్ చేసుకోవడం, ముద్దులు పెట్టడం, కాళ్లు ఒత్తిచ్చుకోవడం వంటి దృశ్యాలు వీడియోల్లో ఉన్నాయని ఏసీపీ తెలిపారు. దీంతో గజల్ శ్రీనివాస్‌పై ఐపీసీ 354, 354ఏ, 509 సెక్షన్‌ల కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశామని వివరించారు. శ్రీనివాస్‌కు అనుకూలంగా వ్యవహరిం చిన మహిళా అటెండర్‌పైనా కేసు నమోదు చేసినట్లు ఏసీపీ చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు తర్వాత ఆలయవాణి వెబ్ రేడియో ఆఫీసులోకూడా కొంతమంది ఉద్యోగులను విచారించామన్నారు.

ఈ నెల 12వరకు రిమాండ్..

లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన గజల్ శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు ఈ నెల 12 వరకు రిమాండ్ విధించింది. గజల్ శ్రీనివాస్‌ను అరెస్టు చేసిన పోలీసులు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన మేజిస్ట్రేట్.. గజల్ శ్రీనివాస్‌కు రిమాండ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. రిమాండ్ ప్రకటించిన వెంటనే గజల్ శ్రీనివాస్ తరపు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలుచేశారు. ఇరుపక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి.. ఈ దశలో బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టంచేస్తూ న్యాయమూర్తి ఆ పిటిషన్‌ను కొట్టేశారు. ఆ వెంటనే పోలీసులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా గజల్ శ్రీనివాస్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నా బిడ్డలా చూశాను: గజల్

లైంగిక వేధింపుల కేసుపై ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ స్పందించారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో గజల్ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. 'నేను నా ఆత్మసాక్షిగా చెబుతున్నా. మహిళల ను గౌరవిస్తాను. నాపై ఫిర్యాదుచేసిన అమ్మాయిని నా బిడ్డలా చూశాను. ఆ అమ్మాయి ఒక ఆధ్యాత్మిక సంస్థలో పెరిగిన అమ్మాయి. నా మాటలను నమ్మండి. అమ్మాయిని వేధించాననే మాట అవాస్తవం. ఎటువంటి దృష్టితో ఆమె ఫిర్యాదు చేసిందో.. లైంగిక వేధింపులకు గురిచేశాడంటూ ఫిర్యాదు చేసిందంటే ఆశ్చర్యం కలిగింది. నా భుజానికి దెబ్బ తగిలిన సమయంలో నేను వద్దంటున్నా ఆమె మందు రాసింది. నేను మసాజ్ చేయించుకున్నానన్న ఆరోపణల్లో వాస్తవంలేదు. ఆలయ వాణి వెబ్ రేడియో ఆఫీసు నుంచి వీడియోలు తీసుకుపోయిందని కొందరు చెప్పారు. ఆ వీడియోల్లో ఏముందో కూడా తెలియదు. ఆ అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించలేదు' అని గజల్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

జగన్@700

700 కి.మీ దాటిన ప్రజా సంకల్పయాత్ర


కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వైసీపీ అధినేత పాదయాత్ర

చిత్తూరు, జనవరి 2:



వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర 700 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. యాత్రలో భాగంగా 50వ రోజు మంగళవారం చిత్తూరు జిల్లా పీలేరు నియోజకవర్గం జమ్మివారిపల్లె వద్ద ఈ మైలురాయిని దాటింది. ఈ సందర్భంగా జగన్ పార్టీ జెండాను ఆవిష్కరించి, మొక్కను నాటారు. నిరుడు నవంబర్ 6వ తేదీన కడప జిల్లా ఇడుపులపాయ నుంచి ప్రజా సంకల్పయాత్రను ప్రారంభించిన విషయం తెలిసిందే. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పాదయాత్ర చేశారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో కొనసాగిస్తున్నారు. ప్రతి వంద కిలోమీటర్లకు ఒక మొక్కను నాటుతూ జగన్ ముందుకు సాగుతున్నారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 100 కిలోమీటర్లు, డోన్ నియోజకవర్గంలో 200 కిలోమీటర్లు, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 300 కిలోమీటర్ల మైలురాయిని దాటారు. అనంతపురం జిల్లాలో 400 కి.మీ, 500 కిలోమీటర్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం చిత్తూరు జిల్లా సీటీఎం నుంచి జగన్ పాదయాత్రను ప్రారంభించారు. పులవండ్ల పల్లి, కాశీరావు పేట, వాల్మీకిపురం, ఐటీఐ కాలనీ, పునుగుపల్లి, విఠలం, టీఎమ్ లోయ మీదుగా జమ్మిలవారిపల్లి వరకు కొనసాగించారు. మార్గమధ్యలో వేరుశెనగ రైతులు ఆయనను కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. గిట్టుబాటు ధర లేదని, సహకార నూనె కర్మాగారాన్ని మూసివేయించారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక వేరుశెనగకు గిట్టుబాటు ధర కల్పిస్తామని జగన్ వారికి హామీయిచ్చారు. వాల్మీకిపురంలో జగన్‌కు భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు.

'సైనికులు రోజూ చస్తుంటారు



- బీజేపీ ఎంపీ నోటిదురుసు...దుమారం

న్యూఢిల్లీ, జనవరి 2: ''సైనికులు రోజూ చస్తూనే ఉంటారు. ప్రపంచంలో సైనికులు మరణించని దేశమేదైనా ఉందా? ఏదైనా గ్రామంలో గొడవ జరిగితేనే ఎవరో ఒకరు గాయపడతారే!'' అంటూ బీజేపీ ఎంపీ నేపాల్ సింగ్ నోటిదురుసుతో దుమారం రేపారు. జమ్ముకశ్మీర్‌లో సోమవారంనాటి ఉగ్రవాద దాడిలో ఐదుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించడంపై దేశ ప్రజలంతా సానుభూతి ప్రకటించారు. కానీ, ఈ దాడిపై విలేకరులు స్పందన కోరినపుడు నేపాల్ సింగ్ పైవిధంగా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ''బుల్లెట్లను ఆపగల పరికరమేదైనా ఉందా? మరణాన్ని నిలువరించే మార్గమేదైనా ఉందా? అలాంటివేమైనా ఉంటే చెప్పండి... మనం తయారు చేసుకుందాం'' అని నోరు పారేసుకున్నారు. దీంతో దేశవ్యాప్తంగా ఆగ్రహం వెల్లువెత్తగా సైనికులను అవమానించే ఉద్దేశమేదీ లేదని, క్షమించాలని కోరుతూ లెంపలేసుకున్నారు. కానీ, సింగ్‌ను ఏ మాత్రం క్షమించని నెటిజన్లు ట్విట్టర్‌లో ఆయనపై విరుచుకుపడ్డారు.

ఆరుగురిని కొట్టిచంపాడు

- మాజీ సైనికాధికారి ఉన్మాదం
- హరియాణాలో దారుణం

పల్వాల్, జనవరి 2: హరియాణాలోని పల్వాల్‌లో దారుణం చోటుచేసుకుంది. మాజీ సైనికాధికారి ఒకరు రెండు గంటల వ్యవధిలో ఐరన్ రాడ్డుతో ఆరుగుర్ని కొట్టి చంపాడు. ప్రస్తుతం వ్యవసాయశాఖలో సబ్ డివిజనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న 45 ఏళ్ల నరేశ్ కదియన్ ఈ హత్యలకు పాల్పడ్డాడు. మంగళవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటల మధ్య అతడు ఇలా ఊచకోతకు పాల్పడినట్లు తేలింది. మృతులలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులు, ఓ మహిళ కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నరేశ్ కొన్నాళ్లుగా మానసిక సమస్యలతో బాధప డుతున్నాడని, దీంతో భార్యాపిల్లలు ఆ యనకు దూరంగా ఉంటున్నారని సమాచారం. సైన్యంలో లెఫ్టినెంట్‌గా ఉద్యోగం చేసిన నరేశ్ 2003లో స్వచ్ఛందంగా రిటైరయ్యాడు.



నేడు రాజ్యసభకు ట్రిపుల్ తలాక్ బిల్లు

- ఏకాభిప్రాయ సాధనకు బీజేపీ ప్రయత్నాలు
- బిల్లుకు మద్దతివ్వాలని కాంగ్రెస్‌కు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జనవరి 2: ట్రిపుల్ తలాక్ బిల్లును బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లును మంగళవారమే సభలో ప్రవేశపెట్టాల్సి ఉంది. అయితే ఈ బిల్లులో పలు మార్పులు, సవరణలు చేయాలని కాంగ్రెస్ పట్టుబడుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌తో సంప్రదింపులు ప్రారంభించిన బీజేపీ వ్యూహాత్మకంగా బిల్లును బుధవారం ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఏకాభిప్రాయం సాధించిన తర్వాతే బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలని భావిస్తోంది. ప్రస్తుతం రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులే అధికంగా ఉన్నందున బిల్లు ఆమోదం పొందాలంటే ఆ పార్టీ ఆమోదం తప్పనిసరి. ఈ నేపథ్యంలో బిల్లుపై ఏకాభిప్రాయం సాధించాలని బీజేపీ భావిస్తోంది. వాస్తవానికి, లోక్‌సభలోనే పలు సవరణలను కాంగ్రెస్ ప్రవేశపెట్టినప్పటికీ అవి నిలబడలేదు. బిల్లు యథాతథంగానే సభామోదం పొందింది. దాంతో.. రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం సందర్భంగా సవరణలకు పట్టుబట్టాలని కాంగ్రెస్ ప్రణాళిక రచించింది. క్రిమినల్ చర్యలను సివిల్ చర్యలుగా మార్చడం, అందుకు ప్రభుత్వం ఒప్పుకోని పక్షంలో సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేయడం, అందుకూ ఒప్పుకోనట్లయితే ఓటింగ్‌కు పట్టుబట్టడం కాంగ్రెస్ వ్యూహంగా చెబుతున్నారు.

కాంగ్రెస్‌తో సంప్రదింపులు...

రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందేలా చూసేందుకు కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతరులను కూడా సంప్రదిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ తెలిపారు. ఏకగ్రీవంగా బిల్లు ఆమోదం పొందుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. కాగా, బిల్లును సెలక్ట్ కమిటీ పరిశీలనను పంపాలని వామపక్షాలు పట్టుబట్టనున్నట్టు సీపీఐ నేత డి.రాజా తెలిపారు.

'బొగ్గు' కేసులో మధుకోడాకు ఊరట

- కింది కోర్టు విధించిన శిక్ష, జరిమానాపై ఢిల్లీ హైకోర్టు స్టే
- షరతులతో కూడిన తాత్కాలిక బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ, జనవరి 2: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడాకు బొగ్గు కుంభకోణం కేసులో భారీ ఉపశమనం లభించింది. సీబీఐ ప్రత్యేక కోర్టు ఆయనకు విధించిన మూడేళ్ల జైలు శిక్ష, రూ.25 లక్షల జరిమానాపై ఢిల్లీ హైకోర్టు మంగళవారం స్టే విధించింది. ఆయన చేసిన అపీలుపై తదుపరి విచారణ ఈ నెల 22న జరుగుతుందని తెలిపింది. ఆ లోగా ఆయన అప్పీలుపై స్పందించాలని సీబీఐకి సూచించింది. తదుపరి విచారణ తేదీ వరకు ఆయనకు తాత్కాలిక బెయిలు మంజూరు చేస్తూ దేశం విడిచి వెళ్ళకూడదని షరతు విధించింది. జార్ఖండ్‌లోని బొగ్గు క్షేత్రాన్ని కోల్‌కతాకు చెందిన వినీ ఐరన్ అండ్ స్టీల్ ఉద్యోగ్ లిమిటెడ్‌కు కట్టబెట్టడంలో మధు కోడా అవినీతికి, కుట్రకు పాల్పడినట్లు దిగువ కోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పును ఆయన ఢిల్లీ హైకోర్టులో సవాలు చేశారు.

కార్తీ చిదంబరానికి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, జనవరి 2: కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీచేసింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ప్రశ్నించేందుకు ఈ నెల 11న హాజరు కావాలని ఆయనను ఆదేశించింది. గత ఏడాది మేలో మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ కేసు నమోదైంది. కార్తీ చిదంబరంతోపాటు ఐఎన్ఎక్స్ మీడియా, ఆ సంస్థ డైరెక్టర్లు పీటర్ ముఖర్జియా, ఇంద్రాణీ ముఖర్జియాతదితరులు నిందితులుగా ఉన్నారు.

పాక్‌పై ప్రభుత్వ విధానం ఏంటి?

- లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నిలదీత
- పుల్వామా ఉగ్రదాడి మృతులకు నివాళి

న్యూఢిల్లీ, జనవరి 2: సీమాంతర ఉగ్రదాడుల నుంచి సైనిక స్థావరాలను కాపాడుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. పుల్వామా ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించకపోవడాన్ని విమర్శించింది. పాకిస్థాన్‌పై ప్రభుత్వ వైఖరి చెప్పాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ఎంపీ జ్యోతిరాదిత్య సింధియా ఈ అంశాన్ని లేవనెత్తారు. పాకిస్థాన్‌లో ఉరిశిక్షపడిన నావికాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌ను చూసేందుకు వెళ్లిన ఆయన కుటుంబసభ్యులను ఘోరంగా అవమానించడాన్ని ప్రస్తావించారు. ఈ సంఘటన తర్వాత థాయ్‌లాండ్‌లో జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోవల్ పాకిస్థాన్ భద్రత సలహాదారుతో సమావేశం కావడాన్ని తప్పుబట్టారు. పాకిస్థాన్‌పై ప్రభుత్వ విధానమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ మాట్లాడుతూ.. సున్నితమైన అంశాలపై రాజకీయం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని అన్నారు. మూడేళ్లుగా 200 మంది ఉగ్రవాదులను హతమార్చామని, సర్జికల్ దాడులు చేయించామని గుర్తుచేశారు.

సభలో పాక్ వ్యతిరేక నినాదాలు

డిసెంబరు 31న సీఆర్పీఎఫ్ శిక్షణ కేంద్రంపై ఉగ్రదాడి ఘటనను లోక్‌సభ ఖండించింది. ఈ దాడిలో అమరులైన జవాన్లకు సభ్యులు నివాళి అర్పిస్తూ సంతాప సూచకంగా కొద్ది నిమిషాలపాటు మౌనం పాటించారు. అంతకుముందు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ వస్తుండగా బీజేపీ ఎంపీలు కొందరు 'పాకిస్థాన్ ముర్దాబాద్' అంటూ నినాదాలు చేశారు.

రెండో రాజధాని ఆలోచన లేదు

- లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వ ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 2: దక్షిణాదిలో రెండో దేశ రాజధానిని ఏర్పాటు చేసే ఆలోచన ఏదీ లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ అహిర్ తెలిపారు. మంగళవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో దక్షిణాదిలోని హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా మార్చే ప్రతిపాదన ఉందా అని టీఆర్ఎస్ ఎంపీ బూర నరసయ్య గౌడ్ అడిగారు. ఆయన ప్రశ్నకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ సమాధానమిస్తూ అటువంటి ప్రతిపాదనేదీ లేదని సభలో స్పష్టం చేశారు.

హెచ్-1బి వీసా పొడిగింపునకు నో



- కొత్త ప్రతిపాదనతో డీహెచ్ఎస్
- గడువు పూర్తయితే విమానం ఎక్కాల్సిందే!
- 'గ్రీన్‌కార్డ్' పెండింగ్‌లో ఉన్నా అంతే
- ప్రతిభావంతులకే ప్రాధాన్యం..
- భాగస్వామికి పనిచేసే అవకాశం ఎత్తివేత
- భారతీయులపైనే ప్రభావం ఎక్కువ
- 75 వేలమంది భారతీయులు వెనక్కి ?

న్యూఢిల్లీ, జనవరి 2: అమెరికాలో ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న దేశీయ టెకీ నిపుణులకు మరో బ్యాడ్ న్యూస్.. హెచ్1-బి వీసాను మరింత కఠినతరం చేసేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్) ప్రతి పాదనలను సిద్ధం చేస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'బై అమెరికన్, హైర్ అమెరికన్' ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రభావంతో హెచ్1-బి పిటిషనర్ల ఎంపిక ప్రక్రియ మరింత కఠినం కానుంది. ఇందులో మరిన్ని క్లిష్టమైన నిబంధనలను పొందుపరిచినట్లు తెలుస్తోంది. ఈ విజన్ కోసం ట్రంప్ కార్యాలయం తీసుకునే నిర్ణయాలతో భారీ మొత్తంలో భారతీయ వర్కర్లు వెనక్కి తిరిగి రావాల్సి వస్తుంది. డీహెచ్ఎస్ ప్రతిపాదనలతో, హెచ్-1బి వీసాలు కఠినతరం కావడం, గ్రీన్ కార్డు అప్లికేషన్లు పెండింగ్‌లో పడటం వంటివి చోటుచేసుకుంటున్నాయి. దీంతో వేలకొద్దీ భారతీయ ఉద్యోగులు అమెరికా నుంచి భారత్‌కు వచ్చేయాల్సిన పరిస్థితి ఎదురవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎక్కువగా ఐటీ రంగంపై ఈ ప్రభావం ఉండనున్నట్టు రిపోర్టులు పేర్కొంటున్నాయి. భారతీయ వర్కర్లకు హెచ్-1బి వీసాల అప్లికేషన్లకు గడువు పొడిగింపు కష్టతరం కావడంతో పాటు, శాశ్వత నివాసంకోసం పొందే గ్రీన్‌కార్డులు దరఖాస్తులు పెండింగ్‌లు పడుతున్నట్టు తెలిసింది. ఇప్పటివరకున్న నిబంధనలతో గ్రీన్ కార్డు ఆమోదం పొందలేని పక్షంలో హెచ్-1బి వీసాలకు రెండు మూడేళ్ల పొడిగింపును ట్రంప్ కార్యాలయం చేపడుతోంది. కానీ తాజా ప్రతిపాదనలతో ఈ వీసాల పొడిగింపు కష్టతరంగా మారుతోంది. దీంతో 50 వేల నుంచి 75 వేల వరకు భారతీయ హెచ్-1బి వీసా హోల్డర్స్ వెనక్కి రావాల్సి వస్తుందనే అంచనాలు వెలువడుతున్నాయి. వీసా సంబంధిత సమస్యలపై సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రి బాడీ నాస్కామ్, అమెరికా సెనేటర్లు, కాంగ్రెస్‌మెన్, అడ్మినిస్ట్రేషన్‌తో ఎప్పుడికప్పుడూ చర్చలు జరుపుతూనే ఉంది.

తెరపైకి పాతప్రదిపాదనలు..

ఇంటర్నేషనల్ ఇమ్మిగ్రేషన్ సంస్థ ఫ్రాగోమెన్స్ తన వెబ్‌సైట్ లో అప్‌డేట్ చేసిన సమాచారం మేరకు 2011లోని ప్రతిపాదనను పునరుద్ధరించాలని డీహెచ్ఎస్ సంకేతాలు ఇచ్చింది. ఈ పునరుద్ధర ణతో హెచ్-1బి క్యాప్ లాటరీ కోసం హెచ్1-బి పిటిషనర్లు ముందస్తుగా రిజిస్ట్రర్ చేసుకోవాల్సి ఉంటుంది. క్యాప్ మెంబర్లను సొంతం చేసుకున్న తర్వాత మాత్రమే క్యాప్ పిటిషన్లను సమర్పించాల్సి ఉంటుంది. అంతేకాదు గ్రీన్ కార్డ్ దరఖాస్తు పెండింగ్‌లో ఉన్న సమయంలోనూ హెచ్-1బి వీసాను పొడిగించే అవకాశం లేకుండా సవరణలు చేయాలని భావిస్తోంది. సాధారణంగా గ్రీన్ కార్డు కోసం కనీసం మూడేళ్ల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. హెచ్-1బి వీసా హోల్డర్లకు గ్రీన్ కార్డ్ జారీ విషయంలో అధికారులు సుదీర్ఘ ప్రక్రియను అనుసరిస్తుంటారు. ఒకవేళ ఈ దరఖాస్తు ప్రాసెస్‌లో ఉండగానే హెచ్-1బి వీసా గడువు ముగిసిపోతే సదరు ఉద్యోగులను వారి మాతృ దేశానికి తిప్పిపంపేయనున్నట్లు హోంలాండ్ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. అయితే, ఈ విషయంలో సెనేటర్లతో పాటు ప్రభుత్వ పెద్దలు, అడ్మినిస్టేషన్ ఉన్నతోద్యోగులు మరికొద్ది వారాల్లో సమావేశం కానున్నారని సమాచారం. ఈ నిబంధన కనుక అమలులోకి వస్తే దాదాపుగా 50 వేల నుంచి 70 వేల మంది వరకు హెచ్-1బి వీసా హోల్డర్లు స్వదేశానికి తిరిగి వెళ్లక తప్పదని నిపుణులు చెబుతున్నారు. కాగా, ఏటా జారీ చేసే 85 వేల హెచ్-1బి వీసాలలో 65 వేల వీసాలు ఉద్యో గులకు, మిగతా 20 వేల వీసాలు అడ్వాన్స్ డిగ్రీ కోర్సుల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జారీ చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇందులో దాదాపు 70 శాతం వీసాలు భారతీయులకే వెళుతున్నాయని డీహెచ్ఎస్ అభిప్రాయపడుతోంది.

ప్రతిభావంతులకే ప్రాధాన్యం..


హెచ్1-బి క్యాప్ మెంబర్లను జారీచేసేటప్పుడు కూడా ప్రాధాన్యత ప్రక్రియను చేపట్టాలని డీహెచ్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం హెచ్1-బి క్యాప్ మెంబర్లను జారీచేసే టప్పుడు అధిక మొత్తంలో చెల్లించే, ఎక్కువ ప్రతిభావంతులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తన అప్‌డేట్‌లో పేర్కొంది. అంతేకాక హెచ్1-బి వీసా దారుల భాగస్వామ్యులు అమెరికాలో పనిచేసేందుకు వీలులేకుండా నిబంధనలు తీసుకురావాలని కూడా ట్రంప్ ప్రభుత్వం చూస్తోంది. ఈ విషయాన్ని డీహెచ్ఎస్ అధికారికంగా కూడా ప్రకటించింది.

భారతీయులపైనే ప్రభావం ఎక్కువ..

ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికాలో ఇటీవల జరిగిన సమీక్షా భేటీలో భారతీయ కంపెనీలు, ఉద్యోగులను టార్గెట్ చేయడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. యూఎస్ టెక్నాలజీ కంపెనీలు, అక్కడి నిరుద్యోగులు, నిపుణులు హాజరైన ఈ సమావేశంలో భారత అవుట్ సోర్సింగ్ కంపెనీలు ఇమిగ్రేషన్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వలస పద్ధతులను అనుసరిస్తున్నారని ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. హెచ్1బి వీసాదారులకు కంపెనీలు ఎంత చెల్లిస్తున్నాయి, వేతన వ్యత్యాసాల వివరాలను కొంతమంది అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశమంతా భారత ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని సాగిందని చెబుతున్నారు. అమెరికన్ల ఉద్యోగాలను కాపాడే పేరిట ప్రతిపాదిత హెచ్ 1బి వీసా బిల్లులో అమెరికా అసాధ్యమైన షరతులను పొందు పర్చిందని దేశీ ఐటీ సంస్థల సమాఖ్య నాస్‌కామ్ ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్ తెలిపారు. హెచ్-1బి వీసాలు ఉపయోగించే క్లయింట్లకు కఠినతరమైన నిబంధన లు ఇందులో ఉన్నాయన్నారు.


రాజ్యసభ రికార్డు

- జీరో అవర్‌లో అన్ని అంశాలూ పూర్తి
- పార్లమెంట్ చరిత్రలో మొదటిసారి
- సభ్యుల సహకారంతో సాధ్యం: వెంకయ్య
- ఇదే ఒరవడి కొనసాగించాలని పిలుపు



న్యూఢిల్లీ, జనవరి 2: రాజ్యసభ చరిత్రలో తొలిసారిగా జీరో అవర్ కార్యకలాపాల జాబితాలోని అన్ని అంశాలనూ దిగ్విజయంగా పూర్తిచేసి రికార్డు సృష్టించింది. ఈ మేరకు మంగళవారం మొత్తం పది అంశాలతోపాటు అదనపు అంశాలను కూడా పూర్తిచేయడంలో సభ్యులందరూ సహకరించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మొదలైన తర్వాత సభలో నిత్యం రభస తప్పని నేపథ్యంలో అంతా ప్రశాంతంగా సాగిపోవడంపై సభాధ్యక్షుడు, ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు హర్షం వ్యక్తం చేశారు. ''రాజ్యసభ ఈ రోజు చరిత్ర సృష్టించింది. మొట్టమొదటిసారిగా జీరో అవర్‌లోని పది అంశాలే కాకుండా ప్రత్యేక అంశాలను కూడా దిగ్విజయంగా పూర్తిచేశాం. సభ్యులందరూ చక్కగా సహకరించడంవల్ల నా పని చాలా సులువైపోవడమేగాక ఈ రికార్డు సాధ్యమైంది'' అన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే ఒరవడి కొనసాగించాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. ఆ మేరకు సమయాన్ని వృథా చేయకుండా, షెడ్యూల్‌ను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. జీరో అవర్‌లో ప్రస్తావించే అంశాలపై మంత్రులు దృష్టి సారించి, సభ్యులకు వీలైనంత త్వరగా జవాబివ్వాలని సూచించారు. దీనివల్ల సభలో ఎక్కువ అంశాలను చేపట్టే అవకాశం ఉంటుందని వెంకయ్య చెప్పారు. ఇటీవల మరణించిన రాజ్యసభ మాజీ సభ్యుడు ఆర్.మార్గబంధుకు జీరో అవర్‌లో నివాళి అర్పించారు. దేశంలోని పలు విమానాశ్రయాల్లో విమానాలకు తృటిలో ప్రమాదం తప్పిన సంఘటనలను కాంగ్రెస్ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి ప్రస్తావించారు.

ఆ సమయంలో మాట్లాడొద్దు: వెంకయ్య



మరణించిన/మాజీ సభ్యులకు నివాళి అర్పిస్తూ మౌనం పాటించే సమయంలో సభ్యులు మాట్లాడరాదని వెంకయ్యానాయుడు సూచించారు. రాజ్యసభ మాజీ సభ్యుడికి నివాళి అర్పిస్తుండగా కొందరు సభ్యులు మాట్లాడుకోవడం గమనించానని తెలిపారు. దీనివల్ల తప్పుడు సంకేతం వెళ్తుందని, సభలో క్రమశిక్షణ పాటించాలని సూచించారు.

వైద్యుల సమ్మె విరమణ

- జాతీయ వైద్య కమిషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఐఎంఏ నిరసన
- డిమాండ్లకు కేంద్రం అంగీకారం
- స్టాండింగ్ కమిటీకి పరిశీలనకు బిల్లు
- బడ్జెట్ సమావేశాల్లోపు నివేదిక!



న్యూఢిల్లీ, జనవరి 2: జాతీయ వైద్య కమిషన్ బిల్లును వ్యతిరేకిస్తూ భారత వైద్యుల సంఘం (ఐఎంఏ) నేతృత్వంలో చేపట్టిన ప్రైవేటు వైద్యుల సమ్మెను విరమించారు. లోక్‌సభలో మంగళవారం ఈ బిల్లుపై చర్చ జరగాల్సి ఉండగా.. వైద్యుల సమ్మెతో వెనకడుగు పడింది. వైద్యుల సమ్మె కారణంగా దేశవ్యాప్తంగా రోగులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పార్లమెంటులో ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీంతో వైద్యుల డిమాండ్లకు అంగీకరిస్తూ బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పరిశీలనకు పంపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై పార్లమెంటు వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ కుమార్ మంగళవారం మధ్యాహ్నం లోక్‌సభలో ప్రకటన చేశారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోపు నివేదికను అందజేసేలా కమిటీని ఆదేశించాలని ఆయన స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కోరారు. మంత్రి ప్రకటన వెలువడిన అనంతరం ఐఎంఏ వైద్యులు తమ నిరసనను విరమించారు. ఇదిలా ఉండగా, రాజ్యసభలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ భారత వైద్య మండలి (ఎంసీఐ) స్థానంలో కొత్త నియంత్రణ వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు ప్రతిపాదించిన జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) బిల్లు వైద్య వృత్తికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఇది చట్టంగా మారితే ఆయుర్వేదం, హోమియోపతి వైద్యులు కూడా ఒక బ్రిడ్జి కోర్సును పూర్తి చేయడం ద్వారా అల్లోపతి వైద్యం ప్రాక్టీసు చేయవచ్చని చెప్పారు. బిల్లును వ్యతిరేకిస్తున్న ఐఎంఏ ప్రతినిధులతో తాము చర్చలు జరుపుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఎన్ఎంసీ బిల్లును యథావిధిగా ఆమోదిస్తే వైద్య విద్యలో విపరీతంగా అవినీతి పెరిగిపోతుందని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవి వాంఖేడ్కర్ అన్నారు. ఈ బిల్లులో వైద్య కళాశాలల్లో సీట్ల పెంపు, ఫీజుల విషయంలో ప్రభుత్వ నియంత్రణను తగ్గించేలా నిబంధనలు ఉన్నాయన్నారు..

ట్రంప్ వాతకు... పాక్ పూత

- అమెరికా రాయబారి డేవిడ్‌కు నిరసన
- ఆరోపణలపై జవాబిచ్చేందుకు సన్నాహం
- మంత్రిమండలి.. ఎన్నెస్సీతో ప్రధాని భేటీ
- దేవుడు మేలుచేస్తే నిజాల వెల్లడి: ఖవాజా
- ఉగ్రవాదంపై పాక్ పోరాటం అద్భుతం: చైనా

ఇస్లామాబాద్, జనవరి 2: పాకిస్థాన్‌కు సాయపడిన పాపానికిగాను తమకు మోసమే మిగిలిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెట్టిన 'వాతకు మందుపూత' తరహాలో ప్రతిస్పందించేందుకు పాక్ సిద్ధమవుతోంది. దీనిపై చర్చించడం కోసం ప్రధాని షాహిద్ ఖక్కన్ అబ్బాసీ తన అధ్యక్షతన మంగళవారం మంత్రిమండలి భేటీ ఏర్పాటు చేశారు. దీంతోపాటు బుధవారం జాతీయ భద్రత కమిటీ (ఎన్నెస్సీ)తో సమావేశం కానున్నారని రేడియో పాకిస్థాన్ తెలిపింది. కాగా, పదిహేనేళ్ల నుంచీ 3300 కోట్ల డాలర్ల మేర (రూ.2.1 లక్షల కోట్లకుపైగా) సహాయం చేసినందుకు పాక్ నుంచి దక్కింది 'అబద్ధాలు-మోసం' మాత్రమేనని ట్రంప్ సోమవారం మండిపడ్డారు. అమెరికా నాయకులను 'దద్దమ్మలు'గా పరిగణిస్తూ ఆఫ్ఘానిస్థాన్‌లో తాము వెంటాడుతున్న ఉగ్రవాదులకు దేశాన్ని 'సురక్షిత స్థావరం'గా మార్చేసిందని చీల్చి చెండాడారు. కొత్త సంవత్సరం తొలిరోజున సామాజిక మాధ్యమం ట్విట్టర్‌లో ఆయన చేసిన తొలి వ్యాఖ్య ఇదే కావడం గమనార్హం.

ఈ ట్వీట్ తర్వాత కాసేపటికే పాకిస్థాన్‌కు అందించ తలపెట్టిన 255 మిలియన్ల (రూ.1618 కోట్లకుపైగా) సైనిక సాయాన్ని నిలిపివేస్తున్నట్లు అధ్యక్ష భవనం ప్రకటిం చింది. ఉగ్రవాదులపై పాకిస్థాన్ చేపట్టే నిర్ణయాత్మక చర్యలపైనే ఈ సాయం విడుదల ఆధారపడి ఉంటుందని కూడా ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ట్రంప్ వ్యాఖ్యలపై ప్రతిస్పందనలో పాకిస్థాన్ ఆచితూచి అడుగువేస్తోంది. ఇందులో భాగంగా ట్రంప్ ఆరోపణలపై విదేశాంగ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పందిస్తూ- ''దేవుడు మేలు చేస్తే- నిజమేమిటో ప్రపంచానికి వెల్లడిస్తాం... వాస్త వాలు-అపోహల మధ్య వ్యత్యాసమేమిటో తేటతెల్లం చేస్తాం. అమెరికా నుంచి 15 ఏళ్లుగా మాకు అందిన సాయానికి సంబంధించిన వివరాలన్నీ పూసగుచ్చినట్లు వెల్లడిస్తాం'' అని బహు జాగ్రత్తగా ట్వీట్ చేశారు. అయి తే, సోమవారం రాత్రే పాక్ విదేశాంగ శాఖ కార్యదర్శి తెహమినా జంజువా ఇస్లామాబాద్‌లోని అమెరికా రాయబారి డేవిడ్ హేల్‌ను పిలిపించి ట్రంప్ వ్యాఖ్యలపై నిరసన తెలపడంతోపాటు వివరణ కోరారు. పాక్‌కు మద్దతుగా చైనా రంగంలో దిగింది. ఉగ్రవాదంపై పాకిస్థాన్ అద్భుత పోరాటాన్ని అంతర్జాతీయ సమాజం గుర్తించాలంటూ చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గెంగ్ షువాంగ్ కితాబిచ్చారు.



'యువాన్'ను వాటేసుకున్న పాక్

ట్రంప్ మండిపడిన నేపథ్యంలో పాక్ ప్రభుత్వం చైనా కరెన్సీ 'యువాన్'ను వాటేసుకుంది. తదనుగుణంగా విదేశీ మారక లావాదేవీలలో యువాన్ వినియోగాన్ని ప్రవేశపెడుతున్నట్లు 'స్టేట్‌బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్' మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు డాలరు, యూరో, యెన్ (జపాన్) వంటి అంతర్జాతీయ ద్రవ్యంతో సమానంగా యువాన్‌ను ఆమోదిత కరెన్సీగా పరిగణిస్తామని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.



ఏదేని రంగంలో ఉన్నత శిఖరాలను సాధించిన వ్యక్తులెందరో ఉంటారు. వారి జీవిత చరిత్రలను బయోపిక్‌ల రూపంలో తెరకెక్కిస్తున్నారు మన దర్శక నిర్మాతలు. ముఖ్యంగా ఈ బయోపికల్ ట్రెండ్ బాలీవుడ్, టాలీవుడ్‌లో ఎక్కువైంది. మన తెలుగు విషయానికి వస్తే మహానటి సావిత్రి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బయోపిక్‌లు ఇప్పటికే షూటింగ్ దశలో

వై.ఎస్.ఆర్ బయోపిక్

ఉన్నాయి. అలాగే స్వర్గీయ ఎన్టీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ల బయోపిక్‌లు కూడా త్వరలో సెట్స్ మీదకు వెళ్లనున్నాయి. ఇప్పుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌పై జీవిత కథతో త్వరలో ఓ చిత్రం రాబోతుంది. నిజానికి వైఎస్సార్ బయోపిక్ ఎప్పుడో రూపొందుతుందని వార్తలు వినిపించాయి. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. తాజాగా వైఎస్సార్ బయోపిక్‌కు సంబంధించిన సమాచారం బయటకు వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం 'ఆనందో బ్రహ్మ' ఫేమ్ మహి వి.రాఘవ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతుండగా, మలయాళ హీరో మమ్ముట్టి వైఎస్సార్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు వైఎస్సార్ కుమారుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కూడా ఒప్పుకున్నట్లు సమాచారం. ఇక త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రానుంది.

కథ కొత్తగా అనిపిస్తే చాలు

– బెల్లంకొండ శ్రీనివాస్



బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా శ్రీవాస్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సాక్ష్యం'. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న సినిమా ఇప్పటికే 70 శాతం చిత్రీకరణను పూర్తి చేసుకుంది. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుంది. హీరో బెల్లంకొండ శ్రీనివాస్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''సాక్ష్యం' మంచి కథాబలం ఉన్న సినిమా. 60 రోజులుగా ఈ సినిమా కోసం పీటర్ హెయిన్స్ పనిచేస్తున్నారంటే సినిమాలో యాక్షన్ పార్ట్ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. న్యూ ఏజ్ మేకింగ్. చాలా కొత్తగా ఉంటుంది. రేపు సినిమా చూస్తే..కొత్త ప్రయత్నమని మీరే అంటారు. ఇప్పటి వరకు ఇండియన్ స్క్రీన్‌పై యాక్షన్ సీక్వెన్స్‌లైన ఫ్లై బోర్డింగ్, జెట్‌స్కీస్, బి.ఎం.ఎక్స్ రైడింగ్ వంటి వాటిని దుబాయ్‌కు వెళ్లి స్పెషల్‌గా ట్రైనింగ్ తీసుకుని...తెరపై నేనే స్వయంగా చేశాను. 10 రోజులు ట్రైనింగ్ తీసుకున్న తర్వాత 25 రోజులు షెడ్యూల్ చిత్రీకరించాం. ఈ సినిమాలో 5 మేజర్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయి. పంచభూతాలు మీద వచ్చే ఫైట్స్ ఇంటర్‌లింక్‌గా కాన్సెప్ట్ బేస్డ్‌గా ఉంటాయి. ఇక ఇందులో నా పాత్ర గురించి చెప్పాలంటే నేనొక ఇంటర్నెట్ గేమింగ్ డైరెక్టర్ పాత్రలో కనపడతాను. ఇప్పటికే 70 శాతం చిత్రీకరణ పూర్తయ్యింది. ఈ జనవరిలో క్లైమాక్స్ చిత్రీకరిస్తాం. తర్వాత న్యూయార్క్ షెడ్యూల్ ఉంటుంది. తర్వాత మూడు పాటల చిత్రీకరణతో సినిమా పూర్తవుతుంది. అలాగే ఇప్పటివరకు తెలుగులో రాని రివేంజ్ డ్రామాను ఈ సినిమాలో చూస్తారు. డైరెక్టర్ శ్రీవాస్‌గారు 'లక్ష్యం' తర్వాత తయారు చేసుకున్న కథ ఇదే. ఆయన మేకింగ్ స్టయిల్ చాలా బావుంటుంది. 'సాక్ష్యం' నాకు నాలుగో సినిమా. ఇప్పటి వరకు పెద్ద దర్శకులతోనే పనిచేశాను. అయితే దర్శకులతో సంబంధం లేకుండా నా పాత్రల కోసం చాలా కష్టపడ్డాను. ఉదాహరణకు 'జయజానకి నాయక' సినిమా కోసం ఆరు నెలల్లో 20 కిలోల బరువు పెరిగాను. వెంటనే అలాగే 'సాక్ష్యం' కోసం బరువు తగ్గాను. ఇలా చేయడం చాలా కష్టం. అయిన సినిమా కోసం కష్టపడ్డాను. అలాగే కథ విషయంలో ఇలాగే ఉంటేనే చేస్తాననేం లేదు. ఎందుకంటే మంచి కథ ఉంటే యాక్షన్ సన్నివేశాలు లేకున్నా, నటిస్తాను. నా తదుపరి సినిమా ఏదనేది ఇంకా నిర్ణయించుకోలేదు'' అన్నారు.

సంక్రాంతికి రాజ్ తరుణ్

'రంగుల రాట్నం'



• రాజ్‌తరుణ్, చిత్రా శుక్లా

రాజ్ తరుణ్‌తో 'ఉయ్యాలా జంపాలా' వంటి సూపర్‌హిట్ చిత్రాన్ని నిర్మించిన అన్నపూర్ణ స్టూడియోస్ శ్రీరంజని దర్శకత్వంలో 'రంగుల రాట్నం' చిత్రాన్ని నిర్మించింది. చిత్రా శుక్లా హీరోయిన్. షూటింగ్ పూర్తి చేసుకొని ప్రస్తుతం ఫైనల్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేసేం దుకు సన్నాహాలు చేస్తున్నారు. రాజ్‌తరుణ్, చిత్రా శుక్లా, సితార, ప్రియదర్శి ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ: ఎల్.కె.విజయ్, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, ఆర్ట్: పురుషోత్తం ఎం., నిర్మాణం: అన్నపూర్ణ స్టూడి యోస్, దర్శకత్వం: శ్రీరంజని.

చరణ్ సినిమాకు దేవి

రామ్‌చరణ్, బోయపాటి శ్రీను మొదటి కలయికలో ఓ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం 'రంగస్థలం 1985' చిత్రం చేస్తున్న చరణ్ తదుపరి చిత్రం ఇదే. ఈ చిత్రం జనవరి మూడో వారంలో ప్రారంభం అవుతోంది. రామ్‌చరణ్ ఇప్పటివరకు కనిపించని ఓ కొత్త లుక్‌లో బోయపాటి చిత్రంలో కనిపిస్తారట. డి.వి.వి.దానయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా, దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని అందిస్తారని తెలుస్తోంది. మొదట ఈ చిత్రానికి థమన్ సంగీత దర్శకుడుగా అనుకున్నారు. అయితే తాజా సమాచారం మేరకు దేవిశ్రీప్రసాద్‌ను ఎంపిక చేశారు. ఈ చిత్రాన్ని విజయదశమి కానుకగా విడుదల చేయడానికి ప్లాన్ చేశారు.



• దేవిశ్రీప్రసాద్

బాలీవుడ్‌లో స్టార్ హీరోల పక్కన హీరోయిన్‌గా నటించే అవకాశం వచ్చిందంటే సౌత్ హీరోయిన్లు ఎగిరి గంతేస్తారు. కానీ, దానికి భిన్నంగా ఓ బాలీవుడ్ హీరో సరసన నటించడానికి భారీ మొత్తంలో పారితోషికం ఇస్తామని చెప్పినప్పటికీ నో చెప్పింది పూజా హెగ్డే. ఆ హీరోతో కొన్ని హాట్ సన్నివేశాల్లో నటించాల్సి వస్తుందని తెలిసి ఆ ఆఫర్‌ని తిరస్కరించిందట. ఆ బాలీవుడ్ హీరో జాన్ అబ్రహం. అంతర్జాతీయ స్థాయిలో భారీ యాక్షన్ మూవీగా 'రాహ్' అనే హిందీ చిత్రాన్ని నిర్మించబోతున్నాడు మిలాప్ జవేరి. తమ రెండో ప్రయత్నంగా తమన్నాని సంప్రదించిందట యూనిట్. కథ విన్న తమన్నా సినిమా చేయడానికి ఒప్పుకుంది. శృంగార సన్నివేశాల విషయాన్ని ఆమె ముందు ఉంచినపుడు వెంటనే నో చెప్పేసిందట. ఈ ఇద్దరు హీరోయిన్లు తిరస్కరించడంతో ఇప్పుడు శ్రుతిహాసన్‌ని సంప్రదిస్తున్నారని తెలిసింది. గతంలో జాన్ అబ్రహం, శ్రుతి హాసన్ కలిసి 'రాకీ హ్యాండ్సమ్' చిత్రంలో నటించారు. ఆ సినిమాలో వీరిద్దరి కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అయింది. 'రాహ్' చిత్రంలో కూడా భారీగా శృంగార సన్నివేశాలు ఉంటాయని తెలిసింది. ఈ సినిమాలో శ్రుతిహాసన్ నటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం. మరి శ్రుతి ఈసారి జాన్‌తో నటించడానికి ఓకే చెబుతుందో లేక పూజా, తమన్నా దారిలోనే వెళ్తుందో చూడాలి.

పూజా, తమన్నా దారిలోనే

శ్రుతి వెళ్తుందా?



ప్రేమ కంటే లక్ష్యమే గొప్పది



స్మైల్ పిక్చర్స్ పతాకంపై తెరకెక్కుతోన్న చిత్రం 'మూడు పువ్వులు ఆరు కాయలు'. అర్జున్ యజత్, భరత్ బండారు, రామస్వామి హీరోలుగా నటించారు. సౌమ్య వేణుగోపాల్, పావని, సీమా చౌదరి నాయికలు. రామస్వామి దర్శకుడు. వబ్బిన వెంకటరావు నిర్మాత. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపు కుంటుంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ''కడుపుబ్బా నవ్వించే హాస్య రసంతో పాటు, కంటతడి పెట్టించే కరుణ రసం కూడా సినిమాలో ఉంటుంది. దాదాపు నలభై చిత్రాలకు పైగా మాటల రచయితగా పనిచేసిన రామస్వామి మొదటిసారి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమ కంటే లక్ష్యమే గొప్పదనేదే ఈ సినిమా కాన్సెప్ట్'' అని చెప్పారు. ''షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి'' అని సమర్పకుడు డాక్టర్ మల్లె శ్రీనివాసరావు అన్నారు. ''చాలా చిత్రాలకు మాటల రచయితగా పనిచేశాను. దర్శకుడిగా ఇదే నా తొలి చిత్రం. మంచి కాన్సెప్ట్‌తో సకుటుం బాన్ని అలరించేలా తెరకెక్కించాను'' అని దర్శకుడు తెలిపారు.

పేరు లేని పాత్రలో



కీర్తి సురేష్

మలయాళ ముద్దుగుమ్మ కీర్తి సురేష్ ఇప్పుడు ఇటు తెలుగు, అటు తమిళ సినిమాల్లో నటిస్తూ బిజీ బిజీగా ఉంది. ఈ అమ్మడు నటించిన రెండు సినిమాలు ఈ సంక్రాంతికి సందడి చేయనున్నాయి. అందులో ఒకటి పవన్‌కల్యాణ్‌తో నటించిన 'అజ్ఞాతవాసి', కాగా మరొకటి సూర్యతో నటించిన 'గ్యాంగ్' ('తానా సెంద కూట్టమ్') ఈ నెల 12న విడుదలవుతుంది. ఈ చిత్రంలో బ్రాహ్మణ యువతి పాత్రలో కీర్తి కనపడనుంది. కాగా ఆసక్తికరమైన విషయమేమంటే..కీర్తి సురేష్ పాత్రకు ఈ సినిమాలో పేరు ఉండదట. మరి పేరు లేని పాత్రలో కీర్తి సురేష్ ఎలా మెప్పిస్తుందో చూద్దాం.

'జీరో'గా షారూఖ్



సినిమాలో తాము చేసే క్యారెక్టర్ కోసం ఎంతటి రిస్క్ తీసుకోవడానికైనా సిద్ధపడతారు కొంతమంది హీరోలు. తమ ఇమేజ్‌ని పక్కన పెట్టి అందవిహీనులుగా నటించడానికి కూడా రెడీ అయిపోతారు. ఇలాంటి ప్రయోగాలు హీరో కమల్‌హాసన్‌తో మొదలయ్యాయని చెప్పొచ్చు. తన కెరీర్‌లో విభిన్నమైన ఎన్నో క్యారెక్టర్లు చేసి మెప్పించారు కమల్. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వచ్చిన 'విచిత్ర సోదరులు' చిత్రంలో మరుగుజ్జుగా నటించి అందర్నీ ఆశ్చరపరిచారు. ఇప్పుడు మనకు అందుబాటులో వున్న టెక్నాలజీ అప్పుడు లేదు. అయినా మరుగుజ్జు పాత్రని ఎంతో సహజంగా చిత్రీకరించారు సింగీతం. ఆ క్యారెక్టర్‌ని ఎలా చేశారనేది ఇప్పటికీ మిస్టరీగానే ఉండిపోయింది. ఇప్పుడు తాజాగా బాలీవుడ్ హీరో షారూఖ్ ఖాన్ మరుగుజ్జుగా కనిపించబోతున్నారు. ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వంలో 'జీరో' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో షారూఖ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కత్రినా కైఫ్, అనుష్క శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి షారూఖ్ మరుగుజ్జు లుక్‌ని తెలియజేసే టీజర్‌ను విడుదల చేశారు. ఈ సంవత్సరం డిసెంబర్ 21న క్రిస్మస్ కానుకగా 'జీరో' చిత్రం విడుదలవుతుంది.

రామ్‌తో రష్మిక



కన్నడ చిత్రం 'కిరిక్ పార్టీ'తో తెరంగేట్రం చేసిన ముద్దుగుమ్మ రష్మిక మండన్న. ఈ అమ్మడు ఇప్పుడు తెలుగులో వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. నాగశౌర్యతో చేసిన 'ఛలో' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఇది కాకుండా విజయ్ దేవరకొండతో మరో చిత్రంలో నటిస్తుంది. రామ్ సరసన నివేదా, అనుపమ పరమేశ్వరన్ పేర్లు హీరోయిన్స్‌గా పరిశీలిస్తున్నారని రీసెంట్‌గా వార్తలు వినిపించాయి. కానీ ఇప్పుడు కన్నడ బ్యూటీ రష్మిక మండన్న రామ్ సరసన నటించనుంది. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మించనున్నారు. ప్రకాష్‌రాజ్ ఇందులో కీలకపాత్రలో నటిస్తున్నారు.



మెగాఫోన్ పట్టనున్న..

భలే భలే మగాడివోయ్', 'మహానుభావుడు' వంటి విజయవంతమైన చిత్రాలకు పనిచేసిన సినిమాటోగ్రాఫర్ 'నిజార్ షఫీ'. త్వరలోనే ఈయన మెగాఫోన్ పట్టనున్నారు.

వివరాల్లో కెళ్తే నిజార్ దర్శకత్వంలో ఓ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ తెరకెక్కనుంది. ఆసక్తికరమైన విషయమేమంటే ఇందులో అంజలి, అనీషా అంబ్రోస్, శ్రద్ధా శ్రీనాథ్, నందిత శ్వేత హీరోయిన్స్‌గా నటించనున్నారు.



'మనం' క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అఖిల ప్రియ

అందరి మన్ననలు పొందిన 'మనం'

- మరిన్ని విజయాలు సాధించాలి: అఖిలప్రియ
- సమస్యలను వెలికితీయడంలో భేష్: ఐజీ ఇక్బాల్
- 'మనం' నంబర్ 1గా నిలవాలి: ఎమ్మెల్సీ గంగుల

కర్నూలు, జనవరి 2 (మనం న్యూస్ బ్యూరో): అతికొద్ది కాలంలోనే అందరి మన్ననలు పొంది, ప్రజాసమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్న 'మనం' దినపత్రిక భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అఖిల ప్రియ ఆకాంక్షించారు. మంగళవారం కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో మనం దినపత్రిక క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజలకు చేరువైన పత్రిక మనం దినపత్రిక అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ రాంరెడ్డి, ఆళ్లగడ్డ ఆర్‌సీ ఇన్‌చార్జి జయప్రసాద్, జయగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఎక్కడో గ్రామాలలో జరిగిన సంఘటనలు యావత్ ప్రపంచానికి తెలిసేలా.. వార్తలను అందిస్తున్న మనం దినపత్రిక మరిన్ని విజయాలను సాధించాలని రాయలసీమ ఐజీ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. కర్నూలులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మనం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు సైతం మనం దినపత్రిక చేరువైందని అన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై విశ్లేషణాత్మక కథనాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యూరో ఇన్‌చార్జి నాగరాజు, డోన్ ఆర్‌సీ ఇన్‌చార్జి ఖాదర్‌భాష తదితరులు పాల్గొన్నారు.ఏ పార్టీకి కొమ్ముకాయకుండా నిజాలను నిర్భయంగా రాస్తు మనం దినపత్రిక ప్రజలకు చేరువ అవుతుందని వైసీపీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డలోని ఆయన నివాసంలో మనం దినపత్రిక క్యాలెండర్‌ను ఆయన అవిష్కరించారు.



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఐజీ ఇక్బాల్

హోల్‌సేల్ ఔట్‌లెట్లు!



- ఆర్డర్ల ద్వారా 'మాల్స్'కు కూరగాయలు
- జేఎన్‌టీయూ సహకారంతో సరికొత్త యాప్
- రాజమండ్రిలో ప్రయోగాత్మకంగా ప్రారంభం
- ఏజెంట్ల దందాకు చెల్లు.. రైతులకు గిట్టుబాటు
- ప్రణాళిక రూపొందించిన మార్కెటింగ్ శాఖ

అమరావతి, జనవరి 2 (మనం ప్రతినిధి): రైతుబజార్లు సంస్కరణల దిశగా రోజురోజుకూ బలోపేతం అవుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని రైతుబజార్లలో నగదు రహిత సేవలను ప్రారంభించిన మార్కెటింగ్ శాఖ.. త్వరలోనే హోల్‌సేల్ మార్కెట్ ఔట్‌లెట్‌లను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధానాన్ని, మన రాష్ట్రంలో అమలు చేయటానికి మార్కెటింగ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తొలుత రాజమండ్రి- కాకినాడలోని రైతుబజార్లలో ప్రయోగాత్మకంగా హోల్‌సేల్ ఔట్‌లెట్‌ను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది. జిల్లాలోని పెద్ద పెద్ద మాల్స్ నుంచి ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకునేందుకు కాకినాడ- జేఎన్‌టీయూ విద్యార్థుల సహకారంతో హోల్‌సేల్ ఔట్‌లెట్‌లో జరిగే లావాదేవీల కోసం సరికొత్త యాప్‌ను రూపొందిస్తోంది. రాష్ట్రంలో అన్ని కూరగాయల మార్కెట్ల వద్ద కమీషన్ ఏజెంట్లు రారాజుగా వ్యవహరిస్తుంటారు. వారు చెప్పిన ధరలకు రైతులు కూరగాయలు అమ్మాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కమీషన్ ఏజెంట్లు అందరూ సిండికేట్‌గా మారి మార్కెట్లలో రైతు తెచ్చిన పంటకు గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కమీషన్ ఏజెంట్లకు పోటీగా.. నేరుగా రైతు నుంచే కొనుగోలు చేసేందుకు హోల్‌సేల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేస్తే మార్కెట్‌లో పోటీతత్వం పెరిగి రైతుకు గిట్టుబాటు ధర పెరిగే అవకాశముంది. దీనికోసం త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా రైతుబజార్లలోనే హోల్‌సేల్ మార్కెట్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేయాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. మార్కెట్‌కు తీసుకొచ్చే కూరగాయలను నేరుగా అమ్ముకునే పరిస్థితి లేదు. తొలుత రైతులు కమీషన్ ఏజెంట్లను ఆశ్రయిస్తారు. రైతులు తీసుకొచ్చిన కూరగాయలను వేలం వేసిన తర్వాత వచ్చే ధరను కమీషన్ ఏజెంట్లు రైతులకు ఇస్తారు. ఇలా రైతు తెచ్చిన సొమ్మును అమ్మిపెట్టినందుకు క్వింటాకు ఇంత అని ఏజెంట్‌కు ముట్టజెప్పాలి. నిబంధనల ప్రకారం ఏజెంట్లకు కమీషన్ 4 శాతం అని ఉన్నప్పటికీ.. ఏజెంట్లు పది శాతానికి పైగా వసూలు చేస్తున్నారు. మార్కెట్ వ్యవస్థలో ఉన్న లోపాల వల్ల రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు మార్కెటింగ్ వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. ఇప్పటివరకు వినియోగదారుల కోసం రైతుబజార్లు ఉపయోగపడేవి. వీటిని మరింత బలోపేతం చేసి ఔట్‌లెట్లు ఏర్పాటు చేయటం వల్ల.. పెద్ద పెద్ద మాల్స్, సూపర్ మార్కెట్లకు అవసరమైన కూరగాయలను ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని సరఫరా చేస్తారు. బిగ్‌బాస్కెట్ వంటి ఆన్‌లైన్ సంస్థలతోనూ ఏపీ మార్కెటింగ్ శాఖ ఒప్పందం చేసుకుంది. ముందుగానే ఆర్డర్లు తీసుకోవడం ద్వారా డిమాండ్‌ను బట్టి రైతులు పొలంలో కూరగాయలను తెంపుతారు. కూరగాయలు ఎప్పుడు కోయాలి.. ఎప్పుడు రవాణా చేయాలి.. వంటి విషయాలను ఎప్పటికప్పుడు మొబైల్‌లలో రైతులకు సమాచారం వస్తుంది. దీనివల్ల మార్కెట్‌కు తీసుకొచ్చిన పంటకు గిట్టుబాటు ధర లేకుం డా, రోడ్డుపై పారబోసే పరిస్థితులు ఉండవు. రైతులు కూరగాయలు తెంపి, సేకరణ కేంద్రాలకు చేరవేస్తే చాలు. అక్కడ నుంచి కూరగాయలను నిరుద్యోగ బృందాలు, మార్కెటింగ్ సిబ్బంది హోల్‌సేల్ ఔట్‌లెట్లకు తరలిస్తారు. రైతుల నుంచి వచ్చిన కూరగాయలను డ్వాక్రా బృందాల సహాయంతో గ్రేడింగ్ చేసి, ప్యాక్ చేసి ఆర్డర్‌లను బట్టి మాల్స్, సూపర్ మార్కెట్లకు సరఫరా చేస్తారు. ఈ విధానంతో మార్కెట్ ధరలను బట్టి ఆ రోజు రైతుల ఖాతాలో డబ్బు ఆన్‌లైన్‌లో జమ చేస్తా రు. ఈ విధానం వల్ల రైతుకు శ్రమతో పాటు మంచి గిట్టుబాటు ధర కూడా లభిస్తుంది. హోల్‌సేల్‌లో అ మ్మగా మిగిలిన కూరగాయలను ఫార్మ్ టు హోమ్ విధానం ద్వారా వినియోగదారుల ఇళ్లకు నేరుగా సరఫరా చేయాలని మార్కెటింగ్ శాఖ ప్రణాళిక రూపొందించింది.





విశాఖకు విరాట్!

- మ్యూజియంగా ఐఎన్ఎస్ యుద్ధనౌక
- సాగర తీరంలో ఏర్పాటు: పర్యాటక శాఖ
- పర్యాటక రంగానికి మరింత ఊతం

విశాఖపట్నం, జనవరి 2 (మనం న్యూస్): పచ్చని తూర్పు కనుమలు, విశాల సాగర తీరంతో ఏటా లక్షలాది మందిని ఆకట్టుకొంటూ.. రాష్ట్ర పర్యాటక రాజధానిగా పేరుతెచ్చుకొన్న విశాఖకు విరాట్ కొత్త ఆకర్షణ కానుంది. ఇప్పటికే కురుసుర జలాంతర్గామి, టీయూ 142 యుద్ధ విమానాన్ని మ్యూజియంగా మార్చి విశాఖకు కీర్తిని ఇనుమడింపజేసిన పర్యాటక శాఖ.. భారీ యుద్ధనౌక ఐఎన్ఎస్ విరాట్‌ను పర్యాటక ప్రదర్శన శాలగా ఏర్పాటు చేయనుంది. భారత నౌకాదళ సేవల నుంచి నిష్క్రమించిన ఈ యుద్ధనౌకను విశాఖ సాగర తీరంలో జాతీయ స్థాయి మెరైన్ మ్యూజియంగా ఏర్పాటు చేసే ప్రతిపాదనకు పర్యాటక వారసత్వ బోర్డు ఆమోద ముద్ర వేసింది. కురుసుర జలాంతర్గామి, టీయూ 142 యుద్ధ విమానాలను ఆర్‌కే బీచ్‌లో రోడ్డుకు అటూ ఇటూ ఏర్పాటు చేసిన అధికారులు విరాట్ కోసం మాత్రం భారీ కసరత్తే చేయాల్సి వస్తోంది. ఇందుకోసం ప్రాథమికంగా కనీసం 18 ఎకరాల స్థలం అవసరం కావడంతో నగర పరిధిలోని ముఖ్య పర్యాటక ప్రాంతాలైన రుషికొండ, భీమిలి, మంగమూరి పేట, మూలకుద్దులను పరిశీలిస్తున్నారు. సాగర తీరంలోని ఈ ప్రాంతాలు యుద్ధనౌక విరాట్ కొలువుదీరేందుకు అనువైనవని నిర్ధారించారు. ఇక్కడి భౌగోళిక, వాతావరణ పరిస్థితులపై సర్వే కూడా పూర్తి చేసిన అధికారులు కేంద్ర పర్యాటక శాఖాధికారులకు వివరాలను అందజేశారు.

నిధులే సమస్య

విశాఖలో విరాట్‌ను మ్యూజియంగా మార్చే ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలియజేసినా ఇందుకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి తీసుకువస్తారనే ప్రశ్న వెంటాడుతోంది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు కనీసం వేయి కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని తొలుత అధికారులు అంచనా వేశారు. నిర్దేశించిన ప్రాంతాన్ని సిద్ధం చేసి ఈ నౌకను తీసుకువచ్చి లంగరు వేసేందుకే 300 కోట్ల రూపాయల వర కూ ఖర్చు అవుతుందని చెబుతున్నారు. దీని నిర్వహణ కోసం కోట్ల రూపాయలను వెచ్చించాల్సి ఉంటుంది. దీనిని అంతర్జాతీయ స్థాయి ప్రదర్శన శాలగా మార్చాలంటే విన్యాసాలకు వేదిక, పార్కింగ్ స్థలం, ఫుట్‌కోర్టులు వంటి పలు ఏర్పాట్లు చేయాలి. ప్రభుత్వం వద్ద తగినంత స్థలం లేనందువల్ల భూసేకరణ కూడా జరపాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కేంద్రం కొంత మేర సహకరిస్తే ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో దీనిని పట్టాలెక్కించవచ్చని పర్యాటక శాఖాధికారులు అభిప్రాయపడుతున్నారు. యుద్ధనౌక చాలా పెద్దది కావడం వల్ల ఇందులోని గదులను స్టార్ హోటల్‌గా మార్చడం, పెద్ద సమావేశ మందిరాలను ఏర్పాటు చేసి వాణిజ్యపరంగా వినియోగించడం, ఇటీవల ముఖ్యమంత్రి సూచించిన విధంగా దీనిపైన ఉండే హెలీప్యాడ్‌నే హెలీపర్యాటకానికి వినియోగించడం ద్వారా ఆదాయాన్ని పొందవచ్చని లెక్కలు వేస్తున్నారు. వినోద కార్యక్రమాలు, సాహస క్రీడలు, జల క్రీడలకు వేదిక చేయవచ్చన్న ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నారు. మ్యూజియం ఏర్పాటు చేయడం వల్ల విశాఖ పర్యాటక రంగానికి ఊతమిస్తుందని పర్యాటక రంగ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోడి పందేల పేరుతో అసాంఘిక కార్యక్రమాలా?

- పందేలు జరిగితే బాధ్యులు మీరే
- ఏపీ ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం
- విచారణ రేపటికి వాయిదా

హైదరాబాద్, జనవరి 2 (మనం లీగల్ ప్రతినిధి): కోడి పందేల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ అధికారులు, పోలీసులు ఏం చేస్తున్నారంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఏడాది సంక్రాంతికి కోడిపందేలు జరిగితే అందుకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలనే బాధ్యులను చేస్తామని స్పష్టం చేసింది. గత ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం శ్రీరాంపురం, వెంప గ్రామాల్లో కోడి పందేల పేరుతో జూదం, అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరిగాయని, ఈసారైనా వాటిని నిలువరించాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై సీజే జస్టిస్ రమేష్ రంగనాథన్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ జరిపారు. ఈ సమయంలో బెంచ్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులంటే లెక్క లేకుండా పోతోందని, గత ఏడాది డిసెంబరులో హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేసి ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదని న్యాయమూర్తులు అన్నారు. కోర్టులంటే గౌరవం లేకుండా కోడి పందేలను నిర్వహించి తీరుతామని నాయకులు చెప్పడం తీవ్ర విషయంగా పరిగణించాల్సిన అంశమని హెచ్చరించారు. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కోడి పందేలు నిర్వహించకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా ఉభయగోదావరి జిల్లాల్లో కోడి పందేలకు ఎన్ని బరులు సిద్ధం చేశారో నివేదించాలని గతంలోనే ఆదేశించిన ప్రభుత్వం తరపు లాయర్ కౌంటర్ దాఖలు చేయలేదని బెంచ్ ఆగ్రహించింది. రాత్రికి రాత్రే బరులు ఏర్పటు కాబోవని, ముందు నుంచే ఏర్పాట్లు ఉంటాయని, వాటి వివరాలు సమర్పించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది.

బాపట్ల భూకేటాయింపుపై స్టే

హైదరాబాద్, జనవరి 2 (మనం లీగల్ ప్రతినిధి): బాపట్లలో ప్రభుత్వ భూమిని మునిసిపాలిటీ తీర్మానంతో భావపూరి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ప్రగతి టైలర్స్ వర్కర్స్ అసోసియేషన్, బాపట్ల లయిన్స్ క్లబ్‌లకు కేటాయించడంపై హైకోర్టు స్టే ఇచ్చింది. బాపట్లలోని 19వ వార్డులోని సర్వే నెంబరు 576లో ఉన్న సర్కార్ భూమిని ఆయా సంఘాలకు కేటాయించడాన్ని తప్పుపడుతూ వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం మరోసారి విచారణ చేపట్టిన కోర్టు ప్రభుత్వ భూమిపై మునిసిపాలిటీ ఎలా తీర్మానం చేస్తుందని ప్రశ్నించింది. ఈ కేటాయింపులను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

తాంత్రిక పూజలు జరగలేదు

- దుర్గగుడి ఈవో సూర్యకుమారి



విజయవాడ, జనవరి 2: దుర్గగుడిలో ఎలాంటి తాంత్రిక పూజలు జరగలేదని ఆలయ ఈవో సూర్యకుమారి స్పష్టం చేశారు. గత నెల 26న అర్ధరాత్రి సమయంలో దుర్గగుడిలోకి ఓ అజ్ఞాత వ్యక్తి ప్రవేశించి తాంత్రిక పూజలు నిర్వహించినట్లు వస్తున్న ఆరోపణలు అవాస్తమన్నారు. మంగళవారం విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు. దుర్గగుడిపై ఇటువంటి ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ప్రధానార్చకుడు అంతరాలయాన్ని శుభ్రం చేసుకునేందుకు ఓ వ్యక్తిని సహాయకుడిగా తెచ్చుకున్నారని, అతడి ఫొటోలను అడ్డం పెట్టుకుని అవాస్తవ ప్రచారం చేయడం దారుణమని అన్నారు. ఈ వివాదానికి కారణమైన ప్రధానార్చకులు బద్రీనాథ్ బాబుపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయంలో భద్రతా లోపాలపై సమీక్ష చేసుకుంటామన్నారు.

అంతా అవాస్తవం: ప్రధానార్చకుడు

దుర్గగుడిలో తాంత్రిక పూజలు జరిగినట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఆలయ ప్రధానార్చకులు బద్రీనాథ్ బాబు స్పష్టం చేశారు. గత నెల 26న మరుసటి రోజు ఉదయానికి ఆలయాన్ని శుద్ధి చేయడం కోసం తనకు సహాయకుడిని తెచ్చుకున్నానని, ఆ సమయంలో ఎటువంటి పూజలూ జరగలేదని వివరించారు. అతడు కూడా కృష్ణా జిల్లాలోని ఓ ఆలయంలో అర్చకుడిగా ఉన్నారని, ఈ వ్యవహారంలో ఈవోకు ఏ మాత్రం సంబంధం లేదని చెప్పారు.

లోకేశ్‌ను సీఎం చేసేందుకే

- దుర్గగుడిలో తాంత్రిక పూజలు: అంబటి



విజయవాడ, జనవరి 2: బెజవాడ కనక దుర్గమ్మ ఆలయంలో గత నెలలో రహస్యంగా తాంత్రిక పూజలు జరిగాయని, వాటి వెనుక ఉంది టీడీపీ అధినాయకత్వమేనని వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆరోపించారు. చంద్రబాబు తనయుడు నారా లోకేశ్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకే ఈ పూజలు చేశారని అన్నారు. విజయవాడలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం అంబటి విలేకర్లతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు తన పార్టీ నాయకులతో ఈ తాంత్రిక పూజలు జరిపించారని, ఇప్పుడు విషయం బయటకు రావడంతో ఆ తప్పును అధికారులపై నెట్టేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారం నిలబెట్టుకునేందుకు దారులు వెతుక్కుంటున్న చంద్రబాబు వేల కోట్ల నల్లధనాన్ని ఖర్చు చేస్తున్నారని అంబటి రాంబాబు చెప్పారు. ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించకుండా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, కానీ జనవరి 1న చంద్రబాబు కుటుంబం మాత్రం వేద పండితుల ఆశీర్వాదం తీసుకుందని అన్నారు. దీనిని ఏ రకంగా చూడాలని ఆయన ప్రశ్నించారు. నూతన సంవత్సరం సందర్భంగా మద్యం దుకాణాలకు నిబంధనల సడలింపు ఇవ్వడంపైనా అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చేస్తున్న పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలను బట్టి చూస్తే ఆయనకు మతిస్థిమితం ఉందా? అని అనుమానం వస్తోందన్నారు. టీడీపీకి ప్రజలు ఓట్లు ఎందుకు వేయాలో చెప్పాలన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి మృతి

- రెండు చోట్లా ఆటోలను ఢీకొన్న లారీలు
- చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో ఘోరం





గంగవరం/ఎమ్మిగనూరు టౌన్2, జనవరి 2 (మనం న్యూస్): చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మరణించారు. రెండో చోట్లా ఆటోలను, లారీలు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.

చిత్తూరు జిల్లాలో ముగ్గురు దుర్మరణం


అతి వేగం ముగ్గురి ప్రాణాలను మింగేసింది. మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి లారీ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందగా.. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. చిత్తూరు జిల్లా గంగవరం మండలం కల్లుపల్లి గ్రామం వద్ద ఈ ఘటన జరిగింది. కల్లుపల్లి నుంచి పలమనేరు వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న లారీ అతి వేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ సుబ్రమణ్యం(30), మరో ఇద్దరు మరణించారు. ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా గాయపడగా వారిని 108 అంబులెన్సులో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కర్నూలు జిల్లాలో నలుగురి మృతి

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సమీపంలో కోటెకల్ గ్రామం వద్ద నాలుగు చక్రాల ఆటోను లారీ ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన భీమలింగారెడ్డి టాటా ఏస్ ఆటోలో ప్రయాణికులను తీసుకుని ఆదోని వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఆటోలో 12 మంది ఉన్నారు. డ్రైవర్ అక్కడికక్కడే మరణించగా, ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ముగ్గురు ప్రయాణికులు మరణించారు. మిగిలిన 8 మందిని మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. మరణించిన వారిలో కలుగొట్ల గ్రామానికి చెందిన కర్రెక్క(75), కోటెకల్ గ్రామవాసి అంజినమ్మ(60), బనవాసి ఫారంకు చెందిన ఖాదర్ బాష(35) ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించి, కొంత డబ్బును అందజేశారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వం తరపున వచ్చే అన్ని పథకాలను అందిస్తామని తెలిపారు. వైసీపీ ఇన్‌చార్జి ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

జన్మభూమి అర్జీలు 95% పరిష్కారం


- ఓర్వలేకే తల్లి, పిల్ల కాంగ్రెస్ విమర్శలు: జూపూడి



గుంటూరు, జనవరి 2: 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేకే తల్లి, పిల్ల కాంగ్రెస్‌లు విమర్శలు చేస్తున్నాయని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. గతంలో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో వచ్చిన అర్జీల్లో 95 శాతం వరకు పరిష్కరించామని వివ రించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పది రోజుల పాటు గ్రామగ్రామాన జన్మభూమి కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నా మన్నారు. సమస్యలను పరిష్కరించకుండా పారి పోయేది తల్లి, పిల్ల కాంగ్రెస్‌లేనని జూపూడి ఆరో పించారు. గత ప్రభుత్వాలు రచ్చబండ కార్యక్ర మాలు నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారే కానీ వాటిని పరిష్కరించలేదన్నారు. తమ ప్రభుత్వం జన్మభూమిలో వచ్చిన ప్రతి వినతినీ ఆన్‌లైన్‌లో పెడుతోందని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం సామాన్యులకు అండగా ఉంటుందని, కొత్తగా ఐదు లక్షల పెన్షన్లు మంజూరు చేసి వృద్ధులకు ఆసరాగా నిలిచినట్లు చెప్పారు.

సెన్సెక్స్ జనవరి 2 2018


33,812.26 ▼ -0.49



పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా మోటార్స్	3.16	భారతీ ఎయిర్‌టెల్	-2.24
ఓఎన్‌జీసీ	2.36	ఎస్‌బీఐ	-1.35
కోల్ ఇండియా	1.46	మారుతీ సుజుకి	-1.24
ఎన్‌టీపీసీ	1.19	లార్సెన్ టూబ్రో	-1.35
ఇండస్‌ఇండ్	1.15	హీరో మోటార్	-1.01

నిఫ్టీ జనవరి 2 2018

10442.20 ▲ 6.65



పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా మోటార్స్	3.50	ఐషర్	-4.09
టాటా పవర్	2.62	ఐడియా సెల్యులర్	-3.73
భారతీ ఇన్‌ఫ్రా	2.39	భారతీ ఎయిర్‌టెల్	-2.15
ఓఎన్‌జీసీ	2.34	అరబిందో	-1.83
యు.పి.ఎల్	2.34	హెచ్‌సీఎల్	-1.78


టాప్ లూజర్స్ 2 జనవరి

33,812.26


పాయింట్లు		%
516.30	భారతీ ఎయిర్‌టెల్	-2.24%
302.90	ఎస్‌బీఐ	-1.35%
9545.15	మారుతీ సుజుకి	-1.24%
1249.10	లార్సెన్ టూబ్రో	-1.01%
3734.10	హీరో మోటార్	-0.92%
559.70	యాక్సిస్ బ్యాంకు	-0.91%
2633.75	టీసీఎస్	-0.79%
260.95	ఐటీసీ	-0.76%
397.90	అదాని పోర్ట్స్	-0.62%
1339.45	హెచ్.యు.ఎల్	-0.58%

బి.ఎస్.ఇ సెన్సెక్స్ -0.49

బులియన్| గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్



వస్తూత్పత్తిలో వేగం

డిసెంబరులో పి.ఎం.ఐ. 54.7




న్యూఢిల్లీ: భారతదేశపు ఫ్యాక్టరీలలో కార్యకలాపాలు 2017 డిసెంబరులో గత ఐదేళ్ళలో ఎన్నడూ లేనంత వేగంతో విస్తరించాయని ప్రైవేటు రంగ సర్వే ఒకటి మంగళవారం వెల్లడించింది. ఫ్యాక్టరీలలో ఉత్పత్తి పెరిగింది. కొత్త ఆర్డర్లూ లభించాయి. ఫలితంగా, సంస్థలు ధరలు పెంచగలిగాయి. ఆసియాలోని మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలో రికవరీ కొనసాగుతోందనే అభిప్రాయాలను మంగళవారంనాటి ఈ డాటా బలపరుస్తోంది. పెరుగుతున్న ధరల ఒత్తిడులు వడ్డీ రేట్లను మరింత తగ్గించకుండా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ)ను నిలువరించేట్లు చేసే రిస్కులను కూడా తెలియజెప్పింది.

ఐ.హెచ్.ఎస్ మార్కెట్ సంకలనపరచే నికెయి మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ నవంబరులో ఉన్న 52.6 నుంచి డిసెంబరులో 54.7కి పెరిగింది. సంకోచం నుంచి వ్యాకోచాన్ని వేరుచేసే 50 స్థాయికి ఎగువున ఈ సూచి నమోదవడం వరుసగా దీనితో (డిసెంబరుతో) ఐదవ నెల అవుతుంది. ''భారతదేశపు వస్తూత్పత్తి ఆర్థిక వ్యవస్థ రికకవరీ బాటలో పురోగమించింది. నిర్వహణా పరిస్థితులు 2012 డిసెంబరు తర్వాత, పటిష్టమైన వేగంతో మెరుగుపడ్డాయి'' అని ఐ.హెచ్.ఎస్. మార్కిట్‌లో ఆర్థికవేత్త ఆష్నా దోధియా చెప్పారు. ''బలమైన వ్యాపార పనితీరుకు ఉత్పత్తిలో వేగంగా చోటుచేసుకున్న విస్తరణలు ముఖ్యమైన ప్రాథమిక అంశంగా ఉంటూ వచ్చాయి. 2012 డిసెంబరు, 2016 అక్టోబరు తర్వాత కొత్త ఆర్డర్లు వేగంగా రావడం ప్రారంభించాయి. దేశంలోను, అంతర్జాతీయ మార్కెట్లలోను పటిష్టంగా ఉన్న డిమాండ్ దీనికి కారణం'' అని ఆష్నా చెప్పారు. దేశ వస్తూత్పత్తి రంగం డిసెంబరులో వేతనాలు పొందేవారి సంఖ్య ఎక్కువగా ఉండడాన్ని వీక్షించింది. ఉద్యోగాల సృష్టి రేటు 2012 ఆగస్టు తర్వాత 2017 డిసెంబరులోనే ఎక్కువగా ఉంది.

కొత్త ఆర్డర్లకు సంబంధించిన ఉప సూచి 2016 అక్టోబరు తర్వాత అత్యధికంగా 2017 డిసెంబరులో 56.8 శాతానికి పెరిగింది. దీన్ని దేశీయ డిమాండ్‌కు ప్రచ్ఛన్న సూచీగా భావిస్తారు. విదేశాల నుంచి ఉన్న డిమాండ్ కూడా జూన్ తర్వాత చాలా వేగవంతమైన రేటుతో విస్తరించింది. ''ఇటీవలి షాక్‌లను తట్టుకుని ఆర్థిక వ్యవస్థ సర్దుకుంటూండడంతో సవాళ్ళు మిగిలే ఉన్నాయి. కానీ, సర్వే చరిత్ర కోసం పరిశీలించిన ధోరణితో పోల్చుకుంటే, మొత్తంమీద ఆరోహణ క్రమం బలంగా ఉంది. వస్తూత్పత్తి వర్గం ఈ దృష్టికోణాన్ని పంచుకుంటోంది. గత మూడు నెలల కాలంలో చూడనంత పటిష్టంగా సెంటిమెంట్ పుంజుకుంది. వచ్చే 12 నెలల కాలంలో మార్కెట్ పరిస్థితులలో మెరుగుదలలను ఆశించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు'' అని దోధియా చెప్పారు.

అదే సమయంలో, డిమాండ్ పటిష్టంగా ఉండడంతో, సంస్థలు గత 10 నెలల కాలంలో ఎన్నడూ చూడనంత వేగంగా ధరలు పెంచేశాయి. పెరుగుతున్న ఉత్పాదక సామగ్రి వ్యయాల వల్ల ఏర్పడుతున్న లోటును భర్తీ చేసుకునేందుకు అవి ఆ పని చేశాయి. మొత్తంమీద ద్రవ్యోల్బణం రానున్న నెల రోజుల్లో, కేంద్ర బ్యాంక్ వేసిన మధ్య కాలిక అంచనా 4.0 శాతం ఎక్కువగా ఉండవచ్చని సర్వే వెల్లడించింది. భారతదేశపు చిల్లర ద్రవ్యోల్బణం నవంబరులో, కేంద్ర బ్యాంక్ అంతకు ముందు వేసిన మధ్య కాలిక లక్ష్యం 4 శాతాన్ని మించి పోయింది. రానున్న నెలల్లో కీలక రేట్లను పెంచేట్లుగా ఇది కేంద్ర బ్యాంక్‌పై ఒత్తిడి తేవచ్చు. ఆర్.బి.ఐ డిసెంబరులో నిర్వహించిన సమావేశం తాలూకు నమోదైన వివరాలను చూస్తే, సభ్యులు ద్రవ్యోల్బణం గురించి ఎక్కువ ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తుంది.



'సెబి'కి పూర్తికాల సి.వి.ఓ



న్యూఢిల్లీ: మార్కెట్ల నియంత్రణ సంస్థ భారతీయ సెక్యూరిటీలు, ఎక్చ్సేంజ్ బోర్డ్ (సెబి) ప్రధానంగా దాని అధికారులు, వారి లావాదేవీలను ఒక కంట కనిపెడుతూ ఉండేందుకు ఒక పూర్తికాల ఛీఫ్ విజిలెన్స్ అధికారి (సి.వి.ఓ)ని నియమించాలని భావిస్తోంది. జీత భత్యాల విషయంలో ఒక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో సమాన హోదా సి.వి.ఓకి ఉంటుంది. సంస్థ లోపల అక్రమ విధానాలను కనిపెట్టడం, తప్పు చేసిన వారిని శిక్షించడం సి.వి.ఓ బాధ్యతగా ఉంటుంది. ఈ మేరకు 'సెబి' ఒక ప్రతిపాదనను ఇప్పటికే ఆమోదించినట్లు అధికారులు చెప్పారు. 'సెబి' వ్యవహరించే సున్నితమైన కేసులను దృష్టిలో పెట్టుకుని చూసినప్పుడు, పూర్తికాల సి.వి.ఓను నియమించడం శ్రేయోదాయకమని ఛీఫ్ విజిలెన్స్ కమిషన్ సలహా ఇచ్చింది. 'సెబి' భిన్నమైనది. భవిష్యత్తులో అది విజిలెన్స్ సంబంధింత అంశాలకు ఎక్కువ లోనయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. మార్కెట్ల నిఘా సంస్థ అయిన 'సెబి' సి.వి.ఓ పదవికి దరఖాస్తులు కోరుతూ అడ్వర్టయిజ్‌మెంట్ జారీ చేయవచ్చని భావిస్తున్నారు. ఈ పదవికి బయట అభ్యర్థులను పరిశీలించే అవకాశం ఉంది. 'సెబి'కి తొమ్మండుగురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల వరకు ఉండేందుకు అనుమతి ఉంది. సి.వి.ఓ పదవి ఆ సంఖ్యలో చేరదని తెలిసింది. 'సెబి' సుమారు 800 మంది ఉద్యోగులున్న చిన్న సంస్థ కావడం వల్ల, ఏర్పాటైనప్పటి నుంచి దానికి పార్ట్-టైమ్ సి.వి.ఓనే ఉన్నారు. ఈ పార్ట్-టైమ్ సి.వి.ఓ నిఘా విధులతోపాటు ఇతర బాధ్యతలనూ నిర్వహిస్తున్నారు. 'సెబి' సి.వి.ఓ నేరుగా ఛైర్మన్‌కు లేదా పూర్తి కాల సభ్యునికి సమాచారాన్ని నివేదించడం ఆనవాయితీగా ఉంది. 'సెబి' 2014లో ఆర్.కె. పద్మనాభన్ స్థానంలో పార్ట్-టైమ్ సి.వి.ఓగా జ్ఞాన్ భూషణ్‌ను నియమించింది. ఒకప్పటి బ్యాంక్ ఆఫ్ రాజస్థాన్ ప్రమోటర్లకు వ్యతిరేకంగా ఉన్న కేసును నీరుగార్చారనే ఆరోపణలకు సంబంధించి పద్మనాభన్ పాత్ర అప్పట్లో కేంద్ర నేర పరిశోధక సంస్థ (సి.బి.ఐ) పరిశీలనకు గురైంది. బ్యాంక్ ఆఫ్ రాజస్థాన్‌ను ఆ తర్వాత ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంక్ స్వాధీనం చేసుకుంది.

ఆహా అనిపించిన హీరో అమ్మకాలు

న్యూఢిల్లీ: దేశంలో ద్విచక్ర వాహనాల తయారీలో అతి పెద్ద సంస్థ హీరో మోటోకార్ప్ ఒక క్యాలండర్ సంవత్సరంలో సమష్టి అమ్మకాల్లో 70 లక్షల యూనిట్ల మైలురాయిని అధిగమించినట్లు మంగళవారం ప్రకటించింది. కంపెనీ 2017 జనవరి-డిసెంబరు కాలంలో రికార్డు స్థాయిలో 72,07,363 యూనిట్లను విక్రయించింది. 2017 ఆర్థిక సంవత్సరంలో (2017 ఏప్రిల్-డిసెంబరు కాలంలో) కంపెనీ సమష్టి అమ్మకాలు 55,85,558 యూనిట్లకు పెరిగాయి. 2016 ఏప్రిల్-డిసెంబరు కాలంలో అమ్మిన 50,42,435 టూవీలర్లతో పోలిస్తే, అది 11 శాతం వృద్ధి కింద లెక్క. నెలవారీ అమ్మకాలు చూసినా హీరో మోటోకార్ప్ దూసుకుపోతోందని తెలుస్తుంది. అది 2016 డిసెంబరులో 3,30,202 యూనిట్లను విక్రయిస్తే, 2017 డిసెంబరులో 4,72,731 యూనిట్లను విక్రయించింది. ''మా మోటారు సైకిళ్ళు, స్కూటర్లకు ఉన్న పటిష్టమైన డిమాండ్‌ను ఇవి ప్రతిబింబిస్తున్నాయి'' అని హీరో మోటోకార్ప్ ఛైర్మన్ పవన్ ముంజల్ చెప్పారు.

సిరులొలికిస్తున్న సింగరేణి

హైదరాబాద్: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ 2017-18 ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో బొగ్గు ఎగుమతుల్లో 9 శాతం పెరుగుదలను నమోదు చేస్తూ మెచ్చుకోతగ్గ పనితీరు ప్రదర్శించింది. అది గత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో 42.7 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా ఈ ఆర్థిక సంవత్సరంలో అదే కాలంలో 46.7 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఈ గనుల తవ్వకం కంపెనీ ఈ ప్రాంతంలోని పలు విద్యుదుత్పాదన కేంద్రాలకు వెన్నెముకగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో కూడా అది ఇదే రీతిలో



వృద్ధిని కనబరచగలదని భావిస్తున్నారు. వర్తమాన ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో 46.1 మిలియన్ టన్నుల బొగ్గును ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, సింగరేణి కాలరీస్ 46.7 మిలియన్ టన్నులను సాధించగలిగింది. కె. చంద్రశేఖర రావు నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి వారంలో ఏడు రోజులూ, 24 గంటలూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. దానికి ఊతమిచ్చేందుకు వృద్ధిలో ఈ గతిని ఇలాగే కొనసాగించాలని ఎస్.సి.సి.ఎల్. ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. శ్రీధర్ కాలరీస్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్ సదుపాయాన్ని కల్పించింది. మొదట నమూనాగా కొద్ది రోజులు అమలు చేసిన తర్వాత, 2017 డిసెంబరు 31 అర్థ రాత్రి నుంచి ఈ పథకాన్ని పూర్తిగా అమలులోకి తెచ్చారు.

ప్రిన్సిపల్ చేతికి పి.ఎన్.బి. వాటా

మూలధన సమీకరణకు నాన్-కోర్ ఆస్తుల విక్రయాలు, ఏకీకరణకు దిగుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు

ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంక్ సంయుక్త రంగంలోని మ్యూచువల్ ఫండ్‌లో ఉన్న తన వాటాను ప్రిన్సిపల్ ఫినాన్షియల్ గ్రూప్‌కు విక్రయించే ఒప్పందంపై సంతకాలు చేసింది. అయితే, ఎంత మొత్తానికి ఆ వాటాను విక్రయిస్తున్నదీ వెల్లడించలేదు. దీనితో ప్రిన్సిపల్-పి.ఎన్.బి. ఎసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, భారతదేశంలో ప్రిన్సిపల్ ట్రస్టీ కంపెనీలపై పూర్తి యాజమాన్యం ప్రిన్సిపల్ చేతికి వస్తుంది. ప్రిన్సిపల్ పి.ఎన్.బి. ఏ.ఎం.సి.లో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కి 21.38 శాతం వాటా ఉంది. ప్రిన్సిపల్ పి.ఎన్.బి. మ్యూచువల్ ఫండ్ నిర్వహణ కింద సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికం నాటికి రూ. 5,825 కోట్లు ఉన్నాయి. ఈ ఎసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో వాటాను, యాజమాన్య హక్కును ప్రిన్సిపల్ సంస్థ కొంత కాలంగా పెంచుకుంటూ వస్తోందని, భారతదేశంలో పెట్టుబడులు పెట్టడాన్ని, వృద్ధి చెందడాన్ని కొనసాగిస్తుందని ప్రిన్సిపల్ ఆగ్నేయాసియా, ఇండియా విభాగ అధ్యక్షుడు పెడ్రో బోర్డా చెప్పారు. ప్రిన్సిపల్ సంస్థ భారతదేశంలో దాదాపు 20 ఏళ్ళుగా ఉంది.

అమెరికా ప్రధాన కేంద్రంగా ఉన్న ప్రిన్సిపల్ కంపెనీ నిర్వహణ కింద 530.3 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 19.9 మిలియన్ కస్టమర్లకు ఫైనాన్షియల్ వృత్తినిపుణుల నెట్‌వర్క్ ద్వారా సేవలందిస్తోంది. భిన్న కంపెనీలు కలిగిన ఈ సంస్థ 18 దేశాలలో కార్యాలయాలు నిర్వహిస్తోంది. ''భారతదేశంలో ఆవిర్భవిస్తున్న అతిపెద్ద మధ్యతరగతి వర్గానికి దీర్ఘకాలిక పొదుపు, ఇన్వెస్ట్‌మెంట్ సాధనాల అవసరమూ ఉంది. వాటిపై వారికి ఆసక్తీ ఉంది'' అని బోర్డా చెప్పారు. ''భారతీయులు వారి వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యాలను, మరింత ఫైనాన్షియల్ సెక్యూరిటీని సాధించడంలో సహాయపడేందుకు, రిటైర్‌మెంట్, ఎసె ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రపంచ వ్యాప్తంగా మాకున్న నైపుణ్యాన్ని వినియోగించడం కోసం మేం ఎదురుచూస్తున్నాం'' అని ఆయన చెప్పారు. అడ్వైజర్లు వారి కస్టమర్లకు మెరుగ్గా సేవలందించేందుకు మరింత డిజిటల్ న వకల్పనలు తీసుకురావడానికి ప్రిన్సిపల్ ఇండియా సం స్థ ప్రణాళికలు రచిస్తోంది. ఫైనాన్సులను ఆన్‌లైన్‌లో నిర్వహించుకోవడంలో కస్టమర్లకు మరింత యాక్సెస్ కల్పించడానికి అది దోహదపడుతుందని ఆయన చెప్పారు.

మొండి బాకీలతో కునారిల్లుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు నిధులు కోరుతూ ప్రభుత్వం ముందుకు వెళ్ళే ముందు, మూలధనాన్ని సమీకరించుకునేందుకు తమ నాన్-కోర్ ఆస్తులను అమ్మడమో లేదా ఏకీకృతం చేసుకోవడమో చేస్తున్నాయి. ఇంతకుముందు, బరోడా



పయొనీర్ ఎసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, బరోడా పయొనీర్ ట్రస్టీ కంపెనీలలో సంయుక్త రంగంలోని తన భాగస్వామి యూనిట్ క్రెడిట్‌కు ఉన్న మొత్తం 51 శాతం వాటాను, బ్యాంక్ ఆఫ్ బరోడా కొనుగోలు చేసింది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెల్జియం కేంద్రంగా ఉన్న సంయుక్త రంగ మ్యూచువల్ ఫండ్ భాగస్వామి పార్టిసిపేషన్స్ రెంటల్ ఎస్.ఏని స్వాధీనం చేసుకుని, మ్యూచువల్ ఫండ్ వ్యాపారంలో ఉన్న 40 శాతం వాటాను జపాన్‌కు చెందిన దాయ్-ఇచీ లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీకి విక్రయించింది.

ప్రభుత్వ రంగంలోని ఏడు బ్యాంకుల సౌజన్యంతో నడుస్తున్న మ్యూచువల్ ఫండ్లలో బరోడా పయొనీర్ మ్యూచువల్ ఫండ్, బి.ఓ.ఐ. యాక్సా మ్యూచువల్ ఫండ్, కెనరా రోబెకో మ్యూచువల్ ఫండ్, ఐ.డి.బి.ఐ. మ్యూచువల్ ఫండ్, ఎస్.బి.ఐ మ్యూచువల్ ఫండ్, యూనియన్ మ్యూచువల్ ఫండ్, ప్రిన్సిపల్ (పంజాబ్ నేషనల్ బ్యాంక్) మ్యూచువల్ ఫండ్ కూడా ఉన్నాయి.

ఈ ఏడు మ్యూచువల్ ఫండ్ల నిర్వహణ కిందనున్న ఆస్తులు జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఉన్న రూ. 2.10 లక్షల కోట్ల నుంచి సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికానికి 11 శాతం పెరుగుదల కనబరుస్తూ రూ. 2.34 లక్షల కోట్లకు పెరిగాయి.

లోపించిన ఉత్సాహం

ముంబయి: ఈ నెలలో రానున్న రోజుల్లో కార్పొరేట్ ఫలితాలు వెల్లడవనున్న దృష్ట్యా ట్రేడర్లు, ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో 'సెన్సెక్స్', 'నిఫ్టీ'లు పెద్దగా పెరగని, తగ్గని స్థాయిలోనే ముగిసాయి. భారతీయ స్టాక్ మార్కెట్లు కొత్త ఏడాదిని తగ్గుముఖం పట్టిన స్థితిలోనే ప్రారంభించాయి. స్టాక్ మార్కెట్లు 2017కు మాత్రం గత మూడేళ్ళలో ఎన్నడూ లేనంత గరిష్ఠ వార్షిక లాభాలతో వీడ్కోలు పలికాయి. ఇప్పుడు ఇన్వెస్టర్ల దృష్టి అంతా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్ లిమిటెడ్‌తో సహా వివిధ కంపెనీలు వెల్లడించనున్న ఫలితాలపై ఉంది. ఫెడరల్ రిజర్వ్ డిసెంబర్ సమావేశ చర్చల వివరాలు బుధవారంనాడు వెల్లడి కానున్నాయి. ట్రేడర్ల సాచివేత ధోరణికి అది కూడా ఒక కారణం. ప్రభుత్వం 2018/19 బడ్జెట్‌ను ఫిబ్రవరి ప్రారంభంలోనే ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమవుతోంది. తదనంతరం ఆర్.బి.ఐ పరపతి విధాన సమీక్షా సమావేశం ఉంటుంది. ''రానున్న దేశీయ పరిణామాల దృష్ట్యా మార్కెట్లు స్తబ్ధుగా వ్యవహరించి ఉండవచ్చు'' అని జియోజీత్ ఫినాన్షియల్ సర్వీసెస్ ప్రధాన ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త గౌరంగ్ షా అన్నారు.

బొంబాయి స్టాక్ ఎక్చ్సేంజ్ (బి.ఎస్.ఇ) సెన్సెక్స్ మంగళవారం 0.49 పాయింట్లు తగ్గి 33,812.26 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్చ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' 6.65 పాయింట్లు కోల్పోయి 10,442.20 పాయింట్ల వద్ద ముగిసింది. బి.ఎస్.ఇ.లోని రంగాలవారీ సూచీలలో ఆయిల్ అండ్ గ్యాస్ సూచి అత్యధికంగా 0.51 శాతం తగ్గింది. ఎఫ్.ఎం.సి.జి. 0.42 శాతం, పి.ఎస్.యు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్లు 0.34 శాతం చొప్పున పతనమయ్యాయి. ఆటో రంగ



సూచి 0.15 శాతం, విద్యుచ్ఛక్తి రంగం (0.13 శాతం), లోహాలది (0.05 శాతం) పెరిగాయి. ముడి చమురు ధరలు పెరగడంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల షేర్ల ధరలు తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 2015 మే తర్వాత, గరిష్ఠ స్థాయిలో పీపా 67.27 డాలర్లకు చేరుకుంది. ఇరాన్‌లో పెరుగుతున్న ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలు, 'ఒపెక్' దేశాలు, రష్యా సరఫరాలో విధించుకున్న కోతను కొనసాగిస్తూండడం ముడి చమురు ధర పెరగడానికి పురికొల్పాయి.

తాత్కాలిక డాటా ప్రకారం, సోమవారంనాడు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ. 325.91 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేయగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 1,300.31 కోట్ల విలువైన ఈక్విటీలు కొనుగోలు చేశాయి.

బజాజ్ అమ్మకాలు భేష్

ముంబయి: బజాజ్ ఆటో షేర్ల ధరలు మంగళవారం దాదాపు 1.55 శాతం పెరిగాయి. కంపెనీ మొత్తం అమ్మకాల్లో 29.72 శాతం పెరుగుదలను కనబరచడమే దానికి కారణం. బజాజ్ 2016 డిసెంబరులో 2,25,529 యూనిట్లను విక్రయిస్తే, 2017 డిసెంబరులో 2,92,547 యూనిట్లను విక్రయించింది. మునుపు రూ. 3,293.40 వద్ద ముగిసిన బజాజ్ షేర్ ధర మంగళవారం ఉదయం రూ. 3,314.85 వద్ద పటిష్టమైన స్థితిలో ప్రారంభమైంది. ఇంట్రాడేలో అది రూ. 3,344.50 గరిష్ఠ స్థాయిని, రూ. 3,285.25 కనిష్ఠ స్థాయిని తాకింది. చివరకు రూ. 3,295 వద్ద ముగిసింది. కంపెనీ మోటారు సైకిళ్ళ అమ్మకాలు 12.52 శాతంపెరిగాయి. అవి 2016 డిసెంబరులో 2,03,312 యూనిట్లు అమ్ముడుపోగా, 2017 డిసెంబరులో 2,28,762 యూనిట్లు అమ్ముడుపోయాయి. కమర్షియల్ వాహనాల అమ్మకాలు కూడా అదే కాలానికి చూస్తే 22,217 యూనిట్ల నుంచి 63,785 యూనిట్లకు పెరిగాయి. అదే మాదిరిగా, 2016 డిసెంబరులో 1,05,804 యూనిట్ల మేరకు ఉన్న ఎగుమతులు 2017 డిసెంబరులో 1,43,038 యూనిట్లకు పెరిగాయి.

సుజుకి అమ్మకాలు సూపర్

న్యూఢిల్లీ: సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డిసెంబరు నెల తాలూకు మొత్తం అమ్మకాల్లో 50.16 శాతం పెరుగుదల కనబరచింది. సుజుకి 2016 డిసెంబరులో 26,495 యూనిట్లు అమ్మగా, 2017 డిసెంబరులో 39,786 యూనిట్ల విక్రయాలను నమోదు చేయగలిగింది. దేశీయ అమ్మకాలు 2016 డిసెంబరులో ఉన్న 21,362 యూనిట్ల నుంచి గత నెలలో 32,786 యూనిట్లకు పెరిగాయి.



ఇది 53.47 శాతం వృద్ధి కింద లెక్క. కంపెనీ 2016 డిసెంబరులో 5,133 యూనిట్లు ఎగుమతి చేయగా, 2017 డిసెంబరులో 7000 యూనిట్లు ఎగుమతి చేసింది. సుజుకి 2016లో 3,93,828 యూనిట్లు విక్రయించగా, 2017లో 5,41,389 యూనిట్ల అమ్మకాన్ని నమోదు చేయగలిగింది. సుజుకి ద్విచక్ర వాహనాల సమష్టి అమ్మకాలు 2017-18 ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల యూనిట్ల మైలురాయిని ఇప్పటికే అధిగమించాయి. అవి 2017 ఏప్రిల్-డిసెంబరు కాలంలో 4,20,736 యూనిట్లు అమ్ముడయ్యాయి. ''ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 4 లక్షల యూనిట్ల అమ్మకాలను పూర్తి చేసుకున్నందు వల్ల, ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తంమీద 5 లక్షల యూనిట్ల అమ్మకాల లక్ష్యాన్ని సాధించగలమనే నమ్మకం ఉంది'' అని సుజుకి మోటార్ సైకిల్ అమ్మకాలు, మార్కెటింగ్ విభాగ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు సజీవ్ రాజశేఖరన్ చెప్పారు.

కొలువుల మేలుకొలుపు!



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాలను ఆశిస్తున్న అభ్యర్థులకు 2018 శుభవార్తలు తేనుంది. ఉమ్మడి రాష్ట్ర విభజన తరువాత ఏర్పడిన ఒత్తిడులను ఎదుర్కొని నియామక సంస్థలు రెండు రాష్ట్రాల్లోనూ గాడినపడి నియామకాల ప్రక్రియకు తుది రూపును ఇస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవటానికి అభ్యర్థులు అన్నిరకాలుగా సంసిద్ధం కావాలి! గ్రూప్స్, డీఎస్‌సీ, వీఆర్‌ఓ, వీఆర్‌ఏ మొదలైన పోస్టులే కాకుండా ఇంజినీరింగ్, శాంతి భద్రతలు, మానవ వనరుల శాఖల నుంచి భారీ సంఖ్యలోనే నియామక ప్రకటనలు వెలువడే అవకాశముంది. ఆశలను నెరవేర్చుకునే క్రమంలో ఆచరణ ఉండాలి. వెలువడిన ప్రతి



నోటిఫికేషన్‌కూ స్పందించాల్సిన అవసరం లేదు. మొదట అభిరుచికి ప్రాధాన్యమిచ్చి ఏయే ఉద్యోగాలను సంతోషంగా నిర్వహించగలరో అభ్యర్థి నిర్ణయించుకోవాలి. అందుకు తగిన అర్హతలు తనకు ఉన్నాయో లేదో అని నిర్ణయించుకోవడం తదుపరి చర్య. ఖాళీల సంఖ్య, లభ్యమయ్యే సమయం తరువాత పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు. వీటన్నిటినీ పరిగణించిన తరువాత ఒకటి, రెండు నోటిఫికేషన్లను లక్ష్యంగా ఎంచుకోవాలి. సిలబస్ పరిశీలన, పాత ప్రశ్నపత్రాల అధ్యయనం తరువాతి చర్యలు. సిలబస్‌లోని అనుకూల, ప్రతికూల అంశాలపై దృష్టిపెట్టి ఒక అంచనాకి రావడం...ఆపై చేయాల్సినవి. లభిస్తున్న సమయంలో సిలబస్‌పై పట్టు సాధించగలరా అనేది మరో కీలక నిర్ణయాత్మక అంశం. ఎదురయ్యే సవాళ్లను అంచనా వేయడం లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇంకో ముఖ్యాంశం. మెటీరియల్, ఆర్థిక మద్దతు, ఆరోగ్యం, లభించే సమయం లాంటి సవాళ్లపై స్పష్టమైన అవగాహన ఉంటే లక్ష్యాన్ని సాధించడంలో మరో అడుగు పడినట్లే. ఇప్పటికే 2-3 ప్రయత్నాలు చేసి విఫలమైనవారు సమీక్షించుకోవల్సిన సమయమిది. 'లోపాలను గుర్తించడం' అనే ప్రక్రియతో సన్నద్ధతను ప్రారంభించాలి. సామర్థ్యానికి తగిన ఉద్యోగాలను ఎంపిక చేసుకోకపోవడం, సరైన గైడెన్స్ లేకపోవడం, చదివిన మెటీరియల్‌లో లోపాలు, విపరీతమైన పోటీ ఉంటుందని పునాదులు లేని అభ్యసనం చేయడం, అకడమిక్ ధోరణులనే పోటీపరీక్షల్లో అనుసరించడం, సాటి అభ్యర్థుల ప్రభావంతో సరికాని మార్గాల్లో అభ్యసించడం లాంటి లోపాలు ఉండవచ్చు. వీటన్నింటినీ సమీక్షించుకుని శక్తులను సమర్థంగా పునర్వినియోగించే ప్రణాళిక రూపకల్పన జరగాలి.

అనువైన సమయమిదే!



వైద్యవిద్య చదవాలనుకునే విద్యార్థులు జాతీయస్థాయిలో రాసే పరీక్ష... 'నీట్'. సరైన ప్రణాళిక వేసుకుని ఆ ప్రకారం తయారవ్వడానికి అనువైన సమయమిదే. ఈ పరీక్ష స్కోరులో, మొత్తం ర్యాంకులో కీలకపాత్ర వహించేవి జీవశాస్త్రం (బయాలజీ) మార్కులు. నీట్ పూర్వ ప్రశ్నపత్రాల తీరు ద్వారా ఈ సబ్జెక్టును ఎలా సాధన చేయాలో గ్రహించవచ్చు. అందుకు ఉపకరించే విశ్లేషణ..! నీట్‌లో మంచి ర్యాంకుతోపాటు ప్రభుత్వ/ ప్రైవేటు 'ఎ' కేటగిరీలో సీటు సాధించాలంటే 720 మార్కులకు 510కుపైగా, ప్రైవేటు 'బి' కేటగిరీలో సీటు సాధించాలంటే 330కిపైగా మార్కులు సాధించాలి. కేవలం క్వాలిఫై అవ్వాలన్నా, ఇతర కేటగిరీల్లోనైనా స్కోరు ఆశించిన స్థాయిలో ఉండాలన్నా బయాలజీదే సింహభాగం అవుతుంది. అంటే.. ఈ సబ్జెక్టులో పట్టు లేకపోతే 'నీట్'లో ఏ స్థాయిలో రాణించాలన్నా కష్టమే.అందుకే బయాలజీపై ఎక్కువ శ్రద్ధపెట్టాల్సిన అవసరముంది. ఇదివరకు సరిగా చదవకపోయినా, చదివినవి మర్చిపోయినా ఇప్పుడు దాన్ని సరిచేసుకునే అవకాశం ఉంది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వైద్య కళాశాలల్లో ప్రవేశానికి ఇంటర్ మార్కులతో సంబంధం లేదు. అందువల్ల జనవరి, ఫిబ్రవరిల్లో కొంత సమయం దాకా కూడా నీట్ ప్రవేశానికి అధ్యయనం చేసుకోవచ్చు. ఇంటర్‌లో రెండో సంవత్సరంలో ఉండే అంశాలపై ఫిబ్రవరిలో ఎక్కువ శ్రద్ధపెడితే రెండింటికీ ఉపయోగం. 720 మార్కుల్లో బయాలజీకి 360 ఉన్నాయి కాబట్టి ప్రత్యేక శ్రద్ధ, ప్రణాళిక అవసరం. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో అంశాలు క్షుణంగా, సూక్ష్మంగా చదవాలి. కొన్ని ప్రశ్నల్లో ప్రత్యేకించి పుస్తకాల్లో ఇచ్చిన పదాల, అంశాల ఆధారంగా మాత్రమే చేయగలిగినవి ఉంటాయి. పుస్తకాల్లో ఇచ్చిన పటాలను జాగ్రత్తగా గమనించాలి. పాఠ్యాంశాల్లో లేకపోయినా పటంలో ఉంటే వాటి గురించి తెలుసుకోవాలి. 11, 12 తరగతుల పుస్తకాల స్థాయికి మించిన ప్రశ్నలకు సిద్ధం కావాలంటే ముందుగా అందులోని అంశాలను ఎక్కువగా చదవాలి. ఆ తర్వాత మాత్రమే అదనపువాటిని ప్రయత్నించాలి. పుస్తకంలోని అంశాల ఆధారంగా దానికి అనుసంధాన అంశాలను చూసుకోవాలి.

మన దేశంలో ఇంటర్ తర్వాత ఎక్కువ శాతం మంది విద్యార్థులు అడుగులు వేస్తోంది ఇంజనీరింగ్ విద్య వైపే. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ/ ఐఐటీలు దేశంలోనే ప్రతిష్టాత్మక సాంకేతిక విద్యా సంస్థలు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థల్లోనూ ఇవి ముందుంటాయి. ఐఐటీలో చదివితే ఇక ఆ విద్యార్థి భవిష్యత్తు బంగారమే అనడంలో ఎటువంటి సందేహం లేదు. వార్షికంగా లక్షలాది రూపాయల ప్యాకేజీలను ఇచ్చి ఐఐటీ పట్టభద్రులను ఎగరేసుకుపోవడానికి దేశ, విదేశీ కంపెనీలు ఏటా పోటీ పడుతుంటాయి. ఐఐటీ విద్యా విధానానికి ఎంతో గుర్తింపు ఉందనడానికి ఇవే నిదర్శనాలు. వీటితోపాటు, నిట్, ఇతర ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల విధానం ఓ సారి చూద్దాం...



బంగారు భవిష్యత్తు

ఇంజనీరింగ్, టెక్నాలజీలో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీలను ఐఐటీలు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) అందిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ కోర్సులకు ఎంతో గుర్తింపు ఉంది. వృ త్తిపరమైన నైపుణ్యం విషయంలో ఐఐటీయన్లు ముందుంటారనే నమ్మకం కూడా ఉంది. దేశ, విదేశాల్లో ఐఐటీ పట్టభద్రులు ఎంతో మంది కీలక స్థానాల్లో తమ సత్తా చాటుతున్న విషయం తెలిసిందే.

ఐఐటీ కేంద్రాలు

దేశవ్యాప్తంగా 23 ఐఐటీ కేంద్రాలున్నాయి. ఏటా ఒక్కో ఐఐటీ విద్యా సంస్థ ప్రవేశ పరీక్ష బాధ్యతను చూస్తుంటుంది. అన్ని ఐఐటీ కేంద్రాల్లో సుమారు 9,600కు పైనే సీట్లున్నాయి. నాలుగేళ్ల బీటెక్, బీఫార్మసీ, ఐదేళ్ల బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ, ఎంటెక్ కోర్సులో ప్రవేశాలకు వీలుగా ఏటా రెండు దశలు (మెయిన్స్, అడ్వాన్స్‌డ్) పరీక్ష జరుగుతుంది. ప్రపంచంలో అత్యంత కఠినమైన పరీక్షల్లో ఇది కూడా ఒకటని పేరుంది. విదేశీ విద్యార్థులకు కూడా ఐఐటీ వంటి అత్యున్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు కల్పించేందుకు వీలుగా ఈ పరీక్షను అంతర్జాతీయంగా నిర్వహించనున్నారు. విదేశీ విద్యార్థులను నేరుగా అడ్వాన్స్‌డ్ కోర్సుకు అనుమతించనుండడం విశేషం.

అర్హత పరీక్ష



ఐఐటీలో ఉన్న సీట్లు వీటిలో ప్రవేశం కోసం ఏటా జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) జరుగుతుంది. ఇది రెండు దశలుగా ఉంటుంది. ముందు ఐఐటీ మెయిన్ రాసి అందులో సత్తా చాటిన మొదటి లక్షన్నర మందిని ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అనుమతిస్తారు. అడ్వాన్స్‌డ్‌లో వారు సాధించిన ర్యాంకు, టాప్ 20 పర్సంటైల్‌లో ఉన్న వారిని ప్రవేశాలకు పరిగణనలోకి తీసుకుంటారు. అంతకుముందు రాసిన పరీక్షల మార్కులు ఇక్కడ పరిగణనలోకి రావు. అవి కేవలం మెయిన్స్ పరీక్షకే పరిమితం.

ప్రవేశాలు

జేఈఈ రాస్తే ఐఐటీ, నిట్ సంస్థలతోపాటు బనారస్ హిందూ యూనివర్సిటీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ధన్ భాద్ లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ విద్యా సంస్థల్లోనూ ప్రవేశాలు పొందడానికి అర్హత లభిస్తుంది. అలాగే, ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ ఇన్ఫార్మేషన్ టెక్నాలజీ, సెంట్రల్ ఫుట్ వేర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (సీఎఫ్టీఐ)లలో అడ్మిషన్ పొందవచ్చు. కేంద్ర నిధులతో నడిచే అన్ని సాంకేతిక విద్యా సంస్థలు, రాష్ట్రాల నిధులతో నడిచే సాంకేతిక విద్యా సంస్థల్లో ప్రవేశాలకు కూడా జేఈఈ చెల్లుబాటు అవుతుంది.

మెయిన్ అర్హతల వివరాలు

12వ తరగతి పాసైన వారు, 12వ తరగతి పరీక్షలు రాస్తున్నవారు జేఈఈ మెయిన్‌లో పాల్గొనేందుకు అర్హులు. జేఈఈ మెయిన్‌కు సంబంధించి అఖిల భారత స్థాయిలో ర్యాంకులకు అభ్యర్థుల ఇంటర్ మార్కులకు వెయిటేజీ లేదు. అడ్మిషన్ పొందేందుకు 12వ తరగతిలో 75 శాతం మార్కులు తెచ్చుకుని ఉండాలి. లేదా 12వ తరగతి పరీక్షల్లో టాప్ 20 పర్సంటైల్ కలిగి ఉండాలి. అదే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అయితే 12వ తరగతిలో 65 శాతం మార్కులు కలిగి ఉన్నా అడ్మిషన్‌కు అర్హులే. గరిష్టంగా 23 ఏళ్లు దాటరాదు. 12వ తరగతిలో కనీసం ఐదు సబ్జెక్టులను అయినా చదివి ఉండాలి. మూడు సార్లు మాత్రమే జేఈఈ రాసేందుకు అర్హత ఉంటుంది. బీఈ, బీటెక్ లో ప్రవేశం పొందాలనుకునేవారు ఇంటర్‌లో ఏదేనీ ఒక లాంగ్వేజ్ సబ్జెక్ట్, ఫిజిక్స్, మేథమేటిక్స్ తప్పనిసరిగా చదివి ఉండాలి. అలాగే, కెమిస్ట్రీ, బయాలజీ, బయోటెక్నాలజీ, టెక్నికల్ వొకేషనల్ సబ్జెక్ట్ లలో ఒకదాన్ని చదవాలి. అలాగే, ఐదో సబ్జెక్ట్ కింద ఏదేనీ ఇతర సబ్జెక్ట్ చదివి ఉండాలి. బీ ప్లానింగ్ కోర్సులో ప్రవేశం కోరుకునే వారు ఇంటర్ లో మ్యాథమేటిక్స్ తో పాటు మరో నాలుగు సబ్జెక్టులను చదివి ఉండాలి. స్టేట్ బోర్డ్, సెంట్రల్ బోర్డ్ గుర్తింపు ఉన్న 12వ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ, ఐఎస్సీఈ ఇందుకు ఉదాహరణలు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల జాయింట్ సర్వీసెస్ వింగ్ పరీక్ష రాసిన వారు కూడా ఉత్తీర్ణులే.

ఐఐఐటీ రంగం

ఐటీ రంగానికి మానవ వనరుల కొరతను తీర్చేందుకు ఏర్పడినవే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫార్మేషన్ టెక్నాలజీ విద్యా సంస్థలు. వీటిని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తొలి ఐఐఐటీకి హైదరాబాద్ వేదికగా నిలిచింది. ఇంకా బెంగళూరు, గ్వాలియర్, అలహాబాద్, కాంచీపురం, కేరళ, భువనేశ్వర్, జబల్ పూర్, పుణె, ఢిల్లీ తదితర చోట్ల తర్వాత ఏర్పాటయ్యాయి. అండర్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో సీబీఎస్ఈ నిర్వహించే పరీక్ష ఇది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఉన్న 30 నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) సెంటర్లు, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు ఈ పరీక్ష అర్హతగా పనిచేస్తుంది. అఖిల భారత స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలో అభ్యర్థులకు ర్యాంకులు కేటాయిస్తారు.

బిట్స్ క్యాంపస్‌లు

పైన చెప్పుకున్న విద్యా సంస్థలతో పాటు ఇంజనీరింగ్ విద్యకు ప్రఖ్యాతిగాంచిన ఇతర విద్యా సంస్థలు కొన్ని ఉన్నాయి. వాటిలో బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) కూడా ఒకటి. బిట్స్ క్యాంపస్ లు పిలానీ, గోవా, హైదరాబాద్ లో ఉన్నాయి. వీటితో ఇంజినీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు గాను బిట్ శాట్ పరీక్ష ఏటా జరుగుతుంది. జేఈఈవలే ఇది కూడా చాలా కఠినమైన పరీక్షే అని చెబుతారు. పోటీ కూడా తీవ్రంగా ఉంటుంది. బిట్ శాట్ రాసే వారు దేశంలోని ఏదేనీ గుర్తింపు ఉన్న బోర్డు నుంచి 10, 12 చదివి ఉండాలి. ఫిజిక్స్, మేథమేటిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో 75 శాతం మార్కులు సంపాదించి ఉండాలి. దీనికి అదనంగా ప్రతీ సబ్జెక్టు పరంగా చూస్తే 60 శాతం మార్కులు ఉండాలి. ఇంగ్లీష్‌లో నైపుణ్యం కూడా ఇక్కడ చాలా కీలకం.

పరీక్షా విధానం

ఆన్ లైన్‌లో మూడు గంటల పాటు జరుగుతుంది. అబ్జెక్టివ్ లేదా మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతీ సరైన సమాధానానికి మూడు మార్కులు కలుస్తాయి. ప్రతి తప్పుడు సమాధానానికి ఒక మార్కు తగ్గిపోతుంది. పార్ట్ 1లో ఫిజిక్స్ 40 మార్కులకు, పార్ట్ 2లో కెమిస్ట్రీ 40 మార్కులకు, పార్ట్ 3లో ఇంగ్లీష్ ప్రొఫీషియన్సీ 15 మార్కులకు, లాజికల్ రీజనింగ్ 10 మార్కులకు, పార్ట్4 కింద మేథమేటిక్స్ 45 మార్కులకు మొత్తం 150 మార్కులకు పరీక్ష జరుగుతుంది.



వేలూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ

తమిళనాడులో ఉన్న వేలూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) కూడా ఇంజనీరింగ్ విద్య పరంగా పేరొందినది. ఈ సంస్థ ఏటా ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహిస్తుటుంది. గుర్తింపు ఉన్న ఇంటర్ బోర్డు నుంచి 10, 12 లేదా ప్రీ యూనివర్సిటీ ఎగ్జామినేషన్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ అందించే హై స్కూల్ సర్టిఫికెట్ లేదా ఇంటర్నేషనల్ బకాలరేట్ డిప్లోమా లేదా అడ్వాన్స్‌డ్ లెవల్ జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ రాసిన వారు వేలూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కోర్సులకు అర్హులు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్/బయాలజీలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలు అయితే 50 మార్కులున్నా సరిపోతుంది. వీఐటీఈఈఈలో అభ్యర్థులు 160 మార్కులకు పరీక్ష రాయాల్సి ఉంటుంది. రెండున్నర గంటల పాటు జరుగుతుంది. తప్పుడు జవాబులకు నెగటివ్ మార్కులు లేవు.



మెయిన్ వర్సెస్ అడ్వాన్స్‌డ్

మెయిన్‌లో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్ 1 బీఈ, బీటెక్‌లో ప్రవేశాలకు ఉద్దేశించినది. పేపర్ 2 కేవలం బీఆర్క్, బీ ప్లానింగ్ లో ప్రవేశాల కోసం రాయాల్సినది. మెయిన్స్‌లో క్వాలిఫై అయిన వారు మాత్రమే అడ్వాన్స్ డ్ రాసేందుకు అర్హులు. అడ్వాన్స్‌డ్ పరీక్ష రెండు పేపర్లుగా మూడు గంటల పాటు జరుగుతుంది. జాతీయ స్థాయి ఇంజనీరింగ్ ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్ లో ఉత్తీర్ణత సాధించి అడ్వాన్స్ డ్ లో పాస్ కాని వారు ఐఐఐటీ, సీఎఫ్టీఐలలో ప్రవేశాలకు అర్హులే. ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలు పొందాలంటే కచ్చితంగా అడ్వాన్స్ డ్ లోనూ పాసవ్వాల్సి ఉంటుంది. జేఈఈ మెయిన్‌లో ఎక్కువ స్కోర్ చేసి తర్వాత అడ్వాన్స్‌డ్ లోనూ ఉత్తీర్ణత సాధిస్తే ఐఐటీ, ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ లో సీటు దాదాపుగా ఖాయం అయినట్టే. ఐఐఎస్ఆర్, ఆర్జీఐపీటీ వంటి ఇతర ప్రముఖ విద్యా సంస్థలు సైతం జేఈఈ అడ్వాన్స్ డ్ స్కోర్ ను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. కాకపోతే ఐఐటీ కౌన్సిలింగ్ లో ఇవి పాల్గొనవు. ఏటా నవంబర్ మూడో వారంలో జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు ప్రక్రియ ఉంటుంది. ఏప్రిల్ మొదటి వారంలో పరీక్ష జరుగుతుంది. ఫలితాలు మే మొదటి వారంలో విడుదల అవుతాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు మే మొదటి వారంలో దరఖాస్తులు స్వీకరిస్తారు. పరీక్ష జూన్ నెలలో జరుగుతుంది. ఏటా లక్షల సంఖ్యలో ఈ పరీక్షలకు పోటీ పడుతుంటారు.





మణిపాల్ యూనివర్సిటీ

మణిపాల్ యూనివర్సిటీ తన గుర్తింపు ఉన్న అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు ఏటా ఎంయూ సెట్ నిర్వహిస్తోంది.

దీన్ని రాయాలంటే అభ్యర్థులు 10, 12 రాసి ఉండాలి. ఇంటర్నేషనల్ బకాలరేట్ లేదా అమెరికన్ 12వ గ్రేడ్ లేదా ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, ఏదేనీ ఒక ఆప్షనల్ సబ్జెక్ట్ లలో 50 శాతం మార్కులు సంపాదించుకోవాలి. ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, ఇంగ్లిష్ తప్పనిసరిగా చదివి ఉండాలి. కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, బయాలజీ అన్నవి ఆప్షనల్ సబ్జెక్టులు. రెండున్నర గంటల పాటు పరీక్ష జరుగుతుంది. 200 ప్రశ్నలు ఉంటాయి. అందులో ఫిజిక్స్ కు 50, కెమిస్ట్రీకి 50, మ్యాథమేటిక్స్ కు 70 మార్కులు, ఇంగ్లిష్ అండ్ జనరల్ ఆప్టిట్యూడ్ విభాగం నుంచి 30 ప్రశ్నలు ఉంటాయి.

‘బోల్ట్’ క్లబ్‌లో రిక్షా కార్మికుని కొడుకు



న్యూఢిల్లీ: ఇటుకలతో కట్టిన గోడలు.. ప్లాస్టిక్ షీట్లతో పైకప్పు. దీనినే అతను తనకున్న రాజ మహల్‌గా భావిస్తాడు. ఈ పూరిల్లు దేశ రాజధానిలోని ఆజాపూర్‌లో బడాబాఘ్ స్లమ్ ఏరియాలోని రైల్వే ట్రాక్ పక్కనే ఉంది. రైలు వెళ్లిన ప్రతిసారీ ఆ ఇల్లు దడ దడ వణుకుతుందే తప్ప కూలడానికి ఏ మాత్రం అంగీకరించదు. ఈ ఇంటి అంశాన్ని పక్కన పెడితే నిసార్ అహ్మద్ అనే కుర్రాడు త్వరలో కింగ్‌స్టన్ (జమైకా)లోని రేసర్స్ ట్రాక్ క్లబ్‌లో శిక్షణ తీసుకోనున్నాడు. ఇక్కడే జమైకాకు చెందిన అథ్లెటిక్ సూపర్ స్టార్ ఉసేన్ బోల్ట్ కోచ్ గ్లెన్ మిల్స్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. అహ్మద్ తండ్రి రిక్షా కార్మికుడు. తల్లి ఇంటిపట్టునే ఉంటుంది. ప్రపంచంలోనే అత్యంత ప్రముఖ ట్రాక్ అండ్ ఫీల్డ్ క్లబ్‌లో శిక్షణ తీసుకునేందుకు 14 మంది వర్ధమాన అథ్లెట్లు ఎంపికయ్యారు. కేరళ, తమిళనాడు, ఉత్తరాఖండ్, ఒడిషా, ఢిల్లీలకు చెందిన 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్కులు ఈ శిక్షణకు ఎంపికయ్యారు. వీరికి రేసర్స్ ట్రాక్ క్లబ్‌లో శిక్షణ ఇప్పించేందుకు గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (జీఎఐఎల్), స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ కంపెనీ, ఆంగ్లియన్ మెడల్ హంట్ ముందుకు వచ్చాయి. ఈ యువ అథ్లెట్ల శక్తి సామర్థ్యాలను పరిశీలించిన ఆ క్లబ్ వీరికి నాలుగు వారాల పాటు శిక్షణ ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ ప్రతిభావంతుడైన అహ్మద్ తన పేదరికాన్ని జయించి తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచాడు. ‘నా తల్లిదండ్రులు ఏదో ఒక రకంగా మాకు భోజనం సిద్ధం చేస్తున్నారు’ అని అహ్మద్ ధిక్కార స్వరంతో అన్నాడు. అతని తల్లి సఫికునిషా పట్టరాని ఆనందాన్ని వ్యక్తం చేసింది. ‘వీడు చిన్నతనంలోనే చాలా ఫాస్ట్‌గా పరుగెత్తేవాడు. వాణ్ణి ఎవ్వరూ పట్టుకోలేకపోయేవారు’ అని ఆమె చెప్పింది. ఇటీవల జరిగిన ఢిల్లీ స్టేట్ అథ్లెటిక్స్ మీట్‌లో గవర్నమెంట్ బాయ్స్ సెకండరీ స్కూల్‌కు చెందిన అశోక్ విహార్ అనే విద్యార్థి అండర్-16 విభాగం షార్ట్ స్ప్రింట్స్‌లో రెండు నేషనల్ రికార్డులను బద్దలు కొట్టి రెండు స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నాడు. 100 మీటర్ల పరుగుల పందెంలో 11 సెకన్లకే లక్ష్యాన్ని చేరుకుని 0.02 సెకన్లను సేవ్ చేశాడు. మరోవైపు అహ్మద్ 200 మీటర్ల పరుగు పందెంలో 22.11 సెకన్లను బద్దలు కొట్టి 22.08 సెకన్లకే లక్ష్యాన్ని చేరుకున్నాడు. ఎన్నో కోరికలున్నా తన పేదరికం అహ్మద్‌ను నిరాశ పరిచేది. ‘నాతో పాటు శిక్షణ తీసుకునే స్నేహితుల్లో కొంత మంది తమ పెద్ద ఇళ్లకు అప్పుడప్పుడు ఆహ్వానించేవాళ్లు. కానీ వాళ్లను నేను ఎన్నడూ మా ఇంటికి పిలవలేదు. ఎందుకంటే మా ఇంట్లో వాళ్లు కూర్చోడానికి కూడా స్థలం లేదు’ అని అహ్మద్ విచారంతో నిట్టూర్పు విడిచాడు. 10 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు ఉన్న ఆ ఇరుకైన ఇంట్లో తన సోదరి, తల్లిదండ్రులతో అహ్మద్ ఉంటున్నాడు. ఆ ఇంటి ముందే డ్రైనేజీ కాలువ ఉంది. ‘దేవుడు ఎందుకు నాకింత కఠినమైన జీవితాన్ని ఇచ్చాడని కొన్నిసార్లు ఏడ్చేవాడిని. కానీ ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు కష్టపడాలని ఈ పేదరికం నుంచి స్ఫూర్తి పొందాను’ అని అహ్మద్ చెప్పాడు. ‘అహ్మద్ చెప్పులు లేకుండానే పరుగెత్తేవాడు. నేనే అతనికి శిక్షణ ఇచ్చాను. కానీ అతని ప్రతిభకు సరైన శిక్షణ ఇస్తే బాగుంటుందని భావించాను’ అని 2013లోనే అహ్మద్‌లోని ప్రతిభను గుర్తించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) సురేంద్ర సింగ్ గుర్తు చేసుకున్నారు.

కష్టాలు అందరికీ ఉంటాయి. వారి వారి స్థితిగతులను బట్టి కొందరికి ఎక్కువగా, కొందరికి తక్కువగా ఉంటాయి. కానీ కష్టాలను గుర్తు చేసుకుంటూ కుమిలి పోకూడదు. వాటిని జయించేందుకు కృషి చేసినప్పుడు తప్పకుండా ఆ కష్టాలు తొలగిపోయి మంచి రోజులు వస్తాయి.

చెమటోడుస్తున్న బౌలర్లు



సౌతాఫ్రికా సవాల్‌కు సిద్ధపడుతున్న కోహ్లీ సేన

కేప్‌టౌన్: ఇండియా, సౌతాఫ్రికా సిరీస్ ప్రారంభానికి రోజులు దగ్గరపడుతున్న కొద్దీ ప్రొటీస్‌ను టీమిండియా నిలువరిస్తుందని, తొలిసారి సౌతాఫ్రికాను వారి సొంత గడ్డపై ఓడించి సిరీస్‌ను కైవసం చేసుకుని విరాట్ కోహ్లీ సేన చరిత్ర సృష్టిస్తుందని కొంత మంది క్రికెట్ నిపుణులు భావిస్తున్నారు. మంగళవారం భారత బౌలర్లు నెట్స్‌లో చెమటోడుస్తున్న వీడియోను బీసీసీఐ పోస్ట్ చేసింది. ‘బౌలర్లు ఇప్పుడిప్పుడే రిథమ్ అందుకుంటుండం ఆనందంగా ఉంది’ అని ఆ వీడియోకు బీసీసీఐ ట్విట్టర్‌లో క్యాప్షన్ పెట్టింది. మహ్మద్ షమీ, ఉమేష్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, ఇషాంత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్య వంటి అనేక మంది ఫాస్ట్ బౌలర్లపై టీమిండియా అదృష్టం ఆధారపడివుంది. కాగా స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా ఈ ఫాస్ట్ బౌలర్లకు అండగా నిలిచే పాత్ర పోషించనున్నారు.

ఎన్నో పాఠాలు నేర్చుకున్నా: బుమ్రా

అంతకుముందు జస్‌ప్రీత్ బుమ్రా మాట్లాడుతూ.. వైట్ బాల్ నుంచి రెడ్ బాల్‌కు ఎలా వచ్చాడో తెలియజేశాడు. ‘నేను తొలుత వన్డే జట్టులోకి వచ్చాను. కానీ ఇప్పుడు టెస్టు జట్టులోనూ నాకు చోటు దక్కడం ఆనందంగా ఉంది. సీనియర్ బౌలర్లు, బౌలింగ్ కోచ్‌ల వద్ద అనేక పాఠాలు నేర్చుకున్నాను’ అని బుమ్రా చెప్పాడు.

విభిన్నమైన సవాళ్లు: భువీ

‘సౌతాఫ్రికా పర్యటనకు వెళుతున్నామనగానే మన మనసులో మెదిలే ఏకైక ఆలోచన ఇక్కడి బౌన్సీ వికెట్లు. కానీ మ్యాచ్ సమయానికి ఎటువంటి పిచ్ తయారవుతుందో ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి. మ్యాచ్‌కు ఎత్తుగడలపై మేము ఇంకా మాట్లాడుకోలేదు. మా దృష్టంతా ప్రాథమిక అంశాలపైనే ఉంది. బహుశా ఒకటి రెండ్రోజుల్లో తొలి టెస్టుకు బ్యాటింగ్ వ్యూహం రచించే అవకాశముంది’ అని స్వింగ్ స్పెషలిస్ట్ భువనేశ్వర్ కుమార్ అన్నాడు. సౌతాఫ్రికాలో టీమిండియా 17 టెస్టు మ్యాచ్‌లు ఆడింది. రెండింటిలో గెలిచి ఎనిమిదింటిలో ఓటమిపాలైంది. ఏడు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.

గాంధీ, మండేలా స్ఫూర్తి

ఇండియా, సౌతాఫ్రికా సిరీస్‌ను అత్యంత ఉత్కంఠ భరితంగా నిర్వహించేందుకు క్రికెట్ సౌతాఫ్రికా అన్ని ఏర్పాట్లూ చేస్తోంది. ఈ సిరీస్‌లో మహాత్మా గాంధీ, నెల్సన్ మండేలా స్ఫూర్తి ప్రస్ఫుటంగా కనిపించేలా ఈ సిరీస్‌కు ‘ఫ్రీడం సిరీస్’ అని పేరు పెట్టిన సంగతి తెలిసిందే. 1992లో టీమిండియా తొలిసారి సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లింది. వర్ణవివక్ష కాలాన్ని పూర్తి చేసుకున్న తర్వాత సౌతా ఫ్రికా అంత ర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చింది. ఆ సిరీస్‌కు ‘ఫ్రెండ్‌షిప్’ సిరీస్ అని పేరు పెట్టారు. మహ్మద్ అజారుద్దీన్ టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించగా.. క్లైవ్ రైస్ సౌతాఫ్రికా పగ్గాలు చేపట్టాడు. ఆ పర్యటనలో టీమిండియా నాలుగు టెస్టులు, ఏడు వన్డే మ్యాచ్‌లు ఆడింది. ఆతిథ్య సౌతాఫ్రికా జట్టు టెస్టు సిరీస్‌ను 1-0తో, వన్డే సిరీస్‌ను 5-2తో నెగ్గింది.



బుక్స్ చదువుతూ ఒత్తిడి తగ్గించుకుంటాను!

టీవీ షోలో మిథాలీ రాజ్



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌లో గత ఏడాది జరిగిన ఐసీసీ మహిళల వరల్డ్ కప్‌లో భారత జట్టును ఫైనల్ వరకు తీసుకెళ్లడంతో హైదరాబాద్ స్టార్ ప్లేయర్, కెప్టెన్ మిథాలీ రాజ్‌కు ఎనలేని పేరు ప్రఖ్యా తులు వచ్చాయి. ఆ టోర్నీలో 7వ ర్యాంక్ జట్టుగా బరిలోకి దిగిన మిథాలీ సేన అన్ని జట్లకు షాకిచ్చి ఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాకు ఓడించిన మిథాలీ సేన ఫైనల్లో ఇంగ్లండ్ చేతిలో ఓటమి పాలైంది. ట్రోఫీ గెలవలేకపోయినప్పటికీ అసాధారణ పోరాట పటిమను ప్రదర్శించిన మిథాలీ సేనకు భారత్‌లో తొలిసారి ఘన స్వాగతం లభించింది. టీఈడీ టాక్స్‌లో భాగంగా ఇండియా నయా సోచ్ (భారత్ కొత్త ఆలోచన) అనే టీవీ షోలో ఇటీవల మిథాలీ రాజ్ పాల్గొంది. బాలీవుడ్ నటుడు షారూఖ్ ఖాన్ ఈ షోకు యాంకరింగ్ చేశాడు. ఈ సందర్భంగా మిథాలీ మాట్లాడుతూ.. మ్యాచ్ సమయంలో తాను ఎందుకు బుక్స్ చదువుతుందో తెలిపింది. తన కెరీర్ సక్సెస్ సీక్రెట్స్‌ను కూడా వివరించింది. ఒత్తిడిని తగ్గించుకునేందుకు తాను మ్యాచ్ సమ యంలో బుక్స్ చదువుతానని మిథాలీ చెప్పింది. ‘మేము ఫీల్డ్ లో ఉన్నప్పుడు.. అందరూ మమ్మల్నే చూస్తున్నప్పుడు.. మేమ ంతా గేమ్‌పైనే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రతి ఒక్కరూ తమ ఉత్తమ ప్రతిభ కనబరచాల్సిన బాధ్యత మా అందరిపై ఉంది. ఒత్తిడిని తగ్గించుకునేందుకే నేను మ్యాచ్ సమయంలో బుక్స్ చదువుతాను. ప్రశాంతంగా ఉండేందు.. సత్తా చాటేం దుకు ఇది నాకు చాలా ఉపయోగపడుతుంది’ అని మిథాలీ పేర్కొంది.

ఇటీవల మిథాలీ ప్రతిభను ప్రశంసిస్తూ.. ‘ఏదో ఒక రోజు నిన్ను పురుషుల జట్టు కోచ్‌గా చూడాలనుంది’ అని షారూఖ్ అన్నాడు. దీనికి మిథాలీ సమాధానమిస్తూ.. ‘నేను ఎల్లప్పుడు ఉత్తమ ప్రదర్శన ఇచ్చేందుకే ఇష్టపడతాను’ అని చెప్పింది. వన్డే ఫార్మాట్‌లో మిథాలీ అల్ టైమ్ అత్యధిక పరు గులు చేసిన క్రికెటర్‌గా నిలిచింది. అంతేకాకుండా వరల్డ్ కప్ మ్యాచ్‌ల్లో 1000 పరుగుల మైలురాయిని దాటిన ఏకైక బ్యాట్స్ వుమన్‌గా ఘనత సాధించింది. ఈ ఇండియా నయా సోచ్ అనే ఎపిసోడ్ ఈ నెల 7వ తేదీన స్టార్ ప్లస్‌లో ప్రసారం కానుంది.

సీఎస్‌కేకు ధోనీ.. ముంబైకి రోహిత్



న్యూఢిల్లీ: చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్లు తమ నిషేధ కాలాన్ని పూర్తి చేసుకుని మళ్లీ బరి లోకి దిగనున్న నేప థ్యంలో ఐపీఎల్-2018 అత్యంత ఉత్కంఠ భరితంగా సాగే అవకాశముంది. ఈ సందర్భంగా రెండు ముఖ్యమైన తేదీలను మనం గుర్తుంచుకోవాలి. ఐపీఎల్-2018 ప్లేయర్స్ వేలం ఈ నెల 28న బెంగళూరులో జరగనుంది. దీంతో ఎవరినైతే కొనసాగించాలనుకుంటున్నారో ఆ ముగ్గురు క్రికెటర్ల పేర్లను చెప్పమని ఫ్రాంచైజీలను ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అడగనుంది. అంతేకాకుండా రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) కార్డ్ ద్వారా మరో ఇద్దరు క్రికెటర్లను కొనసాగించొచ్చు. అయితే గ్యారీ కిర్‌స్టెన్, ఆశిష్ నెహ్రా కోచింగ్ స్టాఫ్‌లో చేరడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మరింత పటిష్టంగా మారింది. ఐపీఎల్ 2018 ప్లేయర్స్ వేలం ఈ నెల 28న జరగనుంది. చాలా మంది క్రికెటర్లు ఈ వేలంలో తమ ఆర్థిక అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అయితే ఎవరెవరిని తాము కొనసాగించాలనుకుంటున్నారో వారి పేర్లను 4వ తేదీన ఫ్రాంచైజీలు తెలియజేయాల్సివుంది. ఈ నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ఎంఎస్ ధోనీ, రవీంద్ర జడేజా, సురేష్ రైనాలను, ముంబై ఇండియన్స్ రోహిత్ శర్మ, పాండ్య సోదరులను కొనసాగించే అవకాశముంది.

ఇండోర్‌లో టీమిండియా నెట్ ప్రాక్టీస్

వివరాలను తెలిపిన రోహిత్ శర్మ

సౌతాఫ్రికా పర్యటనలో ఉన్న టీమిండియా నెట్ ప్రాక్టీస్‌పై రోహిత్ శర్మ ఓ వీడియో తీసి బీసీసీఐ.టీవీలో అప్‌లోడ్ చేశాడు. సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్ కోసం టీమిండియా కేప్‌టౌన్‌లో సిద్ధమవుతోంది. అయితే అక్కడ వర్షాలు పడుతుండడంతో కోహ్లీ సేన ఇండోర్‌లో ప్రాక్టీస్ చేయాల్సి వస్తోంది. ఈ వీడియోలో కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లీ, అజింక్య రహానే బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా.. రోహిత్ శర్మ తన వంతు కోసం ఎదురు చూస్తున్నాడు. ‘నెట్ నంబర్-1లో అజింక్య రహానే, నెట్ నంబర్-2లో కేఎల్ రాహుల్, నెట్ నంబర్-3లో విరాట్ కోహ్లీ ప్రాక్టీస్‌ను మీరు చూడొచ్చు’ అని రోహిత్ చెప్పాడు. బ్యాట్స్‌మెన్‌కు కోచ్ స్టాఫ్ చేస్తున్న సహాయాలను కూడా రోహిత్ పేర్కొన్నాడు. ఫీల్డింగ్ కోచ్ ఆర్ శ్రీధర్ బౌలింగ్ మెషిన్‌తో రహానే వద్ద ఉండగా.. త్రో-డౌన్ స్పెషలిస్ట్ రఘు కేఎల్ రాహుల్‌తో ఉన్నారు. ఇక కోహ్లీతో బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్, ప్రధాన్ కోచ్ రవిశాస్త్రి ఉన్నారు. మరోవైపు భరత్ అరుణ్‌తో మురళీ విజయ్ ఏదో మాట్లాడుతున్నాడు. ‘విజయ్ ఏదో బౌలింగ్ టిప్స్ అడుతున్నట్టుంది’ అని రోహిత్ నవ్వుతూ అన్నాడు. ఇండియా, సౌతాఫ్రికా జట్ల మధ్య శుక్రవారమిక్కడ తొలి టెస్టు ప్రారంభమవుతుంది. ఆ తర్వాత సెంచూరియన్, జొహాన్నెస్‌బర్గ్‌లలో మరో రెండు టెస్టు మ్యాచ్‌లు జరుగుతాయి. తర్వాత ఆరు మ్యాచ్‌ల వన్డే సిరీస్, ఆ తర్వాత మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లు జరుగుతాయి.

వ్యవహ రించనున్నారు. మరోవైపర ట్రెంట్ వుడ్‌హిల్, ఆండ్రూ మెక్‌డొనాల్డ్‌కు ఆర్‌సీబీ కొత్త బాధ్యతలను అప్పగించింది. వుడ్‌హిల్ బ్యాటింగ్ టాలెంట్ డెవలప్‌మెంట్, అనలిటిక్స్, ఫీల్డింగ్ కోచ్ బాధ్యతలను నిర్వర్తిస్తారు. మ్యాచ్‌లు

స్టార్ స్పోర్ట్స్‌లో...

ప్లేయర్ రిటెన్షన్ ఈవెంట్ ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఈ ఏడాది ఐపీఎల్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి. అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్న ఐపీఎల్ ఆటగాళ్ల వేలం ఈ నెల 27, 28 తేదీల్లో బెంగళూరులో జరగనుంది. అయితే ప్లేయర్ రిటెన్షన్ పద్ధతి ద్వారా లేదా ఇటీవలే కొత్తగా ప్రవేశపెట్టిన రైట్ టు మ్యాచ్ కార్డ్ ద్వారా గానీ ఒక్కో జట్టు ఐదుగురు ఆటగాళ్లను తమ వద్దే ఉంచుకోవచ్చు (ప్లేయర్ రిటెన్షన్) అని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఇటీవలే ప్రకటించింది. ఐపీఎల్ ఆటగాళ్ల వేలానికి ముందు ప్లేయర్ రిటెన్షన్ ఈవెంట్ 4వ తేదీన (గురువారం) ముంబైలో జరుగుతుంది. ఈ ఈవెంట్ స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. ఇంతకుముందు ఈ ప్లేయర్ రిటెన్షన్‌ను ఇ-మెయిల్స్ ద్వారా నిర్వహించేవాళ్లు. ‘ఐపీఎల్ అంటే డబ్బు ఆర్జించడమొక్కటే కాదన్న విషయాన్ని అందరికీ తెలియజేయాలని ఈ ప్లేయర్ రిటెన్షన్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. టీమ్‌ను అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నాం. ఐపీఎల్ కవరేజ్‌ను రిటెన్షన్ ద్వారా ప్రారంభించాలని భావిస్తున్నాం. ఈ రిటెన్ ప్లేయర్స్ జట్టును ఎంపిక చేస్తారు’ అని స్టార్ అధికారి ఒకరు చెప్పారు. 2018 నుంచి 2022 వరకు ఐపీఎల్ మీడియా హక్కులను గత సెప్టెంబర్‌లో స్టార్ ఇండియా సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

ఆర్‌సీబీ కోచింగ్ స్టాఫ్‌లో కిర్‌స్టెన్, నెహ్రా



బెంగళూరు: ఐపీఎల్ -11కు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవలే రిటైర్మెంట్ ప్రకటించిన ఆశిష్ నెహ్రాతో పాటు టీమిండియా మాజీ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్‌ను కోచింగ్ స్టాఫ్‌గా తీసుకున్నామని ఆర్‌సీబీ మంగళవారం ప్రకటించింది. ‘సౌతాఫ్రికా క్రికెటర్ గ్యారీ కిర్‌స్టెన్, టీమిండియా మాజీ ఫాస్ట్ బౌలర్ ఆశిష్ నెహ్రా బ్యాటింగ్, బౌలింగ్ కోచ్‌లు వ్యవహరిస్తారు. అంతేకాకుండా ఐపీఎల్ సమయంలో వీరిద్దరు మెంటర్లుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు’ అని ఆర్‌సీబీ ఒక ప్రకటనలో తెలిపింది. కానీ న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, స్పిన్నర్ డేనియెల్ వెట్టోరీ ప్రధాన కోచ్‌గా లేని సమయంలో ఈ ఆస్ట్రేలియన్ ఫ్రాంచైజీ స్కాటింగ్ హెడ్‌గా వ్యవహరిస్తారు. గతంలో బౌలింగ్ కోచ్‌గా ఉన్న మెక్ డొనాల్డ్ ఇప్పుడు బౌలింగ్ టాలెంట్ డెవలప్‌మెంట్, అనలిటిక్స్ బాధ్యతలను నిర్వర్తిస్తారు. ‘ఆర్‌సీబీ కోచింగ్ స్టాఫ్‌లోకి గ్యారీ, ఆశిష్‌లను సంతోషంగా ఆహ్వానిస్తున్నాను. వీళ్లిద్దరికీ క్రికెట్‌లో చాలినంత అనుభవముంది. వాళ్ల అనుభవం జట్టులోని యువకులకు ఎంతో ఉపయోగపడుతుంది. వీరి రాకతో ఈ సీజన్ అసాధారణంగా ఉంటుందని భావిస్తున్నాను’ అని వెట్టోరి అన్నారు.

సైనా జట్టు హ్యాట్రిక్

అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌పై గెలుపు ● ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్



లక్నో: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో సైనా నెహ్వాల్ నేతృత్వం వహిస్తున్న అవధె వారియర్స్ జట్టు హ్యాట్రిక్ విజయం సాధించింది. మంగళవారమిక్కడ జరిగిన మ్యాచ్‌లో వారియర్స్ జట్టు 4-3తో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌ను చిత్తు చేసింది. అవధె వారియర్స్, అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్ తొలుత జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో వారి యర్స్‌కు చెందిన టాంగ్ చున్ మన్, క్రిస్టియానా పెడెర్సెన్ జోడీ 2-1 (14-15, 15-12, 15-14)తో మాస్టర్స్‌కు చెందిన లా చుక్ హిమ్, కమిల్ల రిట్టర్ జుహల్ ద్వయాన్ని చిత్తు చేసింది. దీంతో వారియర్స్ జట్టు 1-0తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్‌లో వారియర్స్ ఆటగాడు పారుపల్లి కశ్యప్ 2-1 (11-15, 15-13, 1514)తో మాస్టర్స్ ఆటగాడు సౌరభ్ వర్మపై పోరాడి గెలిచాడు. దీంతో వారియర్స్ ఆధిక్యం 3-0కు పెరిగింది. తర్వాత జరిగిన మరో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో వారియర్స్‌కు చెందిన కిదాంబి శ్రీకాంత్ 0-2 (8-15, 11-15)తో మాస్టర్స్‌కు చెందిన హెచ్‌ఎస్ ప్రణయ్ గెలుపొందాడు. దీంతో మాస్టర్స్ జట్టుకు తొలి పాయింట్ లభించింది. తర్వాత జరిగిన మహిళల సింగిల్స్‌లో వారియర్స్‌కు చెందిన సైనా నెహ్వాల్ 0-2తో (5-15, 14-15)తో మాస్టర్స్‌కు చెందిన ఐ జు యింగ్ చేతిలో ఓటమిపాలైంది. దీంతో మాస్టర్స్ జట్టు 3-3తో సమమైంది. చివరిగా జరిగిన పురుషుల డబుల్స్‌లో వారియర్స్‌కు చెందిన టాంగ్ చున్ మన్, హెంద్రా సెటియావన్ జోడీ02-0 (15-14, 15-10)తో మాస్టర్స్‌కు చెందిన లీ చున్ హీ రెగినాల్డ్, కె. నందగోపాల్ ద్వయాన్ని ఓడించింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.